అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 17-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 167 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50



నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరు మార్పు

కాంగ్రెస్ ఆగ్రహం వివరాలు 5లో..

ఆపరేషన్ హస్తం

ఢిల్లీ నుంచి హాట్‌లైన్

- బయటకు పొక్కకుండా పక్కా ప్లాన్
- కాంగ్రెస్ వైపు కోదండరాం అడుగులు
- పొంగులేటి, జూపల్లితో చర్చలు పూర్తి
- కోడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డితో రేవంత్ భేటీ
- రేవంత్ సమక్షంలో ఉధృతంగా చేరికలు

కర్నాటక ఫలితాల తర్వాత జోరుమీదున్న హస్తం పార్టీ... తెలంగాణలో సైతం అదే స్థాయిలో ఫలితాలను రాబట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా ఢిల్లీ హైకమాండ్ దిశా నిర్దేశంతో... కన్నడ నాట బీజేపీతో 'ఢీ అంటే ఢీ' అన్న శివకుమార్ మార్గదర్శకత్వంలో వడివడిగా అడుగులేస్తున్నది. ఈ క్రమంలో అధికార బీఆర్ఎస్‌తోపాటు బీజేపీలోని రెండో తరగతి నేతలు, ఇతర చిన్నా చితకా పార్టీల్లోని సీనియర్లు, అధ్యక్ష స్థాయి నాయకులను తనవైపునకు లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవలి పరిణామాల్లో ఈ 'ఆపరేషన్ హస్తం' సంకేతాలు స్పష్టంగానే కనబడుతున్నాయి.



గుడిగ రఘు

బీజేపీని అడ్డుకునేందుకు, బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ 'ఆపరేషన్ తెలంగాణ' షురూ చేసింది. రానున్న ఎన్నికల్లో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు అస్త్రశస్త్రాలను బయటకు తీస్తున్నది. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు హాట్‌లైన్ ద్వారా ఆపరేషన్ తెలంగాణను పర్యవేక్షిస్తున్నది. బీజేపీ, బీఆర్ఎస్ కదలికలను పసిగడుతూనే...పార్టీని బలోపేతం చేసే పనిలో పడింది. ఏదీ చేసినా పక్కా ప్లాన్‌తో బయటకు పొక్కకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నది. ఆ రెండు పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులను ఆకర్షించడంతోపాటు పెద్ద తలకాయలపై ఫోకస్ చేసింది. అందులో భాగంగానే గత మూడు, నాలుగు రోజులు ఆదిలాబాద్, నిర్మల్, షాద్‌నగర్, ఉప్పల్, అచ్చంపేట, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల నుంచి చాలా మంది నాయకులు కారు దిగారు.

కోదండరాంపై ఫోకస్

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంపై కాంగ్రెస్ ఫోకస్ చేసింది. ఆయనతో పలువురు నాయకులు భేటీ ...2లో

కారు, కమలం అసంతృప్తులపై నజర్

టికెట్లు రావనుకున్న నేతలు, ఆయా పార్టీల్లో సరైన గుర్తింపు లేకుండా అసంతృప్తిగా ఉన్న నాయకులను గుర్తించి, ఎలాగైనా సరే వారిని పార్టీలో చేర్పించేందుకు హస్తం పార్టీ భారీ ప్రణాళికనే సిద్ధం చేసినట్టు గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. ఏ విషయంలోనూ తగ్గకుండా అధికార పార్టీలను ఢీ కొట్టేందుకు క్యాడర్‌ను సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. అందులో భాగంగానే కోడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డితో రేవంత్‌రెడ్డి భేటీ కావడం, పార్టీలో చేరేందుకు ఆయన అంగీకరించడంతో పార్టీకి ...2లో

దుర్మార్గం

హరగోపాల్,ఇతరులపై ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలి : వామపక్ష పార్టీల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు ఇతరులపై నమోదు చేసిన ఉపా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు తమ్మినేని వీరభద్రం (సీపీఐఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఐఎంఎల్ ప్రజాపంథా), వేములపల్లి వెంకట్రామయ్య (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), సాదినేని వెంకటేశ్వరరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), గాదగోని రవి (ఎంసీపీఐయూ), సిహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), బి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (ఆరెస్పీ), మూర్తి (సీపీఐఎంఎల్ లిబరేషన్), ప్రసాదన్న (సీపీఐఎంఎల్) సంయుక్తంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర హక్కుల నేత హరగోపాల్ నిరంతరం ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, ప్రభుత్వానికి ...5లో



ప్రత్యామ్నాయమంటే ఇదేనా?


- ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

న్యూఢిల్లీ : ప్రొఫెసర్ హరగోపాల్‌పై ఉపా చట్టాన్ని ఉపసంహరించాలని, ప్రజలకు ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. అప్పుడే ముఖ్యమంత్రి చెప్పే ప్రజాస్వామ్యానికి ...5లో

కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రొఫెసర్ హరగోపాల్, తదితరులకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో ఉపా చట్టాన్ని ప్రయోగించడాన్ని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవి రాఘవులు తీవ్రంగా ఖండించారు. ఈ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని శుక్రవారం ...5లో

వ్యక్తులు కాదు.. వ్యవస్థ ముఖ్యం
- కాచిగూడ వార్డు ఆఫీస్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్ వివరాలు 5లో..

రాష్ట్రపతికి ఘన స్వాగతం..
- నేడు దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి... వివరాలు 5లో..

19 తర్వాతే నైరుతి రుతుపవనాలు
- పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక వివరాలు 2లో..

నవతెలంగాణ

అరాచక పాలనను భరించే ఓపిక లేదు

- కేసీఆర్‌ను గద్దెదించాల్సిందే... : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ అరాచక పాలన భరించే ఓపిక ప్రజలకు లేదని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. అందుకే బీఆర్ఎస్‌ను గద్దెదించాల్సిందేనన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, న్యాయవాది గంగాపురం రాజేందర్, మాజీ జెడ్పీటీసీ భీముడు నాయక్, అచ్చంపేట, చారగొండ మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని రేవంత్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరికలు గాలివాటంతో కూడినవి కావన్నారు. ఈ చేరికలు తెలంగాణలో కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ కోసమేనన్నారు. ఈ చేరికలు తెలంగాణ ప్రజల చైతన్యానికి ప్రతీకగా అని అభివర్ణించారు. రాష్ట్రాన్ని కేసీఆర్ నుంచి విముక్తి కలిగించేందుకే ఈ చేరికలు కొనసాగు తున్నాయని తెలిపారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ పదేండ్ల పాలనలో నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని పాలించే అర్హత కేసీఆర్‌కు లేదని తెలిపారు. కేసీఆర్ పుట్టకపోయుంటే తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కేటీఆర్ అన్నారనీ, కేటీఆర్ పుట్టకముందే తెలంగాణ ఉద్యమం పుట్టిందని గుర్తు చేశారు. పాలమూరు బిడ్డ చిన్నారెడ్డి ఆనాడు ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఎలక్షన్లు, కలెక్షన్ల కోసమే 2001లో కేసీఆర్ పార్టీ పెట్టారని ఆరోపించారు. 22ఏండ్లు జెండా మోసిన గంగాపురం రాజేందర్‌కు న్యాయం జరిగిందా? అని ప్రశ్నించారు.

గురునాథ్ రెడ్డిని కలిసిన రేవంత్ రెడ్డి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డితో రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. గత కొంతకాలంగా అధికార బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన్ను.. కాంగ్రెస్ పార్టీలో చేరాలని రేవంత్ రెడ్డి కోరారు.ఈమేరకు స్పందించిన గురునాథ్‌రెడ్డి ఆదివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ లో చేరనున్నట్టు ప్రకటించారు.

కొత్తకోట దయాకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన రేవంత్

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రనియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం పర్కాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి కుటుంబాన్ని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు.

జూపల్లి కృష్ణారావుతో ఏఐసీసీ కార్యదర్శి భేటీ

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్ భేటీ అయ్యారు. పార్టీలో చేరే అంశాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం కూడా ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో హైటెక్ కాపీయింగ్

మ్యాథ్స్ 1బీ ప్రశ్నాపత్రంపై జవాబులు రాసి విద్యార్థికి ఇచ్చిన డీఓ

- విచారణను పక్కదారి పట్టిస్తున్న డీఐఈఓ వడ్డెన్న

నవతెలంగాణ-సిటీ బ్యూరో

హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్ అమోఘ జూనియర్ కాలేజీలో (సీనెం. 60334)లో హైటెక్ కాపీయింగ్ ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం ఉదయం 9 గంటలకు ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్ష గణిత శాస్త్రం 1బీ జరిగింది. అక్కడ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా (జీజేసీ మారేడ్‌పల్లిలో ఎకనామిక్స్ అధ్యాపకుడు) ఉన్న ఆంజనేయులు రహస్యంగా మ్యాథ్స్ ప్రశ్నపత్రాన్ని తీసుకొచ్చి కళాశాల గణిత అధ్యాపకుని చేత సమాధానాలు రాయించాడు. అనంతరం దాన్ని ఓ విద్యార్థికి ఇచ్చాడు. అది గమనించిన మిగతా విద్యార్థులు ప్రశ్నించారు. పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, పేరెంట్స్ అసోసియేషన్‌కు, విద్యార్థి సంఘాలకు సమాచారం ఇచ్చారు. పరీక్షా కేంద్రంలో జరుగుతున్న హైటెక్ కాపీయింగ్‌పై హైదరాబాద్ డీఐఈఓ వడ్డెన్నను ఫోన్‌లో సంప్రదించగా.. విషయాన్ని దాటవేస్తూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఆంజనేయులు విద్యార్థి తల్లిదండ్రుల వద్ద భారీస్థాయిలో డబ్బులు తీసుకొని కాపీయింగ్‌కు సహకరించారని తెలిసింది. ఈ విషయం అక్కడి సీసీ కెమెరాలో రికార్డ్ అయినప్పటికీ విచారణకు వచ్చిన డీఐఈఓ అసలు దోషిని వదిలేసి విషయంలో సంబంధం లేని చీఫ్ సూపరింటెండెంట్ (జీజేసీ ఉసేయినీ ఆలం ఒకేషనల్ అధ్యాపకుడు) శ్రీనివాస్‌రెడ్డికి మెమో ఇచ్చి చేతులు దులుపుకున్నట్టు తెలుస్తోంది. ప్రశ్నపత్రంపై సమాధానాలు రాసి ఇచ్చిన డీఓను వదిలిపెట్టి చీఫ్ సూపరింటెండెంట్‌పై తప్పుడు రిపోర్టు పంపినట్టు తెలుస్తుంది.

వివాదాలకు, అవినీతికి కేంద్ర బిందువుగా డీఐఈఓ

గతంలో నిజామాబాద్ జిల్లాకు డీఐఈఓగా ఉన్న సమయంలో వడ్డెన్నపై ఏసీబీ కేసు నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు వేసవి సెలవుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నా.. ఆయన పట్టించుకోకుండా పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడుతున్నట్టు పలు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న కళాశాలలకు సహకరిస్తున్న హైదరాబాద్ డీఐఈఓ వడ్డెన్నపై ఇంటర్ బోర్డు సెక్రటరీ, అధికారులు తగిన విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ అసోసియేషన్‌లు డిమాండ్ చేస్తున్నాయి.

భూమిపై లభించే నీటిలో ఒక శాతం మాత్రమే తాగునీరు

- 2050లో నీటి సంక్షోభం : ఎఫ్‌టీసీసీఐ పర్యావరణ కమిటీ చైర్మెన్ బాల సుబ్రమణ్యం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూమిలో లభించే నీటిలో ఒక శాతం మాత్రమే తాగునీరు ఉందని ఆస్కీ ప్రొఫెసర్, ఎఫ్‌టీసీసీఐ పర్యావరణ కమిటీ చైర్మెన్ జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగింటిలో ఒక వంతు నీటిని భారతదేశమే వినియోగించుకుంటుందని అన్నారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐలో 'పరిశ్రమ కోసం నీటి భద్రత, సుస్థిరత విధానం' అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నీటి వినియోగాన్ని రీడిజైన్ చేయాలని అన్నారు. భారతదేశం ప్రపంచ జనాభాలో 17 శాతానికిపైగా ఉందని, ప్రపంచవ్యాప్తంగా లభ్యమయ్యే భూగర్భ జలాలలో నాలుగో వంతును వినియోగిస్తున్నామని తెలిపారు. ఇది అమెరికా, చైనా రెండు దేశాల వినియోగం కంటే ఎక్కువ అని ఆయన తెలిపారు. నీతి అయోగ్ నివేదిక ప్రకారం 2050 నాటికి నీటి సంక్షోభం కారణంగా భారతదేశం జీడీపీలో 6శాతం నష్టాన్ని చవిచూసే అవకాశం ఉందని విశ్లేషించారు. 2030 నాటికి, నీటి డిమాండ్ అందుబాటులో ఉన్న సరఫరా కంటే రెండింతలు ఉంటుందని అంచనా వేశారని అన్నారు. అంతకుముందు ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ అనిల్‌అగర్వాల్ తన ప్రారంభోపన్యాసం చేస్తూ పారిశ్రామిక రంగంలో నీరు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఉత్పత్తి సామర్థ్యం, లాభదాయకత, స్థిరత్వాన్ని ప్రభావితం చేసే అనేక పరిశ్రమలకు నీటి కొరత ఒక ముఖ్యమైన సవాలుగా మారిందన్నారు. నీటి వినియోగం, నిర్వహణ పట్ల పరిశ్రమలు స్థిరమైన విధానాన్ని అవలంభించడం అత్యవసరమని అన్నారు.

ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని మైనర్ రెజ్లర్ కుటుంబంపై తీవ్ర ఒత్తిడి

- ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని మైనర్ రెజ్లర్ కుటుంబంపై బ్రిజ్ భూషణ్ సింగ్ అనుయాయులు తీవ్ర ఒత్తిడి చేశారని రెజ్లర్, ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్ పేర్కొన్నారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసిన తరువాత రెజ్లర్ సాక్షి మాలిక్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మైనర్ అథ్లెట్ కుటుంబంపై తీవ్ర ఒత్తిడి ఉందని అన్నారు. "పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పేరు ఉంది. మైనర్ కేసులో కుటుంబంపై చాలా ఒత్తిడి ఉందని స్పష్ట మైంది. మిగిలిన అంశాలపై తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటాము. డిమా ండ్లను ప్రభుత్వం నెరవేరుస్తుంది' అని సాక్షి అన్నారు. ఛార్జిషీట్ పొంద దానికి రెజ్లర్ల తరపు న్యాయవాది దరఖాస్తు చేసుకున్నారని, దాని ప్రకారం తదు పరి దశను నిర్ణయిస్తామని చెప్పారు. "ఛార్జిషీట్‌లో బ్రిజ్ భూషణ్ దోషి అని స్పష్టంగా పేర్కొన్నారు.

ఆపరేషన్ హస్తం

(మొదటిపేజీ తరువాయి)

అవుతున్నారు. దీంతో ఇప్పటికే ఆయన అడుగులు కాంగ్రెస్ వైపు పడుతున్నాయి. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న నాయకులను కాంగ్రెస్‌వైపు మళ్లించేందుకు కోదండరాం కృషి ప్రారంభించారు. ఇప్పటికే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో భేటీ అయిన ఆయన.... తాజాగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణా రావుతోనూ చర్చించారు. ఇప్పటికే వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వెల్లడించారు. కమలం, కారు పార్టీలకు చెందిన చాలా మంది నేతలతో కోదండరాంకు సన్నిహిత ఉన్న నేపథ్యంలో ఆయన మాటకు విలువనిచ్చే నేతలు ఉన్నారు. వారందరితో కోదండరాం మాట్లాడుతున్నట్టు ఆ పార్టీలు చెబుతున్నాయి. బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు అవసరమైతే టీజేఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానంటూ సూర్యాపేటలో నిర్వహించిన ప్లీనరీలో ప్రకటించిన కోదండ రాం.. అందుకనుగుణంగానే కాంగ్రెస్‌కు చేరువవుతు న్నట్టు తెలుస్తోంది. విలీనం చేసేందుకు సిద్ధమవు తున్నట్టు తెలుస్తోంది. ఈ లోపుగా పార్టీ ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఆయన రంగంలోకి దిగినట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి.

రెండు, మూడు నెలల ముందే టికెట్లు

ఎన్నికలకు రెండు, మూడు నెలలకు ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయించినట్టు ప్రచారం సాగుతోంది. టికెట్లు ఇచ్చే విషయంలో ఆషామాషీగా ఇవ్వకుండా ఆయా నియోజకవర్గాల్లో సర్వే చేసి బీ ఫామ్ ఇస్తామని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారు. దీంతో టికెట్లు ఆశించే నాయకులు కిమ్మనకుండా పని చేసుకుంటున్నట్టు పార్టీ నేత ఒకరు చెప్పారు. అంతేకాకుండా పార్టీని పట్టిపీడిస్తున్న ముఠా తగాదాల విషయంలో నిక్కచ్చిగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. ఎంత పెద్ద నాయకుడైనా పార్టీపైగానీ, నాయకులపైగానీ ఇష్టమెచ్చినట్టు మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఇప్పటికే ఏఐసీసీ సందేశాలు పంపింది. ఈ

కారు, కమలం అసంతృప్తులపై నజర్

(మొదటిపేజీ తరువాయి)

మరింత ఊపొచ్చిందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిర్మల్ కాంగ్రెస్ ఇంచార్జి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు బీఆర్ఎస్ నుంచి మరో ముఖ్యమైన నేతలను పార్టీలో చేర్చుకుంది. కాంగ్రెస్‌కు బలమైన పునాది ఉన్న ఆదిలాబాద్‌పై రేవంత్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో బలమైన శక్తిగా ఉన్న కాంగ్రెస్ మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలపై పట్టు బిగించాలని భావిస్తున్నది. ఇప్పటికే అధిష్టానం కూడా ఇదే విషయాన్ని తేల్చి చెప్పినట్టు ఆ వర్గాలు అంటున్నాయి. ఈక్రమంలో కర్నాటక ఎన్నికల్లో పని చేసిన అనుభవం ఉన్న కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే సీపీ విష్ణునాథ్, కర్నాటక నేత మన్సుర్ అలీఖాన్‌ను సైతం రంగంలోకి దించింది.

విలీన ప్రచారం వాస్తవం కాదు : కోదండరాం

ఇతర పార్టీల్లో టీజేఎస్‌ను విలీనం చేయబోతున్నామనే ప్రచారం వాస్తవం కాదని ఆ పార్టీ అధ్యక్షులు కోదండరాం స్పష్టం చేశారు. టీజేఎస్ తన అస్థిత్వాన్ని కాపాడుకుంటూనే ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పోరాడుతుందని తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన వీడియోను విడుదల చేశారు. టీజేఎస్ ఏ పార్టీలో విలీనం కాదని స్పష్టం చేశారు. తెలంగాణాను నిర్మాణం చేసే ఆలోచనతోనే ప్రజాసంఘాలను, పార్టీలను కలుస్తున్నామని వివరణ ఇచ్చారు. ఎన్నికల నాటికి తమ పోరాటం ఎలా ఉండబోతుందో ఇప్పుడే చెప్పలేమని తెలిపారు.

నేపథ్యంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాయిస్‌లో కొంత తేడా వచ్చిందని పార్టీని నేతలు చెబుతున్నారు.తన తమ్ముడిని కాంగ్రెస్‌లోకి రప్పించేందుకు కూడా అన్న రంగంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతున్నది. పార్టీ అంతర్గతంగా పటిష్టపరుచుకుంటూనే, మరోవైపు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నది. ఆ సభల్లో ప్రజలకు పలు హామీలు ఇవ్వనుంది.

19 తర్వాతే నైరుతి రుతుపవనాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతి ఏటా జూన్ తొలి, రెండో వారంలో నైరుతి రుతుపవనాలు తెలంగాణలో ప్రవేశిస్తాయి. నెలలో పక్షం రోజులు గడిచిపోయి మూడు రోజులవుతున్నా నేటికీ వాటి జాడే లేదు. కర్నాటక, రాయలసీమ ప్రాంతాలకు వరకు విస్తరించిన రుతు పవనాలు ఆ తర్వాత ముందడుగు వేయటంలేదు. అక్కడే తచ్చాడుతున్నాయి. ఈనెల 19వ తేదీ తర్వాతనే తెలంగాణలోకి అవి ప్రవేశించే సూచనలు కనబడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు వేచిచూడాల్సిందే. మరోవైపు అన్నదాతలు విత్తనాల కోసం దుక్కు లు దున్ని, అచ్చులు తోలి, విత్తనం తెచ్చి వాన రాక కోసం కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ రోజూ చెబుతున్నా.. చినుకు జాడ కానరావ డం లేదు. జూన్ 17 వచ్చినా రాష్ట్రం లో మాత్రం గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. దీనికి తోడు వేడి గాల్పుల తీవ్రత ఇంకా కొనసాగు తూనే ఉన్నది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో వడ గాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. జాబితాలో భద్రాద్రి కొత్త గూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, ఆదిలాబాద్,కొమ్రంభీమ్, మంచిర్యా ల, కరీంనగర్, పెద్దపల్లి, జయ శంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా లున్నా యి. చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కల పల్లిలో 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

కేజీబీవీ, యూఆర్ఎస్‌లో కాంట్రాక్టు పద్ధతిలో 1,241 పోస్టుల భర్తీ

నేడు నోటిఫికేషన్ విడుదల

- 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జులైలో రాతపరీక్ష ద్వారా ఎంపిక
- పాఠశాల విద్యాశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల (యూఆర్ఎస్)లో స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీకి చెందిన 1,241 ఖాళీ పోస్టులను తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌వోలు 42, పీజీసీఆర్టీలు 849, సీఆర్టీలు 273, పీఈటీలు 77 కలిపి మొత్తం 1,241 ఖాళీలున్నాయని వివరించారు. జిల్లాల వారీగా జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని కోరారు. విద్యార్హతలు, రాతపరీక్ష విధానం, సిలబస్, అభ్యర్థుల ఎంపిక విధానం వంటి సమగ్ర నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 25న దరఖాస్తు, ఖాళీలు, ఇతర వివరాలు https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వివరించారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేయాలని కోరారు. జులైలో రాతపరీక్ష ద్వారా ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తామని తెలిపారు. దాని ద్వారానే ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

అరుంధతి రాయ్‌కు యూరోపియన్ ఎస్సే ప్రైజ్

న్యూఢిల్లీ : భారత రచయిత్రి అరుంధతీ రాయ్‌కు 45వ యూరోపియన్ ఎస్సే ప్రైజ్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ లభించింది. ఛార్లెస్ వైల్లాన్ ఫౌండేషన్ ఈ విషయాన్ని ప్రకటించింది. అజాదీ (2021) పేరుతో అరుంధతి రాయ్ రాసిన వ్యాసాల ఫ్రెంచ్ అనువాదానికి ఈ అవార్డు లభించింది. 'అరుంధతీరాయ్ తన వ్యాసాల్లో ఫాసిజం, దాని మార్గాన్ని విశ్లేషించడం ద్వారా వాటిని పోరాట రూపంగా ఉపయోగించారు. ఆమె వ్యాసాలు నిర్మాణాత్మకంగా ఉన్నాయి. మన జీవితాల్లో ఎక్కువగా ఉండే సమస్యలను ఎంచుకున్నారు. ఆమె వ్యాసాలు అనేక మంది వ్యక్తులను ప్రతిబింబిస్తున్నాయి' అని ఫౌండేషన్ తన ప్రకటనలో తెలిపింది. అరుంధతి రాయ్ రాజకీయ చర్యల్లో నిబద్ధతను కూడా ఫౌండేషన్ ప్రశంసించింది. పెరుగుతున్న నిరంకుశతత్వం, స్వేచ్ఛ అర్థాల గురించి అరుంధతి రాయ్ అజాదీ వ్యాసాల్లో ప్రస్తావించారు. సెప్టెంబరు 12న స్విట్జర్లాండ్‌లో అవార్డును ఆమె అందుకుంటారు.

పెరియార్ జీవితం బహుముఖం

'రీడర్' పుస్తకావిష్కరణలో వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కులానికి వ్యతిరేకంగా గణాన్ని వినిపించి, ప్రజల్ని చైతన్యవంతం చేసిన గొప్ప వ్యక్తి పెరియార్ రామస్వామి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆయన జీవితం బహుముఖం అనీ, భిన్న పార్శ్వాలతో భవిష్యత్‌ను ముందే ఊహించి అద్భుత రచనలు చేశారని కొనియాడారు. దుస్సాంప్రదాయాలపై ఆయన చేసిన పోరాటాల గురించి నేటి తరానికి మరింత వివరంగా తెలియాల్సి ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-ఫూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్‌హాల్‌లో 'పెరియార్ రీడర్' పుస్తకా విష్కరణ సభ జరిగింది. విల్సన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకులు డాక్టర్ కే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీక్షణం పత్రికా సంపాదకులు ఎన్ వేణుగోపాల్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, అమరుల కుటుంబం నుంచి ఆత్మకూరి రమణయ్య, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు గీతా రామస్వామి తదితరులు మాట్లాడారు. కులరహిత గ్రామాల పునర్నిర్మాణం కోసం పెరియార్ తపించారనీ, 'దేవుడులేడు' అంటూ బలమైన వాదనను లేవనెత్తి, ఆ పేరుతో జరుగుతున్న దుర్నీతి, దుష్ప్రచారాన్ని తీవ్రంగా తిప్పికొట్టారని చెప్పారు. బ్రాహ్మణ, గుత్తాధిపత్య వ్యతిరేక భావజాలానికి వ్యతిరేకంగా వైకోం ఉద్యమంతో సమాజ పురోగతిని మార్చే స్థాయిలో ప్రజాచైతన్యం తెచ్చారన్నారు. ఆయన రచనలు మరిన్ని ప్రజాబాహుళ్యంలోకి రావల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రాముడు దేవుడు కాదంటూ ఆయన చేసిన వాదనకు ఇప్పటికీ మనువాదులు సమాధానం చెప్పలేదన్నారు.

సమాజంలో పెరియార్ భావజాలం మిగిలే ఉందనీ, మోడీ, అమిత్‌షా, సంఘ్‌పరివార్ చేతుల్లో భారత సమాజం చిక్కి ఉన్నదనీ, దానికి విముక్తి కల్పించాలంటే బ్రాహ్మణ, గుత్తాధిపత్య వ్యతిరేక భావజాలాన్ని విస్తరించాలని అభిప్రాయపడ్డారు. ఏకత్వ సమాజాన్ని అంగీకరించేది లేదని పెరియార్ నిర్ద్వంద్వంగా చెప్పారని అన్నారు. పెరియార్‌ను మరింత అధ్యయనం చేసి, అర్థం చేసుకోవాలనీ, ఆదిశగా నేటి యువతరం పరిశోధనలు సాగించాలని తెలిపారు. పెరియార్ చేసింది మానవ హక్కుల ఉద్యమం అనీ, అలాంటి వారిపై పాలకవర్గాల నిర్బంధాలు సహజమేనని చెప్పారు. జైలు జీవితాన్ని కూడా తన ఉద్యమానికి అనుకూలంగా మార్చుకున్న గొప్ప వ్యక్తి పెరియార్ అని కొనియాడారు.

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై మూడో రోజూ కొనసాగిన ఐటీ దాడులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో మూడో రోజు కూడా ముగ్గురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆస్తులపై ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి. శుక్రవారం ఉదయం నుంచే దాదాపు 70 మంది ఐటీ అధికారులు ఈ సోదాలలో పాల్గొన్నారు. ముఖ్యంగా, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు చెందిన రియల్ ఎస్టేట్ కార్యాలయాలపై ఈ సోదాలు కొనసాగాయి. అంతేగాక, వీరికి చెందిన రెండు హోటళ్లతో పాటు కొత్తగా బయటకు వచ్చిన వీరి వ్యాపార భాగస్వాముల ఇండ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అలాగే, మరో మూడు బృందాలు వీరి నివాసాల్లో మూడో రోజు కూడా సోదాలను కొనసాగించాయి. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖకు చెందిన అకౌంట్స్ అధికారులను ఎదురుగా ఉంచుకొని వారి చేత సదరు ప్రజాప్రతినిధులకు చెందిన ఖాతా పుస్తకాల పరిశీలనను జరిపించినట్టు తెలిసింది. వీరి సోదాలు కొనసాగుతుండగానే ప్రజా ప్రతినిధుల నివాసాల ఎదుట వారి అనుచరులు పెద్ద సంఖ్యలో గుమిగూడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇంటిపనివార్లను కార్మికులుగా గుర్తించాలి

- ఐఎల్ఓ కన్వెన్షన్ 189ని అమలు చేయాలి
- జాయింట్ లేబర్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇండ్లల్లో పనిచేసే వాళ్లను కార్మికులుగా గుర్తించాలనీ, వారికి ఐఎల్ఓ కన్వెన్షన్ 189ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ కోరింది. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్‌లో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆర్. చంద్రశేఖరంను సీఐటీయూ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, కె. ఈశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. సునీత, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా ఉన్న గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలనీ, 8 గంటల పనిదినానికి రూ.600, డీఏ, వారాంత సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులివ్వాలనీ, 30 రోజుల వార్షిక వేతనంతో కూడిన సెలవు, పది రోజుల వేతనంతో కూడిన అనారోగ్యం సెలవు, వార్షిక బోనస్, ఏడాదికి 15 రోజుల గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, తదితర సామాజిక భద్రతా పథకాలను గృహకార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 55 ఏండ్ల తర్వాత నెలకు కనీసం రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టం అమలు చేయాలనీ, 2008 ప్రకారం గృహ కార్మికులందరికీ తక్షణమే గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. తగిన నిధులతో గృహ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గృహ కార్మికుల కోసం ప్రత్యేక పాత్రలు, ప్రవేశాలు, లిఫ్టులు మొదలైన అంశాల్లో వివక్షాపూరిత పద్ధతులను పాటిస్తూ గృహ కార్మికులను చులకన భావంతో చూసే పద్ధతికి స్వస్తిచెప్పేలా చూడాలన్నారు. ఇండ్ల వద్ద పనిచేసేటప్పుడు మరుగుదొడ్లను ఉపయోగించడం కోసం అనుమతి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు 30 శాతం పని దినాలతో కూడిన పట్టణ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని కోరారు.

సంపాదకీయం

బడిబయటే... బాలలు!

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దబడవలసిన బాలబాలికలు బడిలో చదువుకు నోచుకోకపోవడం బాధాకరం. దేశంలో ప్రాథమిక స్థాయిలో రెండు శాతం, పదవ తరగతి స్థాయిలో పదమూడు శాతం మంది పిల్లలు డ్రాపౌట్స్‌గా ఉన్నారని సాక్షాత్తూ కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. దేశంలో

> పిల్లలను పనికి పంపితే తప్ప కుటుంబం గడవని స్థితిలో కోట్లాదిమంది బాల కార్మికులుగా బతుకులు వెళ్లదీస్తున్నారు. ప్రాథమిక పాఠశాల ఒక కిలోమీటర్ పరిధిలోనే ఉండాలని విద్యాహక్కు చట్టం పేర్కొన్నా గిరిజన, మారుమూల వెనుకబడిన ప్రాంతాల్లో అటువంటి పరిస్థితి లేదు. అలా ఉన్నవాటిని కూడా పాఠశాలల విలీనం పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిల్లలకు దూరం చేయడం దారుణం. ప్రజల ఆర్థిక సామాజిక కారణాలతోపాటు పాలకులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించనందునే చదువుకోవాల్సిన పిల్లలు బడి బయట ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి మారాలి.

ప్రాథమిక స్థాయిలో బడికి పోని పిల్లలు 9.3లక్షల మంది కాగా అందులో కేవలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 3.96లక్షల మంది ఉండటం గమనార్హం. అసలు బడికే పోనివారు లేదా బడికి వెళ్లి మధ్యలో మానేసినవారు (డ్రాపౌట్స్) 2021-22 గణాంకాల ప్రకారం ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్, కర్నాటక వంటివి ముందు పీఠిన ఉన్నాయి. వీటిలో బీహార్ మినహా మిగిలినవన్నీ ఆ కాలంలో బీజేపీ ఏలుబడిలో ఉన్నవే. అందులోనూ అభివృద్ధిలో శరవేగంగా ముందుకు పోతున్నదని ఊదరగొట్టిన గుజరాత్ ఉండటం కమలనాథుల మోసకారితనానికి, ప్రచారార్భాటానికి నిలువెత్తు నిదర్శనం. ఏది ఏమైనా పిల్లలు బడి బయట ఉండకుండా విద్యాబుద్ధులు నేర్చుకునేట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలి. భారత రాజ్యాంగం, విద్యాహక్కు చట్టం పేర్కొన్న స్ఫూర్తిని అమలు చేయాలి.



సెకండరీ స్థాయిలో బడి మానేస్తున్న పిల్లల సంఖ్య కొన్ని రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉంది. దేశంలోని స్కూలు డ్రాపౌట్స్‌లో 85శాతం మంది కేవలం 11రాష్ట్రాలకు చెందినవారే కావడం గమనార్హం. 2021-22లో జాతీయ సగటు 12.6శాతం ఉండగా బీహార్ (20.4), పంజాబ్ (21.7), గుజరాత్ (20.3), అసోం (17.8), మేఘాలయ (17.2), ఆంధ్రప్రదేశ్ (16.7), కర్నాటక (14.6), తెలంగాణ (13.7), రాష్ట్రాలు దానిని దాటేశాయి. సమగ్ర శిక్షా కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర విద్యాశాఖ అందజేసిన వివరాలివి. వీటి ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాల్లో వార్షిక సగటు డ్రాపౌట్ రేటు చాలా అధికంగా ఉండగా రాజస్థాన్‌లో ఈ రేటు నిలకడగా తగ్గుతూ వస్తోంది. అయితే సెకండరీ స్థాయిలో ఎస్టీలు, ముస్లింలలో మాత్రం ఈ రేటు చాలా ఎక్కువగా ఉంది. దేశంలోని వివిధ రాష్ట్రాలవారీగా, ఆయా వెనుకబడిన ప్రాంతాలు, సామాజిక తరగతులవారీగానూ విశ్లేషించారు. మొత్తంగా చూస్తే దళిత, గిరిజన, ఒబిసి, మైనార్టీల్లో డ్రాపౌట్స్ అధికంగా ఉన్నాయి. అంటే ఆర్థిక సామాజిక వెనుకబాటుతనం విద్యావిషయకంగానూ కుంగదీస్తోంది. ఇదో విష వలయం.

బాలికా విద్య గురించి ఆలోచిస్తేనే కడుపు తరుక్కుపోతుంది. దేశంలోని ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరు నెలసరి (పీరియడ్స్)కి సంబంధించిన పరిజ్ఞానం సరిగా లేక, శానిటరీ ప్యాడ్స్ అందుబాటులో లేనందున చదువు మానుకుంటున్నారని ఒక అధ్యయనం ఇటీవల పేర్కొంది. గర్భస్థ శిశువుగా ఉన్ననాటి నుండి వివక్షకు గురవుతున్న మహిళా లోకానికి చదువు విషయంలో పీరియడ్స్ సమస్య మరో ఆటంకమైంది. బడిలో చదువుకున్నపుడు కొందరు కీచక టీచర్లు లేదా బంధువులనే రాబందుల బారినుండి బయటపడి ఉన్నత చదువులకు వెళ్లాక ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వేధింపులు వారిని వెంటాడుతున్నాయి. 1951 జనాభా లెక్కల ప్రకారం కేవలం 8.86శాతంగా ఉన్న మహిళా సాక్షరత 2011 నాటికి 65.46శాతానికి పెరగడం మంచి విషయమే కాని పెరుగుదల ఇంకా చాలా తక్కువే! గ్రామీణ మహిళల అక్షరాస్యత కేరళలో 94శాతం కాగా బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కనీసం 50శాతం కూడా లేకపోవడం సిగ్గుచేటు.

పిల్లలను పనికి పంపితే తప్ప కుటుంబం గడవని స్థితిలో కోట్లాదిమంది బాల కార్మికులుగా బతుకులు వెళ్లదీస్తున్నారు. ప్రాథమిక పాఠశాల ఒక కిలోమీటర్ పరిధిలోనే ఉండాలని విద్యాహక్కు చట్టం పేర్కొన్నా గిరిజన, మారుమూల వెనుకబడిన ప్రాంతాల్లో అటువంటి పరిస్థితి లేదు. అలా ఉన్నవాటిని కూడా పాఠశాలల విలీనం పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిల్లలకు దూరం చేయడం దారుణం. ప్రజల ఆర్థిక సామాజిక కారణాలతోపాటు పాలకులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించనందునే చదువుకోవాల్సిన పిల్లలు బడి బయట ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి మారాలి.

'దశాబ్ది' పాలన - ఒక పరిశీలన

రాష్ట్రం దశాబ్ది ఉత్సవాల సంరంభంలో ఉన్నది. అద్భుతాలు సృష్టించామంటున్నది. ఏమి సాధించారని బీజేపీ హేళన చేస్తున్నది. కాంగ్రెసూ ప్రశ్నిస్తున్నది. ఇంతకూ... ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అర్థం చేసుకోవల్సిందేమిటి? పాలన గురించి తూలనాత్మక పరిశీలనతో మాత్రమే అది సాధ్యం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ విధానాలకూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలకూ తేడా ఏమీ లేదా? ఎవరి రాజకీయ ప్రయోజనాలతో వారు పరిశీలిస్తే సహజంగానే పాక్షిక నిర్ధారణలకు వస్తాం. పాలకులు కూడా, ఆత్మావలోకనం చేసుకోవల్సిన సందర్భమని గుర్తించకుండా, అంతా బ్రహ్మాండమని గొప్పలు చెప్పుకోవటం వల్ల ప్రయోజనం ఉండదు. ఏ ప్రభుత్వం పనితనమైనా ప్రజా ప్రయోజనాలతో బేరీజు వేయటంతోనే తేలుతుంది.

> రాష్ట్రాల హక్కుల విషయంలో రాష్ట్ర పాలకులు కేంద్రం మీద సమరభేరి మోగించారు. మంచిదే! కేంద్రం నిరంకుశ విధానాల మీద పోరాటమే ప్రాంతీయ పార్టీలకు గౌరవం తెచ్చిపెట్టింది మన దేశ చరిత్రలో. కానీ దీనికి ఒంటరి పోరుతో సరిపోదు. కలిసొచ్చే రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకుని పోరాడాలి. రాష్ట్రంలో కలిసిరావడానికి సిద్ధపడిన పార్టీలతో కలిసి కేంద్రాన్ని నిలదీయాలి. కలిసే ఉన్నామన్న అభిప్రాయం మాత్రం కలిగిస్తున్నారు కానీ కలిసి పోరాటానికి సిద్ధపడటం లేదు.

తెలంగాణ ప్రభుత్వ విధానాలలో కొన్ని ఆహ్వానించదగినవి. రైతులకు ఏ సమయంలోనైనా, ఎంత సమయమైనా ఉచిత విద్యుత్తు, రైతుబంధు, ధాన్యం కొనుగోళ్ళు, సంక్షేమ పథకాలు, వెయ్యికి పైగా గురుకులాలు, ప్రభుత్వ వైద్యం మెరుగుపర్చటం, కొంతమేరకైనా ఖాళీ పోస్టుల భర్తీ లాంటి చర్యలు ప్రజా జీవితం మీద మంచి ప్రభావం చూపుతాయి. ప్రజలకు ఊరట కల్గించే విధానాలే! ఆర్ఎస్ఎస్, బీజేపీ తదితర శక్తులు మత విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నించిన సందర్భాలలో సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. పెద్దనోట్ల రద్దు, కార్మిక చట్టాలు రద్దు, కరోనా కాలంలో చర్యల వంటి సందర్భాలలో కేంద్రం తప్పుడు విధానాలను



ఎస్. వీరయ్య

వ్యతిరేకించలేదు. ప్రారంభంలో కేంద్రంతో సహకారం పేరుతో తప్పటడుగులు వేసినప్పటికీ, తమకే ముప్పు ఏర్పడటంతో కొంతకాలంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తప్పుడు విధానాల మీద, కేంద్రం నియంతృత్వం మీద పదునైన విమర్శలకు సిద్ధపడటం మంచి పరిణామం. అదే సమయంలో ప్రభుత్వం విద్యారంగంలో అందరికీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య వాగ్దానం చేసింది. దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. వ్యవసాయ కూలీల ఊసెత్తదు ప్రభుత్వం. కార్మికుల కనీసవేతనాలు, హక్కులు, పోరాటాలు, నిరసనలంటే అసహనం ప్రదర్శిస్తున్నది. ప్రజల జీవితాలపైన దీర్ఘకాలిక ప్రభావం చూపే మౌలిక సమస్యల ఊసెత్తటం లేదు. నూతన సచివాలయ నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టు, అంబేద్కర్ విగ్రహావిష్కరణ కూడా చిరకాలం నిలిచిపోయేవే! సాగునీటి సమస్య పరిష్కారానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగం. ఖర్చు బాగా తగ్గించి, ఇంతకన్నా మెరుగైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక కాదు. కానీ ఈ మాటకు ఇప్పుడు విలువ ఉండదు. సత్ఫలితాల మాటున నిధుల దుబారా, దుర్వినియోగం దాగుంటాయి. నూతన సచివాలయం సకల సౌకర్యాలతో, అందంగా నిర్మించారు. కానీ, ఇంకా చాలాకాలం పాత భవనం ఉపయోగపడేదే. ఈ డబ్బు తక్షణావసరాలకు ఖర్చుచేసి ఉండవచ్చు. అంబేద్కర్ విగ్రహా విష్కరణ సామాజిక ఉద్యమకారులకు స్ఫూర్తినిస్తుంది. కానీ కులవివక్ష గురించి పాలకులు మాట్లాడకుండా, కేవలం విగ్రహం తో సంతృప్తిపరిచే ప్రయత్నమిది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల భద్రతకు కేవలం 'షీ' టీములే పరిష్కారం కాదుకదా!

రైతుబంధు, గురుకులాలు, ప్రభుత్వ వైద్యం మీద ఖర్చు, రైతులకు ఉచిత విద్యుత్తు, సాగునీరు, ధాన్యం కొనుగోళ్ళు, పాక్షికంగానే అయినా ఉద్యోగ ఖాళీ పోస్టుల భర్తీ, తాగునీరు లాంటి చర్యలు ఆర్థిక వ్యవస్థ మీద, సమాజం మీద సానుకూల, దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. వీటితోపాటు రకరకాల పెన్షన్లు, బతుకమ్మ చీరలు, దళితబంధు, వృత్తిదారులకు, ఆడపిల్లల పెండ్లిండ్లు తదితర సందర్భాలలో అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలు పేదలకు ఊరటనిస్తున్నాయి. ఈ చర్యల పేరుతో ప్రభుత్వం పెద్దయెత్తున ఖర్చుపెడుతున్న నిధులు మార్కెట్లోకి వస్తున్నాయి. సహజంగానే ఇది మళ్ళీ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతుంది.

ప్రజాస్వామ్య విలువల విషయంలో మాత్రం ప్రజల ఆశలమీద ప్రభుత్వం నీళ్ళు చల్లింది. అధికారంలోకి రాగానే ప్రతిపక్షాన్ని ఖాళీ చేసే పనిలోపడింది. ప్రతిపక్షంలో రాజకీయ శూన్యత, మరింత ప్రమాదకరమైన మతోన్మాద శక్తులు చొరబడేందుకు తోడ్పడుతుందన్న స్పృహలో లేకుండా ఏకపక్ష ధోరణి ప్రదర్శించింది. ఆమేరకు నష్టం రుచి చూసిన తర్వాత మాత్రమే నాలుక కర్చుకున్నది. శ్రామికుల హక్కులపట్ల అప్రజాస్వామిక ధోరణి హానికరం. 'ఎవరూ తమ సమస్యలు పరిష్కారించాలని అడగొద్దు. సమ్మెలు చేయొద్దు'. ప్రభుత్వాధినేత 'దయ'తో ఇచ్చింది తీసుకోవాలి. ఇదీ వరస! కనీసం నిరసన ప్రదర్శనలూ, ధర్నాలు సైతం గిట్టవు. అతికష్టం మీద, అనుమతించిన కార్యక్రమాల విషయంలో కూడా పోలీసుల 'అతి' ఆంక్షలు. చివరకు ముఖ్యమంత్రిగానీ, ముఖ్యమంత్రి ముందు ప్రతిపాదనలు పెట్టగల మంత్రులుగానీ వినతిపత్రాలు కూడా స్వీకరించరు. తాము సుముఖంగా ఉన్న విషయాల మీద, అదికూడా తామే చేస్తున్నామని చెప్పుకునే అవకాశం ఉన్నమేరకే వినతిపత్రాలకు అవకాశం! ప్రతిపక్ష పార్టీల నాయకులకు, శాసనసభ్యులకు, మాజీ ప్రజాప్రతినిధులకు కూడా కనీసం అపాయింట్‌మెంట్ దొరకదు. రియలెస్టేట్‌కు పెద్దపీట వేయటం, ప్రభుత్వమే భూముల అమ్మకానికి సిద్ధపడటం, అభివృద్ధి పేరుతో పేదల అసైన్డ్ భూము లు గుంజుకోవటం గమనించదగిన విషయం. పేదలకు ఇక ఇండ్ల స్థలాలు దొరకవన్న ఆందోళన మొదలైంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, ఒకవైపు మహిళా దినోత్సవం నిర్వహిస్తూనే, అదేరోజు మహబూబాబాద్‌లో మహిళలమీద పోలీసులు దౌర్జన్యం చేశారు.

రాష్ట్రాల హక్కుల విషయంలో రాష్ట్ర పాలకులు కేంద్రం మీద సమరభేరి మోగించారు. మంచిదే! కేంద్రం నిరంకుశ విధానాల మీద పోరాటమే ప్రాంతీయ పార్టీలకు గౌరవం తెచ్చిపెట్టింది మన దేశ చరిత్రలో. కానీ దీనికి ఒంటరి పోరుతో సరిపోదు. కలిసొచ్చే రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకుని పోరాడాలి. రాష్ట్రంలో కలిసిరావడానికి సిద్ధపడిన పార్టీలతో కలిసి కేంద్రాన్ని నిలదీయాలి. కలిసే ఉన్నామన్న అభిప్రాయం మాత్రం కలిగిస్తున్నారు కానీ కలిసి పోరాటానికి సిద్ధపడటంలేదు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర, అన్ని పంటలను 'మద్దతు ధర' పరిధిలోకి తేవటం, మార్కెట్ సౌకర్యం లాంటి సమస్యల మీద కేంద్రంతో ఐక్య ఉద్యమం అవసరం. ఆర్టీసీ, సింగరేణి పరిరక్షణ, విభజన సమస్యల పరిష్కారం వంటి విషయాలలో కేంద్రంతో పోరాడాలి.

దశాబ్ది ఉత్సవాల సమయంలో పరిశీలన ఇంతవరకే పరిమితం కాకూడదు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా ఉన్నత వర్గాల ప్రయోజనాలు కాపాడే విషయంలో మాత్రం వామపక్షేతర పార్టీలన్నింటిదీ ఒకే దారి. కేంద్రమైనా, రాష్ట్రమైనా అదే పరిస్థితి. శ్రామికుల సమస్యలు ఎర్రజెండాకు తప్ప ఎవరికీ పట్టవు. ఈ తొమ్మిది సంవత్సరాల పాలనలో కూడా అంతిమంగా తేలింది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో విద్యలో మరింతగా వర్గ విభజనకు పూనుకున్నది. ఉన్నత వర్గాలకు తప్ప ఇతరులకు విద్య అందుబాటులో లేకుండా చేయబూనుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టతనివ్వాలి. కానీ ఇక్కడ కూడా మరో రకమైన విభజన జరుగుతున్నది. ఆర్థికంగా వెసులుబాటు ఉన్న కుటుంబాల పిల్లలు ప్రయివేటు సంస్థలకు పోతున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. బడుగు బలహీన వర్గాల నుంచి కూడా కొద్దిమందికి గురుకుల విద్యనందించి, మిగిలినవారందరినీ వదిలేస్తున్నారు. ఉన్నత విద్యాసంస్థలను గాలికి వదిలేస్తున్నారు. ఫలితంగా ఉన్నత కుటుంబాల పిల్లలు, బడుగువర్గాలలోని చదువులో ముందున్నవారిని (క్రీమీలేయర్)



మినహా మిగిలిన విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తున్నారు. అంటే ఉన్నత వర్గాలకు, వారికి అవసరమైనవారికి మాత్రమే నాణ్యమైన విద్య.

తలసరి ఆదాయం సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను సూచించదు. బలిసిపోతున్న బడాబాబుల ఆస్తి కూడా ఈ లెక్కల్లో కలుస్తుంది కదా! అటవీ విస్తీర్ణంలో కూడా మెరుగైన ఫలితాలు సూచిస్తున్నది తెలంగాణ. కానీ ఇది ఆదివాసీల పోడుహక్కు మీద దాడి చేస్తూ చూపిస్తున్న లెక్క తప్ప, కొత్తగా అభివృద్ధి చేసిన అడవుల విస్తీర్ణం కాదు. జీఎస్టీ వృద్ధి రేటు ప్రజలమీద పాలకులు వేసిన భారాల ప్రతిబింబం. కేంద్రం లెక్కల ప్రకారం సరుకుల వినియోగం పెరగలేదు. అందువల్ల సరుకుల అమ్మకాల పెరుగుదలకన్నా ప్రజలమీద మోపిన అదనపు పన్నుల భారం ఫలితమే జీఎస్టీ ఆదాయం పెరుగుదల. కార్మికులకు కనీసవేతనాలు పెంచకుండా, యూనియన్ల కార్యకలాపాలను నిరోధించి, పెట్టుబడిదారులకు ఇస్తున్న రాయితీల ఫలితమే పరిశ్రమల అభివృద్ధి. పన్నుల రాబడిలో తెలంగాణ సాధించిన ర్యాంక్ కూడా దీనినే సూచిస్తున్నది. ఆదాయం అభివృద్ధి రేటు, తలసరి విద్యుత్తు వినియోగం (ఇది కూడా భారీ మధ్యతరహా పరిశ్రమలు, కాంట్రాక్టర్లు, వాణిజ్యవేత్తలు వాడే విద్యుత్తు కలుపుకుని లెక్కిస్తారు!) కూడా ఇలాంటిదే కదా! పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడటం, ప్రజలమీద భారాలు మోపటమే అంతిమంగా వీటి సారాంశం. రైతుబంధు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న పేద, మధ్యతరగతి రైతులకు ఊరట కలిగిస్తున్నది. కానీ ఇందులో అధికభాగం ఎక్కువ భూమి కలిగిన భూస్వాములకు, ధనిక రైతులకు, రియలెస్టేట్ వ్యాపారులకే దక్కుతున్నది. ధరణి పేరుతో దశాబ్దాలుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములు భూస్వాములకు ధారాదత్తం చేశారు. బడాబాబుల లావా దేవీ లు సులభతరం చేశారు. ఇవన్నీ కలిపితేనే దేశంలో ఐదు ఉన్నతస్థాయి రాష్ట్రాల జాబితాలో తెలంగాణకు దక్కిన స్థానం.

ఇప్పటివరకు చెప్పుకున్న విషయాలన్నీ ఎట్లా ఉన్నా, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనను కాంగ్రెస్ నాయకులు విమర్శించడంలో అర్థం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చూసినా, ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పోల్చినా, కాంగ్రెస్ నాయకులు దశాబ్ది ఉత్సవాలను ప్రశ్నించటం సమంజసం కాదు. మంచిచెడ్డలు బేరీజు వేస్తే అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో ఈ రాష్ట్రంలో పాలనను విమర్శించే కనీస అర్హత కూడా బీజేపీ నాయకత్వానికి లేదు. కేంద్రంలో తామే అధికారంలో ఉన్నామన్న సోయి లేకుండా మాట్లాడటం బాధ్యతారహితం. తాము అధికారంలో ఉన్న ఏ రాష్ట్రం కూడా తెలంగాణ దరిదాపులో కూడా లేదు కదా! కేవలం రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం రాళ్ళేయటమే తప్ప నిజాయితీ లేదు. అంతే కాదు. ప్రధాని మోడీ, తానే స్వయంగా పదేండ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. గుజరాత్ నమూనా గురించి దేశమంతా ప్రచారంలో పెట్టి ప్రధాని అభ్యర్థిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రధానిగా కూడా తొమ్మిదేండ్లుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు గుజరాత్ ఊసెత్తగల స్థితిలో లేరు. మోడీ ప్రభుత్వ లెక్కల ప్రకారమే అన్ని కీలకమైన అంశాలలోనూ తెలంగాణకన్నా గుజరాత్ బాగా వెనుకబడింది.

ఇప్పుడు దేశంలో ఒక నమూనాగా ప్రజలను ఆకర్షిస్తున్న రాష్ట్రం కేరళ. ఎర్రజెండా పాలనలో ఉన్న కేరళ, సాధారణ ప్రజల జీవితాలతో ముడిపడిన అన్ని కీలకాంశాలలోనూ దేశానికే ఆదర్శప్రాయంగా ఉన్నది. మానవాభివృద్ధి సూచీలలో ముందున్నది. వైద్యరంగంలో, కరోనాను ఎదుర్కొన్న తీరుకు ఐక్యరాజ్యసమితి నుంచి అరుదైన గౌరవాన్ని అందుకున్నది. వలస కార్మికులను అతిథులుగా పరిగణించింది. దేశంలోనే కార్మికులకు అత్యధిక కనీస వేతనాలు అమలు చేస్తున్న రాష్ట్రం కేరళ. భయంకరమైన ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవటంలో, ప్రజలకు అండగా నిలవటంలో తనకు తానే సాటి కదా! ప్రతిపక్షాన్ని సైతం గౌరవిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు వన్నె తెస్తున్న రాష్ట్రం. ప్రభుత్వరంగం, సామాజిక న్యాయం, మహిళల భద్రత, లౌకిక విలువలు, సహకార రంగం అభివృద్ధి తదితర విషయాలలో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న ఆదర్శపాలన. అందువల్ల తెలంగాణలో పాలన మరొక ముందడుగు వేయాలంటే కేరళ పాలనను పరిశీలించాలి. తెలంగాణ ప్రత్యేక పరిస్థితులకు అన్వయించుకోవాలి. కానీ వామపక్షాలకు మాత్రమే సాధ్యమైన విధానాలు అవి.

సరిగ్గా ఈ సమయంలోనే, బీఆర్ఎస్ రాజకీయ విధానాల గురించి కూడా చర్చ వేడెక్కింది. గత కొంతకాలంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాల మీద బీఆర్ఎస్ పోరాటాన్ని తీవ్రతరం చేసింది. రాష్ట్రాల హక్కుల కోసం స్వరం పెంచింది. ప్రభుత్వరంగం ప్రాధాన్యత గురించి కూడా నొక్కి చెప్పింది. ఇదే సరైంది. కానీ, బీఆర్ఎస్ క్రమంగా బీజేపీకి దగ్గరవుతుందన్న వాదనలు మీడియాలో బలంగా ముందుకొస్తున్నాయి. మోడీ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ ఫలితమేనని కూడా వస్తున్నది. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఇంకా స్పందించకపోవటం ఆశ్చర్యకరం!



కామ్రేడ్ సరోజ్ చౌధురి అమర్‌రహే...

బీమా ఉద్యోగుల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ సరోజ్ చౌదరి 17జూన్ 1999న మరణించారు. ఆయన భౌతికంగా దూరమై 24సంవత్సరాలు అవుతోంది. కానీ ఆయన ఇన్సూరెన్స్ రంగానికి చేసిన సేవలు మాత్రం చిరస్మరణీయం. భారత కార్మికోద్యమంలోను, ముఖ్యంగా బీమా ఉద్యోగుల ఉద్యమాన్ని 'ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్' (ఏఐఐఈఏ)ను దేశ కార్మికోద్యమ చరిత్రలో సమున్నత స్థానానికి తీసుకువెళ్ళిన నాయకుల్లో సరోజ్ చౌధురి ముఖ్యులు. 1959 నుండి 1988 వరకు ఆయన ఇన్సురెన్స్ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా అనంతరం 1996 వరకు అధ్యక్ష, ఉపాధ్యక్ష బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి వేలాదిమంది ఇన్సూరెన్స్ ఉద్యోగులను ఉత్తేజపరిచి ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోకి ఆకర్షించిన మహానాయకులు.

కామ్రేడ్ సరోజ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. చరిత్ర, సాహిత్యం, సాంస్కృతిక కళారంగాల వంటి విభిన్న రంగాలలో ఆయనకు ఉన్న విజ్ఞానం అపారం. భిన్న జాతులు, మతాల కలయిక, వివిధ దేశాల సంస్కృతులు, కళలను తనలో ఇముడ్చుకున్న భారతీయ సంస్కృతి ఏదో ఒక మతానికి చెందినది కాదని, అది ప్రజలందరి ఉమ్మడి సొత్తని ఆయన భావన. మానవ సమాజ పరిణామక్రమంలో నూతన శకాన్ని ఆవిష్కరించిన, సామ్రాజ్యవాద దేశాల కబంధహస్తాల నుండి వలస దేశాల విముక్తికి, వర్ధమాన దేశాల ప్రగతికి దోహదం చేసిన 'సోషలిజం' అజేయం అనేది కామ్రేడ్ సరోజ్ ధృఢమైన అభిప్రాయం. అసమానతలను, వివక్షత, నిరంతర సంక్షోభాలకు నెలవైనది. రాజ్యాలను రాజ్యాలు, మనిషిని మనిషి దోపిడీ చేసుకునే పెట్టుబడిదారీ విధానమే అంతిమమనే కుహన ఆర్థికవేత్తల వాదనలను పూర్వపక్షం చేస్తూ, 1998లో హైదరాబాద్‌లో జరిగిన ఏఐఐఈఏ 19వ అఖిలభారత మహాసభలో ఆయన చేసిన ప్రసంగం దోపిడీ రహిత సమాజ స్థాపన పట్ల కామ్రేడ్ సరోజ్‌కు ఉన్న ధృఢవిశ్వాసానికి, ఆకాంక్షలకు ప్రతీక. సమానత్వం, న్యాయం, సన్నిహితతత్వంతో విలసిల్లుతూ ఒక మనిషి, వేరొక మనిషిని దోపిడీ చేయని నూతన సమాజం ఆవిర్భవించాలని కామ్రేడ్ సరోజ్ ఆకాంక్షించారు.

అతి ప్రమాదకరమైన లుకేమియా వ్యాధితో బాధపడుతూ కూడా జీవితం కంటే సిద్ధాంతం గొప్పదని భావించి కా॥ సరోజ్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమానికి మార్గదర్శకత్వం వహిస్తూనే ఇన్సూరెన్స్ వర్కర్, పీపుల్స్ డెమొక్రసీ పత్రికలకు వ్యాసాలు రాసి చైతన్యపరిచేవారు. బీమారంగ జాతీయీకరణ, 243 ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీల్లో వివిధ రకాలుగా ఉన్న జీతాల స్కేళ్ళు, ఇతర సర్వీసు కండీషన్లను అత్యధిక సంఖ్యాకులకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా స్థిరీకరణ, ఇన్సూరెన్స్ రంగంలో ఉపాధి కల్పనకు మూలమైన ఆటోమేషన్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. బీమారంగ జాతీయీకరణ తర్వాత మరలా బీమారంగాన్ని ప్రయివేటీకరించేందుకు పెట్టుబడి దారీవర్గం, ప్రభుత్వం సాగించిన కుట్రలను, ఎత్తుగడలను భగ్నం చేస్తూ ఏఐఐఈఏ నాయకత్వంలో అనేక పోరాటాలను నిర్మించి నాయకత్వం వహించారు. పాలకవర్గాల కుట్రల ఫలితంగా దేశ కార్మికోద్యమంలో వచ్చిన చీలికలకు అనుగుణంగా ఇన్సూరెన్స్ ఉద్యమంలో చీలికలు సృష్టించేందుకు జరిగిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక సమరం సాగించారు. బీమా ఉద్యోగుల ఐక్యతా పరిరక్షణ కోసం కృషిచేశారు.

నాటి ఆదిమ సమాజం నుండి నేటి వరకు 'మానవుని నిరంతర శ్రమ' ఫలితంగా ప్రపంచంలోని నేటి నాగరిక, సంపద సృష్టించబడ్డాయని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకున్నప్పుడు మానవుని పట్ల విశ్వాసం కోల్పోవడం మహాపాపం అన్న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాటలను ప్రస్తావిస్తూ, చరిత్ర పట్ల తన అపార విశ్వాసాన్ని ఆయన ప్రకటించారు. సమాజం సృష్టించిన ఈ సంపద కొద్దిమంది సొంతం చేసుకునేందుకు కోట్లాది మందిని దోపిడీ చేసే పెట్టుబడిదారీ విధానాన్ని సరోజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవైపు పొలాల్లో, కర్మాగారాల్లో, తోటల్లో శ్రామికుడు శ్రమిస్తూ మానవజాతి వికాసానికి మార్గం వేస్తుంటే, మరోవైపు దోపిడీదారులు మాత్రం ఉత్పత్తి సాధనాలను హస్తగతం చేసుకుని సకల సౌకర్యాలను అనుభవించడం చరిత్రలో ఒక ఘట్టంగా మాత్రమే మిగులుతుందని పేర్కొన్నారు. వేలాది సంవత్సరాలుగా మానవ నాగరికతా రథాన్ని గతుకులతో నిండిన కాలమనే రహదారిపై నడిపించింది శ్రమజీవులేనని మరువరాదని, ప్రగతి మొత్తానికి కారణభూతుడైన శ్రామికుడు అంతిమ విజయం సాధిస్తాడని పేర్కొన్నారు. అసమానతలు, వివక్షత, సెక్స్, హింస, నిరాశ, నిస్పృహలను ప్రోత్సహించే ప్రసారసాధనాలు మన సమస్యలకు పరిష్కారం చూపవని, మానవ సమాజం సాధించిన ప్రగతిని మన చుట్టూ జరుగుతున్న పరిణామాలను నిరంతరం అధ్యయనం చేయాలని కామ్రేడ్ సరోజ్ యువతరానికి పిలుపునిచ్చారు.

"ఎక్కడ చిన్నారులు తన చిన్ని బొజ్జ నింపుకునేందుకు భిక్షమెత్తరో పట్టెడన్నం కోసం మహిళలు శరీరాన్ని అమ్ముకునే దుస్థితి రాదో తండ్రులు తమ పిల్లలను వదిలి వెళ్ళరో, స్త్రీలు, పురుషులు, బాలలు ఎక్కడ ఆహ్లాదకరంగా జీవిస్తారో, లాభాలకు కాక 'శ్రమ'కు విలువ నిచ్చే సమాజాన్ని కోరుకున్న మానవతావాది" ... కామ్రేడ్ సరోజ్.

దేశ కార్మికోద్యమానికి ముఖ్యంగా ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమానికి తన జీవితాన్నే అంకితం చేసి త్యాగమయ జీవితాన్ని గడిపిన, మానవత్వం నింపుకున్న ఏఐఐఈఏ మహోన్నత నాయకులు, మహనీయులు కామ్రేడ్ సరోజ్ 24వ వర్ధంతి సందర్భంగా నేడు దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ ఉద్యోగులు నివాళులు అర్పించాలి. కామ్రేడ్ సరోజ్ చూపిన బాటలో పయనిస్తూ, జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడు కుంటామని ప్రతినబూనాలి. దేశ సమైక్యత, సమగ్రతల పరిరక్షణకు ఉద్య మిస్తామనే కర్తవ్యాలకు పునరం కితమవ్వడమే సరోజ్ చౌధురికి మనమిచ్చే నిజమైన నివాళి.



జి. కిషోర్‌కుమార్
9440905501

చదువుల్లో నాణ్యత... ప్రభుత్వాల బాధ్యత

ప్రభుత్వ బడంటే? సమాజ ఆస్తి. అది విలువలు, సమానత్వం, నైతికత పరిపూర్ణమైన వ్యక్తిత్వం గల పౌరులను తయారు చేసే కేంద్ర బిందువు. జీవితాన్ని నిలబెట్టే నాణ్యమైన విద్య పొందడం బాలబాలికల ప్రాథమిక హక్కు. ఏదేశం మనుగడ సాగాలన్నా అందులో కీలకమైనది విద్యారంగమే. దేశ వ్యవస్థలో దానిది తిరుగులేని స్థానం. మానవ మేధస్సుకు అతిముఖ్యమైన సాధనం. అటువంటి విద్యలో మన విద్యార్థులు ఎక్కడున్నారు. ఎలాంటి స్థానాల్లో ఉన్నారనేది ముఖ్యం. ప్రపంచంలోనే అతి పెద్ద పాఠశాల విద్యావ్యవస్థ మనది. సుమారు 15లక్షల పాఠశాలలు, 25కోట్ల మందికి పైగా విద్యార్థులు, 85లక్షల మంది ఉపాధ్యాయులతో ముందుకు సాగుతోంది. మైనం ముద్దలాంటి చిన్నారులను భావి భారత నిర్మాతలుగా మలచడంలో సర్వహంగులున్న పాఠశాలలు, గురువుల పాత్ర కీలకం. ఆహ్లాదకరమైన తరగతి గదిలో వృత్తి నిబద్ధత గల ఉపాధ్యాయుల బోధనలను అందిపుచ్చుకున్న జ్ఞానమే విద్యార్థుల భవిష్యత్తుకు చుక్కానిగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వీరి ప్రతిభా పాటవాలే రేపటి దేశ అభివృద్ధికి దోహదం. కానీ పాలకులకు విద్యా వ్యవస్థ మీద ఉన్న ఉదాసీన విధానాలు, కోవిడ్ మహమ్మారి విజృంభణతో పాఠశాలలు దీర్ఘకాలం (రెండు విద్యా సంవత్సరాలు) మూతబడ్డాయి. ఆ తర్వాత ఆన్‌లైన్ చదువుల్లో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు పాతాళానికి దిగజారిపోతున్నాయి. బడి గడప తొక్కకుండానే నేరుగా ఆ కాలంలోని విద్యార్థులు వారి వయసు ఆధారం చేసుకుని మూడో తరగతిలోకి చేర్చుకో(కూర్చో)వలసి వచ్చింది. అలా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో భాష, గణిత తదితర విషయాల్లో విద్యార్థుల్లో కనీస అభ్యసన



మేకిరి దామోదర్

స్థాయిలైన పఠనం, లేఖనం నైపుణ్యాలు ఘోరంగా తెగ్గోసుకుపోయిన చేదువాస్తవాలను అనేక నివేదికలు, అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ సంక్షోభం ప్రయివేటు, ప్రభుత్వం అనే తేడా లేకుండా అందరిని కుదిపేసి దెబ్బతీసింది. ఆ తర్వాత ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ట్యూషన్లు పెట్టించడం వల్ల అభ్యాసన కాస్త మెరుగైనటు సమాచారం. కానీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల్లో అత్యధికులు రెక్కాడితే గానీ డొక్కాడని పేద, బడుగు, మధ్య తరగతికి చెందిన పిల్లలు. వారి తల్లిదండ్రులు బతుకు దెరువు, జీవనోపాధిపై పెట్టినంత శ్రద్ధ వారి పిల్లల చదువులపై పెట్టలేరు. ట్యూషన్లు లాంటివి సమకూర్చలేరు. వారి ఆర్థిక పరిస్థితులు వారికి సహకరించవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాథమిక విద్యలో నాణ్యత లేమి వీరికి శాపంగా మారింది. వీరు విజ్ఞాన పోటీ ప్రపంచంలో తట్టుకోలేకపోతున్నారు.

దీనిని గుర్తించిన పాలకులు పలు నివేదికల, సూచనల మేరకు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మూలమైన ప్రాథమిక తరగతుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్న లక్ష్యంతో కేంద్రం గత విద్యా సంవత్సరం నుండి ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరిట అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. తెలంగాణలో తొలిమెట్టు పేరుతో 2022 ఆగస్టు 15న దీనికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే ముందే అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో? దేశవ్యాప్తంగా మౌఖిక, రాత పూర్వకంగా మొత్తం 20 మాతృభాషలు, గణితంలో మూడో తరగతి విద్యార్థుల ప్రగతిని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) పరిశీలించారు. దేశంలోని 10వేల ప్రభుత్వ ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 3వ తరగతి చదువుతున్న 86వేల విద్యార్థుల అధ్యయన పరిశీలన నివేదిక ఇది. ప్రపంచస్థాయి ప్రమాణాల ప్రకారం... నిమిషంలో 8పదాలలోపు మాత్రమే చదవగలిగిన వారిలో కనీస ప్రాథమిక పరిజ్ఞానం లేదని అర్థం. 9-26 మధ్య పదాలను తప్పుల్లేకుండా చదివితే, ప్రపంచ కనీస ప్రమాణాలను పాక్షికంగా అందుకున్నట్టు. 27-50



పదాలు చదవగలిగితే ప్రపంచ కనీస సామర్థ్యాలు కలిగి ఉన్నారని లెక్క. రెండు తెలుగు రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థుల పై ఎన్సీఈఆర్టీ పరిశీలనా నివేదికల మేరకు సగటున 52శాతం మంది విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలు లేవని స్పష్టమైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు చాలా వరకు మెరుగ్గా ఉన్నారు. మూడో తరగతిలో మాతృభాషను చదవలేకపోతున్నారు. 19శాతం మంది ఒక్క తెలుగు పదం కూడా చదవలేక పోవడం ఆందోళన కలిగిస్తుంది. మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో ఒక్కొక్క విద్యార్థిపై చేసే సగటు ఖర్చు రూ.60వేలు దాటుతుంది అని చెపుతుంది. విద్యా ప్రమాణాలు మాత్రం వెనుక బాటులో నాసిరకంగా ఉంటుందనే ప్రభుత్వాల వాదనలు ఇలా ఉంటే? వాస్తవ పరిస్థితులను చూస్తే గనుక పాఠశాల విద్యా బడ్జెట్ పెరుగుతున్నా అందులో సుమారు 90శాతం నిధులు జీతభత్యాలకు పోను, మిగిలిన 10శాతం ఇతర సదుపాయాలకు వెచ్చిస్తున్నట్టు తెలుస్తోంది.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ఉద్దేశించిన "మన ఊరు-మనబడి / మనబస్తీ-మన బడి" పనుల్లో కూడా వేగం పుంజుకోవడం లేదు. ఇప్పటికీ 85శాతం బడుల్లో కంప్యూటర్లు లేవు. ఉపాధ్యాయుల కొరత ఉన్నా నియామకాలు చేపట్టడం లేదు. ఆరువేలకు పైగా బడుల్లో ఒక్క ఉపాధ్యాయుడే ఐదు తరగతులు బోధించాల్సి వస్తుంది. బడి పారిశుద్ధ్య నిర్వహణ కోసం స్కావెంజర్లు, వాచ్‌మెన్లు లేరు. పాఠ్య పుస్తకాలు, దుస్తులు సకాలంలో అందడం లేదు. గత అనుభవాలు.. వివిధ రకాల ఖాళీలతో పాఠశాలల పర్యవేక్షణ పడకేసింది. 602 మండలాల్లో కేవలం 17చోట్ల మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలు ఉన్నారు. పీజీ హెచ్ఎమ్‌లకు ఒక్కొక్కరికి నాలుగు ఐదు మండలాల చొప్పున అదనపు బాధ్యతలు ఇవ్వడంతో అటు ఉన్నత పాఠశాల, ఇటు ప్రాథమిక పాఠశాలలలో పర్యవేక్షణ కుంటు పడుతోంది. ప్రాంతీయ విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులు ఇలా విద్యా వ్యవస్థ మొత్తం ఖాళీలతో కూనరిల్లుతూ, పర్యవేక్షణ లోపాలతో ప్రమాణాలు పడిపోతున్నట్లు అసర్ సర్వే 2022 చెపుతుంది. అంతేకాదు గతం కంటే గణనీయంగా పడిపోయినట్లు తెలిపింది. ఇలా ప్రభుత్వం లోపాలను కప్పి పుచ్చుకుంటూ సమస్యల పరిష్కారం చేయకుండా ఉపాధ్యాయులను సమాజంలో తక్కువ చేయడం భావ్యమా! ప్రభుత్వ బడిని ప్రయోగశాలగా మార్చారు. ఇవి ప్రయివేట్,

> పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ఉద్దేశించిన "మన ఊరు-మనబడి / మనబస్తీ-మన బడి" పనుల్లో కూడా వేగం పుంజుకోవడం లేదు. ఇప్పటికీ 85శాతం బడుల్లో కంప్యూటర్లు లేవు. ఉపాధ్యాయుల కొరత ఉన్నా నియామకాలు చేపట్టడం లేదు. ఆరువేలకు పైగా బడుల్లో ఒక్క ఉపాధ్యాయుడే ఐదు తరగతులు బోధించాల్సి వస్తుంది. బడి పారిశుద్ధ్య నిర్వహణ కోసం స్కావెంజర్లు, వాచ్‌మెన్లు లేరు. పాఠ్య పుస్తకాలు, దుస్తులు సకాలంలో అందడం లేదు. గత అనుభవాలు.. వివిధ రకాల ఖాళీలతో పాఠశాలల పర్యవేక్షణ పడకేసింది.

కార్పొరేట్ విద్యాసంస్థలకు పిల్లలు వెళ్లడానికి తోడ్పాటు కావా! అది మీకు తెలియదా! కరోనా మరణ మృదంగం వెరసి విద్యార్థుల్లో మాతృభాష, గణితం మిగతా విషయాల్లో కనీస సామర్థ్యాల వెనుకబాటుతనంతో విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. ఏ విషయాన్ని అవగాహన చేసుకోవాలన్నా... భాషపై పట్టు రావాలి. భాషాపరమైన వెనుకబాటు ఉంటే ఇతర సబ్జెక్టు(విషయా)ల్లో రాణించలేరు. ఈ సమస్య పరిష్కరించబడాలన్నా... పాఠశాల విద్య బాగుపడాలన్నా... ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో టైం బాండ్ ప్రోగ్రామ్‌తో బడులను సకల సౌకర్యాలతో ఎలాంటి ఖాళీలు, సమస్యలు లేని విధంగా సర్వహంగులతో తయారు చేయాల్సి ఉంది. అప్పుడు నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల భాషా, పరిజ్ఞానం మెరుగుపడుతుంది. అదే విధంగా విద్యా వ్యాపారాన్ని ఆపి 'కామన్ స్కూల్' విధానంలో అందరికీ ఉచిత నాణ్యమైన విద్యనందిస్తే దేశ భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉజ్వలిస్తుంది.

సెల్: 9573666650

ఒకరికొకరుగా ఉంటేనే..

సంసారాన్ని ప్రయాణంతో పోలుస్తూ ఉంటారు పెద్దలు. ఈ ప్రయాణంలో ఏ ఒక్కరు కాస్త ఆదమరచినా, వెనకబడిపోవాల్సిందే! ఆ పొరపాటు ఒకోసారి భాగస్వామిని చేజార్చుకునేంత వరకూ వెళ్లవచ్చు. లేదా శాశ్వతంగా మన పట్ల ఉన్న నమ్మకాన్ని పోగొట్టవచ్చు. అందుకే తస్మాత్ జాగ్రత్త అంటున్నారు అనుభవజ్ఞులు. అందుకే జీవిత భాగస్వామితో సంతోషంగా మన బంధం సాగాలనుకుంటే కచ్చితంగా ఇద్దరికీ తగ్గే ధోరణి అలవడి ఉండాలట. గొడవ ఏదైనప్పటికీ ఏదొక సమయంలో ఎవరో ఒకరు ఒక మెట్టు దిగి ఉంటేనే ఆ బంధం నిలబడుతుందని, 'క్షమాపణ' అనే చిన్న పదం బంధాన్ని బలపరుస్తుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. కొన్ని వందల జంటలపై సాగించిన అధ్యయనంలో వారికి వచ్చిన ఆరోపణల్లో మొదటి స్థానంలో ఈ 'సారీ' చెప్పకపోవడమే నిలిచిందట. అందుకే వారు కొన్ని సూచనలిస్తున్నారు.. అవేంటంటే...

మనసుకైన గాయం చిన్నదైనా, పెద్దదైనా ఎదుటివ్యక్తి దానికి 'సారీ' చెప్పకపోతే దానిని తమపై ప్రేమ లేనట్లుగానే భావిస్తారట. భార్య అయినా భర్త అయినా.. నిర్లక్ష్యం, ప్రేమ లేకపోవడం, బాధ్యతారాహిత్యం, ఇలా ఆ ఫీలింగ్‌కి రకరకాల మాస్కులు తొడిగేసి బాధ పడిపోతారట. ఇక ఆ భావనలు మనసుని పట్టి కుదిపేస్తుంటే అనుబంధం బీటలు వారక ఏమవుతుంది చెప్పండి?

క్షమాపణ కోరడం...

చిన్న సారీ పెద్ద ఉపద్రవాలని ఆపేయ్యగలదు అంటున్నారు పరిశోధకులు. చిన్న చిన్న మనస్పర్థలు ఒకటొకటిగా చేరి మనసును విరిచేస్తాయట. కాబట్టి ఎదుటి వ్యక్తి మనసు నొప్పిస్తే సిన్సియర్‌గా సారీ చెప్పండి.. బంధాన్ని కాపాడుకోండి అని సలహా ఇస్తున్నారు. కాస్త ఇగో పక్కన పెట్టి సారీ చెప్పేయడం ప్రారంభించండి.

ఎక్కడివక్కడే...

కెరీర్‌లో ముందుకు సాగాలంటే కష్టపడి పని చేయాల్సిందే! దానిని ఎవరూ కాదనలేరు. కానీ కుటుంబానికి కూడా కొంత సమయం కేటాయించకపోతే మనం పడే కష్టానికి అర్థమే ఉండదు. కనీసం ఇంట్లో ఉండే సమయంలో అయినా టీవీ, ఫేస్‌బుక్‌లాంటి వ్యాపకాలను పక్కనపెట్టి భాగస్వామితో కాస్త మాట్లాడే ప్రయత్నం చేయండి. ఆఫీసులో పని ఒత్తిడి గురించి కూడా భాగస్వామికి చెప్పి ఉంచితే... మీరు తనని కావాలనే దూరం ఉంచుతున్నారన్న భావన బలపడకుండా ఉంటుంది. అంతేకాదు, చాలామంది చేసే పొరపాటు.. తోటి ఉద్యోగులతోనో, స్నేహితులతోనో జరిగిన గొడవ తాలూకు కోపాన్ని ఇంట్లో వెళ్లగక్కుతూ ఉంటారు. ఆఖరికి ట్రాఫిక్‌లో ఆలస్యమైనా ఆ ఆవేశం ఇంట్లోనే ప్రదర్శిస్తారు. అలా కాకుండా ఇంటి గుమ్మం తొక్కే ముందే బయటి సమస్యలను బయటనే వదిలేసి ఇంట్లోకి అడుగుపెడితే సగం గొడవలు ఉండవట. అందుకే ఎక్కడి ఆలోచనలు అక్కడే వదిలేయాలని సూచిస్తున్నారు పెద్దలు.

ఆ బంధాలు వద్దే వద్దు..


జీవితంలో ఎంతోమంది తారసపడుతూ ఉంటారు. ఎవరికెంత ప్రాధాన్యం ఇవ్వాలన్నది మన విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. కానీ మీ స్నేహం సంసారంలోకి ప్రవేశిస్తోందన్న అనుమానం ఉంటే మాత్రం జాగ్రత్త పడాల్సిందే! మీ స్నేహాన్ని భాగస్వామి అపార్థం చేసుకుంటున్నారనో, మీ బంధం హద్దులు మీరడం లేదనో అనుకుంటే ఉపయోగం లేదు. ఆ పరిస్థితిని దాటుకుని మొండిగా సాగే స్నేహం సంసారం చీలిపోయేందుకు దారితీస్తుంది. అందువల్ల అటువంటి బంధాలకు ఎంత విలువ ఇవ్వాలో అంతే ఇవ్వాలి. కుటుంబ సమస్యలు పెరిగేదాక తీసుకురావద్దు.



గుడ్డిగా నమ్మితే ఎలా..?

ప్రేమ గుడ్డిదా..? కొంతమంది వ్యక్తులను చూస్తే ఇది నిజమే అనిపిస్తుంది. తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అక్క చెల్లెళ్లను కాదనుకొని ఓ కొత్త వ్యక్తితో పరిచయం, ఏమీ ఆలోచించకుండా వెంటనే ప్రేమించడం. ఇదే నేడు మనం చూస్తున్న ప్రేమ. అందుకే అలా అనాల్సి వస్తుంది. ఓ వ్యక్తిని గుడ్డిగా నమ్మితే ఆ తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత ఎవరు..? నమ్మించిన వ్యక్తిదా? మోసపోయిన వ్యక్తిదా? ఇలా ఎంత ఆలోచించినా చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టినట్టే ఉంటుంది. అలాంటి సమస్యే నిత్యకు వచ్చింది.

ఐద్వా అదాలత్



నిత్యకు ఇద్దరు చెల్లెళ్లు. తండ్రి లేడు, చనిపోయాడు. తల్లే పిల్లల్ని చూసుకుంటుంది. మేనమామ ఏదైనా అవసరమైనప్పుడు సహాయం చేస్తాడు. నిత్య తన ఇద్దరు చెల్లెళ్లతో కలిసి గురుకుల పాఠశాలలో చదువుకుంది. పదో తరగతి పూర్తి చేసిన నిత్య తల్లికి తోడుగా వుండేందుకు చిన్న ఉద్యోగం చూసుకున్నది. తాను ఎలాగో ఎక్కువగా చదువుకోలేదు. కాబట్టి తన చెల్లెళ్లను బాగా చదివించాలని, మంచి ఉద్యోగం చేస్తే చూడాలని తపించేది. ఆమె తపన చూసి తల్లి, చెల్లెళ్లు నిత్యను ఎంతో గౌరవించేవారు. ఆమె ఏం చెబితే అదే వినేవారు. ఒక విధంగా చెల్లెళ్లకు తల్లి తర్వాత తల్లిగా మారింది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది.

ఉద్యోగం చేసే దగ్గర గోపితో పరిచయం ఆమె జీవితం మొత్తం తలకిందులు చేసింది. అతను పరిచయం అయిన నెల రోజులకే ప్రేమలో పడింది. ఆ కొద్ది రోజుల్లోనే ఆమె గోపిని పూర్తిగా నమ్మింది. కుటుంబ సభ్యులకి, స్నేహితులకి ఎవ్వరికీ చెప్పకుండా గుళ్లో పెండ్లి చేసుకుంది. ఆ పెండ్లికి ఎలాంటి సాక్ష్యాలు ఆమె దగ్గర లేవు. ఇద్దరూ కలిసి రూమ్ తీసుకుని కాపురం కూడా పెట్టారు. విషయం తెలుసుకున్న తల్లి 'ఇలా ఎందుకు చేశావు, నాకు చెబితే నేనే పెండ్లి చేసేదానిని కదా! నీవు ఇలా చేయడం సరైనది కాదు. ఇంకా ఇద్దరు చెల్లెళ్లు వారికి పెండ్లి ఎలా జరుగుతుంది?' అంటూ బాధపడింది. అంతే కాదు 'పెండ్లి చేసుకున్నారు కాబట్టి ఇక మాతో ఎలాంటి సంబంధం వద్దు. మీ పాటికి మీరు హాయిగా ఉండండి. మా దగ్గరకు రాకండి' అంటూ ఏడుస్తూ వెళ్ళిపోయింది.

పెండ్లి తర్వాత నెల రోజులు గోపి బాగానే ఉన్నాడు. తర్వాత ఉద్యోగం మానేశాడు. తాగడం మొదలు పెట్టాడు. నిత్య జీతం మొత్తం అతనే తీసుకునే వాడు. ఊరిలో భూ తగాదా ఏదో ఉందని చెప్పి వెళ్ళి వారం పది రోజులు ఉండొచ్చే వాడు. ఇలా ఆరు నెలలు గడిచింది. కూతురిని చూడకుండా తల్లి ఉండలేకపోయింది. మళ్ళీ నిత్యతో మాట్లాడడం మొదలు పెట్టింది. కూతుర్ని ఓసారి ఇంటికి పిలిపించి 'గోపి గురించి ఎవరికీ తెలియదు. కాబట్టి నువ్వు అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్ళు, గోపిని మాత్రం తీసుకురాకు. నేను మామయ్య వాళ్ళతో మాట్లాడి పెద్దల సమక్షంలో మీ ఇద్దరికీ పెండ్లి చేస్తాను. అప్పటి వరకు గోపి గురించి ఎవరికీ చెప్పొద్దు' అంది.

> 'మీరు చెప్పింది నిజమే మేడమ్. ఏమీ ఆలోచించకుండా అతను ప్రేమిస్తున్నా అన్న వెంటనే నమ్మేశాను. నాకు బాగా బుద్ధి చెప్పాడు. మా బావా చాలా మంచి వాడు. ఇప్పటికీ నన్ను పెండ్లి చేసుకుంటా అన్నాడంటే ఎంత గొప్ప మనవు..! ఇన్ని రోజులు నా వాళ్ళందరిని బాధ పెట్టాను. ఇకపై మీరు చెప్పినట్టే నడుచుకుంటాను'



తల్లి చెప్పిన దానికి నిత్య ఒప్పుకుంది. కానీ పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకోవడం గోపికి ఇష్టంలేదు. దాంతో ప్రతి రోజూ నిత్యతో గొడవ పడేవాడు. చివరకు కొట్టడం మొదలుపెట్టాడు. ఒక రోజు బాగా కొట్టి నిత్యను వాళ్ళ అమ్మ ఇంట్లో వదిలేసి వెళ్ళిపోయాడు. తల్లి పని దగ్గర నుంచి వచ్చి విషయం తెలుసుకుని నిత్యను ఆస్పత్రిలో చేర్పించింది.

విషయం బంధువుల దగ్గరకు వెళ్ళింది. వెంటనే నిత్య మేనమామ ఇద్దరికీ పెండ్లి చేద్దామని గోపి కోసం వాళ్ళ రూమ్‌కి వెళ్ళాడు. కానీ అక్కడ అతను లేడు. నిత్యను మోసం చేసి, ఎలాంటి ఆధారాలు మిగల్చకుండా ఎటో వెళ్ళి పోయాడు. నిత్యకు అతని పేరు మాత్రమే తెలుసు. అతని కుటుంబ సభ్యుల గురించి గానీ, ఊరి గురించి గానీ తెలియదు. కనీసం అతని తల్లిదండ్రుల పేర్లు కూడా తెలియదు. గోపి ఆధార్ కార్డు కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక ఐద్వా లీగల్ సెల్ దగ్గరకు వచ్చారు.

నిత్య సమస్య మొత్తం విన్న సభ్యులకు 'అసలు గోపి నిజంగా నిత్యను ప్రేమించి ఉంటే ఇలా వదిలేసి ఎందుకు వెళ్లిపోతాడు. తన వివరాలు ఏవీ ఆమెకు తెలియకుండా ఎందుకు జాగ్రత్తపడ్డాడు' ఇలా ఎన్నో అనుమానాలు వచ్చాయి. ఎలాగో ఆరా తీస్తే అతనికి ఇంతకు ముందే పెండ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారనే విషయం తెలిసింది. ఇదే విషయాన్ని లీగల్‌సెల్ సభ్యులు నిత్యకు చెప్పారు. 'గోపితో నీకు జరిగిన పెండ్లికి ఎలాంటి ఆధారాలు లేవు. కావాలనే అతను ఆధారాలు లేకుండా చేశాడు. నిన్ను మోసం చేయాలని అతను ముందే ప్లాన్ చేసుకున్నాడు. జీవితం పట్ల ఎంతో అవగాహన ఉన్నదానివి, చెల్లెళ్లకు తల్లిగా మారి వారి మంచి చెడులు చూడాలనుకున్నావు. ఇలా అతని మాయలో పడ్డావు. గుడ్డిగా నమ్మేశావు.

ఇక అతని గురించి ఆలోచించి నీ సమయం వృథా చేసుకోకు. మళ్ళీ కొత్త జీవితం ప్రారంభించు. నువ్వంటే మీ బావకు చాలా ఇష్టమట. మీ మామయ్య చెప్పాడు. అతనితో కూడా మేము మాట్లాడటం. మీ బావను పెండ్లి చేసుకుని హాయిగా ఉండు. గోపిని ఓ పీడ కలగా మర్చిపో' అన్నారు. 'మీరు చెప్పింది నిజమే మేడమ్. ఏమీ ఆలోచించకుండా అతను ప్రేమిస్తున్నా అన్న వెంటనే నమ్మేశాను. నాకు బాగా బుద్ధి చెప్పాడు. మా బావా చాలా మంచి వాడు. ఇప్పటికీ నన్ను పెండ్లి చేసుకుంటా అన్నాడంటే ఎంత గొప్ప మనసు..! ఇన్ని రోజులు నా వాళ్ళందరినీ బాధ పెట్టాను. ఇకపై మీరు చెప్పినట్టే నడుచుకుంటాను' చెప్పి నిత్య వెళ్ళిపోయింది..

ఏడాది తర్వాత నిత్య తన బావతో కలిసి తన పాపను తీసుకుని లీగల్‌సెల్‌కు వచ్చింది. ఐద్వాకు నేను చాలా రుణపడి ఉంటాను. నా జీవితం ఎటుపోతుందో అనుకున్నప్పుడే ఒక మంచి మార్గం చూపించారు. నేను ఇప్పుడు నా భర్త, పాపతో చాలా సంతోషంగా ఉన్నాను. దానికి కారణం ఐద్వానే. మీరు నాలాంటి చాలా మంది అమ్మాయిలకు అండగా ఉండాలని కోరుకుంటున్నాను. నా మాదిరిగా మరే అమ్మాయి ప్రేమ 'పేరుతో మోసపోకూడదు' చెప్పి సంతోషంగా వెళ్ళిపోయింది.

- వై. వరలక్ష్మి, 9948794051

ఇట్ల చేద్దాం

సునాముఖి, కరక్కాయ, సోంపు మూడింటిని సమానంగా తీసుకుని పొడిచేసి మూడు వేళ్ళ మందం పట్టుకుంటే వచ్చేంత తీసుకుని 5 గ్రాముల తేనెలో కలుపుకుని రాత్రిపూట తింటే మలబద్దకం పోతుంది.



దుర్మార్గం

(మొదటిపేజీ తరువాయి)

సరైన సూచనలు చేస్తూ, అభ్యుదయ భావాలతో రాష్ట్ర, దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజంలో గౌరవమున్న వ్యక్తిపై మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో రాష్ట్ర ప్రభుత్వం దేశద్రోహం కేసును బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్‌గా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిన హరగోపాల్ రిటైర్డ్ అయిన తర్వాత కూడా ప్రజా సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి, తాగునీరు, భూసమస్యలు, దళిత, గిరిజనులపై దాడులు తదితర అంశాలపై స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారని వివరించారు. 2022, ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ప్రసాద్‌తో 50 మంది మావోయిస్టులు సమావేశమైనట్టు ప్రకటించిన ప్రభుత్వం, ఇందులో పాల్గొన్నవారిలో 44వ వ్యక్తిగా హరగోపాల్ పేరును నమోదు చేసిందని పేర్కొన్నారు. ఆయనతోపాటు వి సంధ్య, విమలక్క, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ ఖాసీం తదితర 152 మందిపై పోలీసులు దేశద్రోహం కేసులను నమోదు చేశారని వివరించారు. ఇలా రాష్ట్రంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్న వారిపై ఏదో ఒక వంకతో రాజద్రోహం కేసు మోపడం అప్రజాస్వామికమంటూ ఈ చర్యను ఖండించారు. ఈ లెక్కన ఉద్యమాలు చేస్తున్నవారందరినీ దేశద్రోహం చట్టం కింద జైళ్లల్లో పెట్టే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హక్కుల కోసం నినదిస్తే పీడీ యాక్ట్ కింద జైళ్లపాలు చేస్తున్నదని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందినవారు నేరాలు చేస్తే వారిపై ఎలాంటి చర్యల్లేవని విమర్శించారు. కనీసం కేసులు కూడా లేవని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడుతున్నామంటూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రకటించుకున్న రాష్ట్ర ప్రభుత్వం వామపక్షవాదులను లక్ష్యంగా చేసుకుని వారిపై కేసులు బనాయించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. వామపక్షాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడం తప్ప తమ స్వార్థానికి ఏనాడూ ఉద్యమాలు నిర్వహించలేదని స్పష్టం చేశారు. వామపక్షాలు ఉండడం వల్లే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కొనసాగుతున్నదని తెలిపారు. వామపక్షాలను అణచివేయడమంటే, ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని అణచివేయడమేనని వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న దేశద్రోహ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులు అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. హరగోపాల్, ఇతరులపై పెట్టిన దేశద్రోహం కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వామపక్షాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దుర్మార్గమైన చర్య

- హరగోపాల్‌తోపాటు మరో 152 మంది ఉపా కేసులు నమోదు చేయడం పై :టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు మరో 152 మందిపై తాడ్వాయి పోలీస్‌స్టేషన్లలో ఉపా కేసులు నమోదు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ పాలకులు ప్రజాస్వామ్యవాదులను భయపెట్టాలని చూస్తున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ సమాజం గర్వించదగ్గ గొప్ప మేధావి హరగోపాల్ అని కొనియాడారు. పౌర హక్కుల కోసం ఆయన అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడి ప్రజాహక్కులను కాపాడారని గుర్తు చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో పౌర హక్కుల కోసం పాఠాలు బోధించారని వివరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం పని చేశారని తెలిపారు. నక్సలైట్ ఎజెండానే మా ఎజెండా అని ప్రకటించిన కేసీఆర్, హరగోపాల్ నక్సలైట్లకు సహకరిస్తూ దేశ ద్రోహానికి పాల్పడుతున్నారని కేసులు పెట్టడం అప్రజాస్వామిక చర్య అని అభిప్రాయపడ్డారు. నక్సలైట్ల ఎజెండానే మా ఏజండా అని ప్రకటించిన కేసీఆర్‌పైన కూడా కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. వారిపై నమోదు చేసిన ఉపా కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక, పౌర సంఘాలు బీఆర్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రజల కోసం పని చేస్తుండడంతో ప్రభుత్వాలు ఇలా పాశవికంగా ప్రవర్తిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హరగోపాల్‌తోపాటు 152 మంది పైన ఉపా కేసులు ఎత్తేస్తామని రేవంత్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరు మార్పు

న్యూఢిల్లీ : నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ఎన్ఎంఎంఎల్) పేరును ప్రధాన మంత్రుల మ్యూజియం, సొసైటీగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ సమావేశం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగింది. ఈ ప్రత్యేక సమావేశంలో మ్యూజియం పేరును మార్చాలని నిర్ణయించినట్టు సాంస్కృతిక శాఖ వెల్లడించింది. దీని పేరును ప్రధానమంత్రుల మ్యూజియం అండ్ సొసైటీగా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. 'జవహర్‌లాల్ నెహ్రూ నుంచి నరేంద్ర మోడీ వరకు ఎంతో మంది ప్రధానమంత్రులు చేసిన సేవలు, వారు ఎదుర్కొన్న సవాళ్లకు సంబంధించి అన్ని విషయాలను ఈ మ్యూజియం తెలియజేస్తుంది. అందుకే దీని పేరును మారుస్తూ చేసిన ప్రతిపాదన స్వాగతించదగినది' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రులు అంటే ఓ సంస్థ అని అభివర్ణించిన ఆయన, అందరు ప్రధానుల ప్రయాణాన్ని ఇంద్రధనస్సుతో పోల్చారు. ఇది అందంగా ఉండాలంటే ఇంద్రధనస్సులోని రంగులన్నీ సమపాళ్లలో ఉండాలని అభిప్రాయపడ్డారు.

అభద్రతాభావంతో ప్రధాని : కాంగ్రెస్

దీనిపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభద్రతాభావంతో అణగారిపోతున్న సూక్ష్మజీవి అని మండిపడింది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈ మేరకు శుక్రవారం ట్వీట్ చేశారు. మన దేశ తొలి ప్రధాన మంత్రి, భారత దేశ రూపశిల్పి జవహర్‌లాల్ నెహ్రూకు పేరు, ప్రతిష్టలు, గొప్ప వారసత్వం ఉన్నాయని చెప్పారు. ఆయనను గుర్తు చేసుకుంటూ మ్యూజియం అండ్ లైబ్రరీకి ఆయన పేరును పెట్టినట్టు తెలిపారు. 'చిల్లరతనం, కక్షసాధింపు అంటేనే మోడీ. 59ఏళ్లకుపైగా పుస్తక భాండాగారంగా, ఆర్కైవ్స్ ఖజానాగా, గ్లోబల్ ఇంటలెక్చువల్ ల్యాండ్‌మార్క్‌గా ఎన్ఎంఎంఎల్ నిలిచింది. దేశ రూపశిల్పి యొక్క పేరు, ఔన్నత్యాలను చెరిపేయటానికి, చులకన చేయడానికి, నాశనం చేయడానికి మోడీ చేయని పని అంటూ ఏదీ లేదు' అని జైరామ్ రమేశ్ ఆరోపించారు. అభద్రతాభావంతో క్రుంగిపోతున్న సూక్ష్మ జీవి స్వయం ప్రకటిత విశ్వగురువు' అని మోడీని జైరామ్ రమేశ్ దుయ్యబట్టారు.

ఎన్ఎంఎంఎల్ సొసైటీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షుడు, రాజ్‌నాథ్ సింగ్ ఉపాధ్యక్షుడు. కేంద్ర మంత్రులు అమిత్ షా, అనురాగ్ ఠాకూర్, ధర్మేంద్ర ప్రధాన్, జి. కిషన్ రెడ్డి, నిర్మల సీతారామన్ తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఢిల్లీలోని తీన్ మూర్తి క్యాంపస్‌లో ఎన్ఎంఎంఎల్ ఉంది. ఇక్కడ ఆధునిక, సమకాలిక భారత దేశంపై పరిశోధనలు జరుగుతాయి. 1964 నవంబరు 14న అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ దీనిని ప్రారంభించారు.

వ్యక్తులు కాదు..వ్యవస్థ ముఖ్యం

- గడప ముందే సమస్యల పరిష్కారం
- దేశంలో ఎక్కడా లేని విధంగా వార్డు కార్యాలయాల ఏర్పాటు
- ఒకే రోజు 132 డివిజన్లలో ప్రారంభం
- వార్డు పాలనతో జవాబుదారీతనం
- భవిష్యత్తులో ఇతర శాఖల అధికారులను కూడా అనుసంధానం చేస్తాం
- కాచిగూడ వార్డు ఆఫీస్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-సిటీబ్యూరో/అంబర్‌పేట్

"ఏ సమస్య వచ్చినా సర్కిల్ స్థాయివరకు వెళ్లకుండా ఇక్కడే పరిష్కారం అయ్యేవిధంగా వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేశాం.. వ్యక్తులు కాదు, వ్యవస్థ ముఖ్యం. రాజకీయాలకు అతీతంగా ఈ వ్యవస్థ విజయవంతానికి కృషి చేయాలి.. వార్డు కార్యాలయాల పాలనతో గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయి" అని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. కాచిగూడ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వార్డు కార్యాలయాల పాలనతో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారం కావడంతోపాటు స్థానిక అభివృద్ధి జరుగుతుందన్నారు. మెరుగైన పాలనతో అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. వార్డు స్థాయిలో కార్పొరేటర్లు ఉన్నా, అధికార యంత్రాంగం ప్రత్యేకంగా లేకపోవడం వల్ల ఈ వార్డు కార్యాలయ వ్యవస్థను తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 4 కోట్లకుపైగా జనాభాగా ఉండగా.. నగరంలో కోటికిపైగా జనాభా ఉందని, అయితే జీహెచ్ఎంసీ 30 సర్కిళ్లలో 35వేల మంది ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారైనా వార్డు కార్యాలయంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందించేలా ఈ వ్యవస్థను రూపొందించినట్టు తెలిపారు. ఇక్కడ విజయవంతం అయితే దేశం మొత్తం ఈ వ్యవస్థను అన్ని నగరాల్లో అమలు చేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వార్డు కార్యాలయాల్లో ఎవరు ఫిర్యాదు చేసినా వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. సత్వరం వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

వార్డు వ్యవస్థ కొత్తది అయినందున కొద్ది రోజులపాటు కొన్ని సమస్యలు ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. సాధ్యమైనంత వేగంగా ఈ వ్యవస్థ సంపూర్ణంగా పనిచేసేలా కృషి చేస్తామన్నారు. వార్డు కార్యాలయానికి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఇన్‌చార్జీగా ఉంటారని, ఈ ఆఫీసుకు మొత్తం పదిమంది అధికారుల బృందం వివిధ శాఖల నుంచి పనిచేస్తారని వివరించారు. రోడ్డు నిర్వహణ, పారిశుధ్యం, ఎంటమాలజీ, హరితహారం, టౌన్ ప్లానింగ్, విద్యుత్ శాఖ, జలమండలి, కంప్యూటర్ ఆపరేటర్ ఇలా పదిమంది అధికారులు వార్డు స్థాయిలో జరిగే ఆయా శాఖల కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. భవిష్యత్తులో ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ తరపున కూడా వార్డు కార్యాలయానికి అనుసంధానం చేస్తామని మంత్రి వెల్లడించారు.

కమిషనర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. 150 వార్డులకుగాను 132 వార్డులను ప్రారంభించామని, మిగతా 18 వార్డులను వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ముఖ్యంగా మున్సిపల్, రెవెన్యూ ఆరోగ్య, పోలీస్, విద్యుత్ వ్యవస్థలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజల నుంచి అధికంగా వచ్చే అవకాశాలున్నాయన్నారు. వైద్య, ఆరోగ్య, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారులను కూడా వార్డు కార్యాలయానికి అనుసంధానం చేయాలని మంత్రిని కోరారు. వార్డు కార్యాలయంలో మున్సిపాల్టీకి సంబంధించిన సమస్యలే కాకుండా ఇతర శాఖల సమస్యలను కూడా స్వీకరించి సంబంధించిన శాఖకు తెలియజేయడం జరుగుతుందన్నారు. జలమండలి ఏండీ దాన కిషోర్ మాట్లాడుతూ.. కాచిగూడ వార్డులో 50 వేల జనాభా ఉంటే 5200 నల్లా కనెక్షన్లు ఉన్నాయన్నారు. తాగు నీరు నిర్దేశించిన సమయం ప్రకారం సప్లయ్ చేస్తున్నప్పటికీ, కొన్నిసార్లలో ప్రెషర్, సివరేజీ సమస్య వస్తుందన్నారు. వీటిపై వార్డు కార్యాలయం సిబ్బంది అప్రమత్తతో అప్పటికప్పుడే పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు ఉమా రమేష్ యాదవ్, దూసరి లావణ్యా శ్రీనివాస్‌గౌడ్, విజయకుమార్ గౌడ్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, యూబీడీ అడిషనల్ కమిషనర్, వి.కృష్ణ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ వేణుగోపాల్, నాయకులు డాక్టర్ శిరిషా ఓం ప్రకాష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు ఘన స్వాగతం లభించింది. భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి బేగంపేటకు చేరుకున్న ఆమెకు గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్ పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. రాష్ట్రపతికి వారు శాలువాలు కప్పి సన్మానించారు. ఆమెకు స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి రాష్ట్రపతి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. శుక్రవారం రాత్రి అక్కడే బస చేయనున్న ఆమె...శనివారం దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో రివ్యూయింగ్ ఆఫీసర్‌గా పాల్గొంటారు. అనంతరం తిరిగి ఢిల్లీకి పయనమవుతారు.

ప్రత్యామ్నాయమంటే ఇదేనా?

(మొదటిపేజీ తరువాయి)

విలువ ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యం దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం నియంతృత్వాన్ని అమలు చేస్తున్నదనీ, అందుకు ఉపా చట్టం కేంద్రానికి సాధనంగా ఉందని అన్నారు. అలాంటి చట్టాన్ని రద్దు చేయాలనీ, రాష్ట్రంలో అమలుచేయనని చెప్పాల్సిన రాష్ట్ర ప్రభుత్వం... అదే ఉపా చట్టాన్ని ప్రొఫెసర్ హరగోపాల్, తదితరులపై ప్రయోగించడాన్ని ఆయన ఖండించారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఉత్తమ అధ్యాపకుడిగా అందరి మన్ననలను పొందారని, విద్యా బోధనతో పాటు సామాజిక బాధ్యతను నెరవేర్చుతున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాలకు తన వంతు మద్దతును కొనసాగిస్తున్నారనీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులపై జరిగే దాడులను ప్రతిఘటించి అన్ని ఉద్యమాలలో భాగస్వామ్యమవుతున్నారనీ, అలాంటి వ్యక్తిపై ఎక్కడో ఎవరి డైరీలో పేర్లు ఉన్నాయనే పేరుతో ఉపా చట్టాన్ని ప్రయోగించటం దుర్మార్గమైందని విమర్శించారు. నరేంద్రమోడి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయమంటే ఉపా చట్టాన్ని ప్రయోగించడం కాదనీ, దాన్ని రద్దు చేయాలని పిలుపు నివ్వటమని తెలిపారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని కోరాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే దాన్ని ప్రయోగించడం నియంతృత్వాన్ని నెత్తినెట్టుకోవటమేనని పేర్కొన్నారు.

కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హరగోపాల్ వివిధ అంశాలపై స్పందిస్తూ సామాజికంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారని వివరించారు. వారితోపాటు మరో 152 మందిపై దేశద్రోహం కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. వామపక్షవాదులపై కేసులు బనాయించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. సమాజంలో గౌరవించబడే మేధావులు, ఇతరులనే ఇలాంటి చట్టంలో ఇరికిస్తే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ హక్కులపై జరిగిన దాడులను ప్రతిఘటించటంలో భాగస్వాములవుతున్న హరగోపాల్, ఇతరులపై పెట్టిన దేశద్రోహం కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



వికలాంగులకు సామాజిక భద్రత కరువు..

- పెన్షన్ పెంపు కోసం దేశవ్యాప్త ఉద్యమం
- జూన్ 20నుండి జూలై 9వరకు గ్రామ సభలు
- జూలై 10న ఛలో ఢిల్లీ : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

వికలాంగులకు సామాజిక భద్రత, పెన్షన్ పెంపు, ప్రతి కుటుంబానికి అంత్యోదయ రేషన్ కార్డు, నామినేటెడ్ పదవులలో రిజ్వేషన్స్ అమలు చేయాలనే డిమాండ్‌పై జూలై 10న జరిగే ఛలో ఢిల్లీనీ జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం అడివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో విద్యావైజ్ఞానిక శిక్షణా తరగతులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతోపాటు వికలాంగుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ.. జూన్ 20 నుండి జూలై 9 వరకు దేశ వ్యాప్తంగా గ్రామాల్లో సభలు, ప్రచార క్యాంపెయిన్‌లు నిర్వహిస్తామని తెలిపారు. జూలై 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు ప్రతి వికలాంగుల కుటుంబాలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. వికలాంగులు వారి కుటుంబ సభ్యుల అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన ఉపాధి, స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు ఇచ్చి 200 రోజులు పని కల్పించాలనీ, ప్రజారవాణా వ్యవస్థలో, ప్రభుత్వ ,ప్రయివేట్, సామూహిక ప్రాంతాలు వికలాంగులకు అనుకూలంగా లేకపోవడంతో విద్యా, ఉపాధి, వైద్యానికి వికలాంగులు నోచుకోవడం లేదని తెలిపారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ పేదరికంతోనే అంగవైకల్యం పెరుగుతుందని వాపోయారు. పాలకుల విధానాలు కూడా దినికి ప్రధాన కారణమని వివరించారు. వంద మంది వికలాంగుల్లో 68 మంది పౌష్టిక ఆహార లోపంతో బాధపడుతున్నారని తెలిపారు. దీనివల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుందని చెప్పారు.కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్,ఆర్‌వెంకటేశ్, జర్కొని రాజు, కాశప్ప, జె దశరథ్, వి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లావల్ వర్సిటీలో జి.శ్వేతకు డాక్టోరల్ సీటు

అభినందనలు తెలిపిన ప్రియాంకవర్గీస్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ములుగు ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో విద్యనభ్యసించిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన గిల్లెల శ్వేతకు కెనడాలోని లావల్ యూనివర్సిటీలో డాక్టోరల్(వుడ్స్ సైన్స్) ఉచిత సీటు లభించింది. ఈ మేరకు ఆ ఇనిస్టిట్యూట్ డీన్ ప్రియాంకవర్గీస్ ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ములుగు ఫారెస్ట్ కాలేజీలో ఆమె మాస్టర్స్, మహారాష్ట్రలోని డాక్టర్ పంజాబ్రావ్ దేశ్‌ముఖ్ కృషి విద్యాపీఠ్ నుంచి బీఎస్సీ బ్యాచిలర్స్ పూర్తిచేశారని తెలిపారు. లావల్ వర్సిటీలో డాక్టర్ కపిల్ సిహాగ్, డాక్టర్ సుమిత్ యాదవ్ మార్గదర్శకత్వంలో శ్వేత డాక్టరల్ ప్రోగ్రామ్ చేయనున్నారు. పూర్తి స్కాలర్‌షిప్, ఫీజు మినహాయింపుతో ప్రతిష్టాత్మకమైన విదేశీ విశ్వవిద్యాలయంలో డాక్టోరల్ సీటు పొందినందుకు ఆమెను ప్రియాంక వర్గీస్ అభినందించారు. ఆమె విజయం ములుగు కళాశాలలోని విద్యార్థులందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

జర్నలిస్టులు కొనుక్కున్న స్థలంపై అభ్యంతరమేంటి?



- వేల కోట్ల విలువైన ప్లాట్లపై కేసీఆర్ కుటుంబం కన్ను
- బాధిత జర్నలిస్టులకు న్యాయం చేస్తాం.. మిగతా వారికీ ఇండ్లు కట్టిస్తాం: బండి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

జర్నలిస్టులు సొసైటీగా ఏర్పడి కొనుక్కున్న 70 ఎకరాల స్థలాన్ని వారికి ఇవ్వడానికి కేసీఆర్ ప్రభుత్వానికి అభ్యంతరమేంటి? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఆ స్థలంపై కేసీఆర్ కుటుంబం కన్నుపడిందనీ, దాన్ని కొట్టేయడానికే ఈ డ్రామా అని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే సొసైటీకి ఆ స్థలం దక్కేలా చూస్తామనీ, సీనియర్, జూనియర్ జర్నలిస్టులు అనే తేడా లేకుండా ఇండ్లు లేని వారందరికీ కట్టిస్తామని హామీ నిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్‌లో గల జేఎన్‌జేహెచ్ సొసైటీ స్థలాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన జర్నలిస్టులకే రాష్ట్రంలో న్యాయం దక్కకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలం కోసం ఎదురుచూసి 60 మంది జర్నలిస్టులు నేలరాలిపోయారన్నారు. ఇంకెంత మంది చస్తే కనికరిస్తారంటూ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ఉల్లంఘనపై పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. చాలీచాలని జీతాలతో జర్నలిస్టులు అద్దె కొంపల్లో ఉంటూ సమాజం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. సొసైటీ కమిటీ పేరు చెప్పుకుని కొందరు జర్నలిస్టులు బాగుపడ్డరనీ, ఎమ్మెల్యే, కార్పొరేషన్ పదవులు దక్కించుకున్నారని విమర్శించారు. పర్యటనలో సుప్రీంకోర్టు న్యాయవాది, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎస్.రామచంద్ర రావు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులు హరీష్ రెడ్డి, విక్రమ్ రెడ్డి ఉన్నారు.

డిప్లమా ఫీజులపై త్వరగా నిర్ణయం తీసుకోండి

- ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

నవతెలంగాణ–హైదరాబాద్

తెలంగాణలో పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు సంబంధించి ఫీజుల నియంత్రణపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిప్లమా కోర్సులను ఏఎఫ్ఆర్‌సీ పరిధిలోకి తేవాలని గతేడాది ఫిబ్రవరిలో సాంకేతిక విద్యాశాఖ ప్రతిపాదనలు పంపింది. దీనిపై ప్రభుత్వం నేటి వరకు నిర్ణయం తీసుకోలేదని, అడ్మిషన్లు జరుగుతున్నందున దానిపై తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రారంభమైనందున ఫీజులు రూ.40 వేలు వసూలుకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ పలు ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీలు పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ కేసులో వివరణ ఇవ్వాలన్న గత ఆదేశాలపై ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి స్పందించకపోవడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని గతంలో ఆదేశించారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని, ఫీజుల అంశంపై సత్వరమే నిర్ణయం తీసుకుంటామని దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి పరిశీలించారు. ఈ అంశంపై వారం రోజుల్లోగా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంటుందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అధికారులు నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీలు విద్యార్థుల నుంచి రూ.40 వేలు ఫీజు వసూలుకు అనుమతిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నిర్ణయించే ఫీజులు అంత కంటే తక్కువగా ఉంటే ఎక్కువ వసూలు చేసిన మొత్తాన్ని విద్యార్థులకు తిరిగి చెల్లించాలని కాలేజీలను ఆదేశించారు.

కల్తీ కల్లు మృతుల కేసులో నోటీసులు

పాలమూరు జిల్లాలో కల్తీ కల్లు సేవించి ముగ్గురు మృతి, పలువురు ఆస్పత్రిపాలు కావడానికి బాధ్యులపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అనిల్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్, ఎస్సైలకు నోటీసులిచ్చింది. విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

అంబరాన్ని అంటేలా నేడు గిరిజనోత్సవ సంబురాలు

రవీంద్రభారతిలో పెద్ద ఎత్తున వేడుకలు హాజరుకానున్న మంత్రులు, ఉన్నతాధికారులు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజనోత్సవ సంబురాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గిరిజనులతో పెద్ద ఎత్తున సమావేశం జరగనున్నది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, మహిళా,శిశు సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ , పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. రాష్ట్రంలోని ఆయా గిరిజన గ్రామాల్లో సభలు జరగనున్నాయి. గత తొమ్మిదేండ్లలో గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు, గిరిజనుల చిరకాల వాంఛను తీరుస్తూ తండాలకు, గూడాలకు గ్రామ పంచాయతీ హోదా కల్పించిన తీరును, విద్య ఉద్యోగాల్లో ఎస్టీల రిజర్వేషన్ 10 శాతం పెంచిన విషయాన్ని ఉత్సవాల్లో ప్రముఖంగా ప్రసావిస్తారు. హైదరాబాద్‌లో బంజారా భవన్, ఆదివాసి భవన్ నిర్మాణం, కుమ్రంభీం జయంతి, సేవాలాల్ మహారాజ్ జయంతి, సమ్మక్క సారక్క జాతర, అందుకోసం భారీగా నిధులు వెచ్చిస్తున్న తీరును, వివిధ జాతరలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం, తదితర వివరాలను ఈ కార్యక్రమాల్లో వెల్లడిస్తారు.



గిరిజనులకు " స్వర్ణ యుగం" మే..

పోడు భూములకు పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి సర్కారు సన్నద్ధమవుతున్నది. అందుకు తగిన విధంగా పట్టాపుస్తకాలను ముద్రిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పోడు రైతుకు హక్కు పత్రాలు ఇవ్వాలనే డిమాండ్ క్షేత్ర స్థాయిలో బలంగా ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 6శాతం నుంచి 10శాతానికి పెంచడం వంటి విప్లవాత్మక నిర్ణయాల ద్వారా విద్య ఉద్యోగ రంగాల్లో గణనీయమైన మార్పునకు ప్రభుత్వం నాంది పలికింది.

సమగ్రాభివృద్ధికి కృషి..

'పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ఆదివాసీ, గిరిజనుల సమగ్రాభివృద్ధికి నిష్పక్ష పాతంగా ప్రభుత్వం కృషిచేస్తున్నది. భారీ స్థాయిలో నిధుల కేటాయించింది. ఎన్నో దశాబ్దాల అణచివేతకు, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ఆదివాసీలు, బంజారాలు ఇతర సామాజిక వర్గాలతో సమానంగా ఎదిగేందుకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాను పెంచింది. వారి సమగ్రాభివద్ధికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ప్రాధాన్యతా క్రమంలో వాటిని ఖర్చు చేస్తున్నది. గిరిజన గూడేలను, తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని దశాబ్దాలుగా చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రాష్ట్రంలోని 3,146 తండాలు, గూడేలకు గ్రామపంచాయతీ హోదా కల్పించింది. ఆయా పంచాయతీల్లో రూ.1,897.08 కోట్లతో పలు అభివద్ధి కార్యక్రమాలను చేపట్టింది. గ్రామపం చాయతీ భవనాల నిర్మాణం కోసం రూ. 300 కోట్లు ఎమ్ ఎఎస్డీఎఫ్ కింద ప్రత్యేక నిధులను ఈ ఏడాది కేటాయించింది.

విద్యాభివృద్ధికోసం కృషి..

గిరిజన విద్యార్థుల కోసం దేశంలో ఎక్కడా. లేనివిధంగా ప్రత్యేకంగా 92 గురుకుల విద్యాలయాలను నెలకొల్పింది. వీటిలో రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, ఫైన్ ఆర్ట్స్ కాలేజీలు, లా కాలేజీలు, సైనిక్ స్కూల్, కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్స్ సహా పలు విద్యా సంస్థలను నెలకొల్పింది. గురుకుల భవనాల నిర్మాణానికి రూ. 292 కోట్లు కేటాయించింది. గురుకులాల్లో శిక్షణ పొందిన వందలాది మంది ఎస్టీ విద్యార్థినీ విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకున్న వారికి ఒక్కొ క్కరికి రూ.20 లక్షల చొప్పున రూ.33.49 కోట్లను సర్కారు అందజేసింది. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు సంభవించినప్పుడు వైద్యసిబ్బందిని అప్రమత్తంగా ఉంచటమే కాక..ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నదని సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ తెలిపారు.

హరగోపాల్‌పై రాజద్రోహం కేసును ఉపసంహరించుకోవాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రొఫెసర్ హరగోపాల్‌పై రాజద్రోహం కేసును ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పౌరహక్కుల నేత హరగోపాల్‌పై ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో రాజద్రోహం కింద కేసు నమోదు చేసినట్టు పత్రికల్లో చూశానని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి నక్సలైట్లతో సంబంధాలున్నాయనే నెపంతో కేసు పెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాలకూ నాణ్యమైన విద్య అందాలని కృషి చేస్తున్న విద్యావేత్త, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరిగినపుడు వారికి అండగా, నికరంగా నిలబడుతున్నారని తెలిపారు. ఆయన నిరంతరం పౌర హక్కుల కోసం పనిచేస్తున్న ప్రజాస్వామిక వాది అని వివరించారు. గొప్ప విద్యావేత్త అని పేర్కొన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని హరగోపాల్‌పై పెట్టిన రాజద్రోహం కేసును వెంటనే ఉపసంహరింపచేయాలని కోరారు.

ఇది అన్యాయం : టీఎస్‌యూటీఎఫ్

ప్రముఖ విద్యావేత్త, సామాజిక హక్కుల కార్యకర్త ఆచార్య హరగోపాల్‌పై చట్ట వ్యతిరేక



కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), రాజద్రోహం అభియోగాలతో బనాయించిన కేసును ఉపసంహరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. మావోయిస్టుల డైరీలో పేరు ఉన్నంత మాత్రాన కేసు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం పట్ల అవ్యాజమైన ప్రేమ, స్పష్టమైన అవగాహన కలిగి, ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య హక్కుగా అందాలని కోరుకుంటూ దేశవ్యాప్తంగా విద్యా పరిరక్షణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్న మేధావి హరగోపాల్ అని తెలిపారు. ఆయనపై రాజద్రోహం, ఉపా కేసులు పెట్టటం అన్యాయం.

మేధావులపై ఉపా కేసులను ఎత్తేయాలి : కేవీపీఎస్

ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు మరో 152 మందిపై అక్రమంగా పెట్టిన ఉపా కేసులను తక్షణమే ఉపసంహరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్స్ విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు ప్రజాస్వామిక ఉద్యమాల్లో భాగస్వాములవుతూ ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా ఉన్న హరగోపాల్‌పై ఉపా కేసు పెట్టడమేంటని ప్రశ్నించారు. తక్షణమే ఆ ఉపా కేసులను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు .

పీడీఎస్‌యూ ఖండన

విద్యావేత్తలు, హక్కుల నేతలపై ఉపా చట్టం బనాయించడాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ తీవ్రంగా ఖండించారు. వారిపై కేసులు పెట్టడం సరైంది కాదని, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. 152 మందిపై నమోదు చేసిన ఉపా కేసును తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

హరగోపాల్‌పై ఉపా కేసును ఉపసంహరించుకోవాలి

సీపీఐ(ఎంఎల్) రెవెల్యూషనరీ ఇనిషియేటివ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నిరంతరం ప్రజా సమస్యలపై మాట్లా డుతూ, ప్రభుత్వానికి సరైన సూచనలు చేస్తూ, అభ్యుదయ భావాలు కల్గిన ప్రొఫెసర్ హర గోపాల్‌పై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన దేశద్రోహం కేసును ఉపసం హరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) రెవెల్యూషనరీ ఇనిషియేటివ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం డిమాండ్ చేశారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తు న్నామని అన్నారు. ఉపాధి, తాగునీరు, భూ సమస్యలు, దళిత, గిరిజనులపై దాడులు తదితర అంశాలపై హరగోపాల్ ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దష్టికి తెస్తున్నారని గుర్తుచేశారు. 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ప్రసాద్‌తో 50 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు ప్రభు త్వం ప్రకటించిందని, అందులో హరగోపాల్ కూడ ఉన్నట్టు ప్రకటించడం, వామపక్షవాదులను లక్ష్యంగా చేసుకుని కేసులు బనాయించడం దుర్మార్గమని అన్నారు.

రమేష్‌ను కొనసాగింపుపై ధిక్కార కేసు

నవతెలంగాణ–హైదరాబాద్

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పదవిలో ఇన్‌చార్జిని నియమించరాదన్న ఉత్తర్వులను సస్పెండ్ చేసిన తర్వాత కూడా ఆయనను కొనసాగించడం కోర్టు ధిక్కారమవుతుందని, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రమేష్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమిస్తూ 2017లో ఇచ్చిన జీవోను హెల్త్ కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ సవాల్ చేసింది. ఆ జీవోను హైకోర్టు ఇటీవల సస్పెండ్ చేసింది. అయినప్పటికీ ఆయననే ఆ పదవి నిర్వహిస్తున్నారంటూ హెల్త్ కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ ఎస్.నందా విచారించి ప్రతివాదులైన వైద్యారోగ్య శాఖలు, ఇన్‌చార్జిగా ఉన్న రమేష్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

ఆంగ్ల మాధ్యమంపైనే ఆసక్తి

- ఆ మీడియంలో 93.55 శాతం మందికి సీట్లు
- కామర్స్‌లో చేరేందుకే ఎక్కువ మంది మొగ్గు
- దోస్త్ తొలివిడతలో 73,220 మందికి సీట్ల కేటాయింపు
- 63 కాలేజీల్లో సున్నా ప్రవేశాలు
- బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్సుకు ఆదరణ
- మరిన్ని కాలేజీల్లో ప్రవేశపెడతాం
- నాన్ దోస్త్ కళాశాలలకు కొత్త కోర్సుల అనుమతి ఇవ్వం : నవీన్ మిట్టల్, లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

డిగ్రీలో ఆంగ్ల మాధ్యమంలో చదివేందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. దోస్త్ తొలివిడత సీట్ల కేటాయింపులో 93.55 శాతం మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో సీట్లు పొందడం గమనార్హం. గతేడాది ఇంగ్లీష్ మీడియంలో 90.89 శాతం మందికి సీట్లు వచ్చాయి. ఈ ఏడాది 2.66 శాతం అధికంగా చేరేందుకు మొగ్గు చూపారు. ఇక తెలుగు మాధ్యమంలో కేవలం 5.77 శాతం మంది సీట్లు పొందారు. గతేడాది ఈ మాధ్యమంలో 8.26 శాతం మందికి సీట్లు కేటాయించారు. ఈ ఏడాది 2.49 శాతం మంది తగ్గడం గమనార్హం. హిందీ మాధ్యమంలో తొమ్మిది మంది, ఉర్దూ మాధ్యమంలో 484, అరబిక్‌లో ఏడుగురికి సీట్లు కేటాయించారు. ఉన్నత విద్యకు వెళ్లాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలన్నా ఇంగ్లీష్ మాధ్యమంలో చదివిన వారికి ఎక్కువ ప్రాధాన్యత లభిస్తున్నది. అందుకే ఎక్కువ మంది విద్యార్థులు ఆ మాధ్యమంలో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి శుక్రవారం తొలివిడత సీట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దోస్త్‌కు తొలివిడతలో 1,05,935 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 78,212 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. 73,220 మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లు నమోదు చేయకపోవడం వల్ల 4,992 మంది విద్యార్థులు సీట్లు పొందలేకపోయారని అన్నారు. మొదటి ఆప్షన్‌తోనే 53,032 మంది, రెండో ఆప్షన్‌తో 19,909 మంది విద్యార్థులు సీట్లు పొందారని వివరించారు.

డిగ్రీలో మిగిలిన 2.83 లక్షల సీట్లు

రాష్ట్రంలో 889 (గురుకులాలు కలిపి) డిగ్రీ కాలేజీల్లో 3,56,258 సీట్లున్నాయని నవీన్ మిట్టల్, లింబాద్రి చెప్పారు. అందులో 73,220 మందికి సీట్లు కేటాయించామన్నారు. దీంతో డిగ్రీ కాలేజీల్లో 2,83,038 (79.45 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈనెలాఖరులోగా విడుదల చేస్తామన్నారు. దోస్త్ తర్వాతి విడతల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరుతారని అన్నారు. డిగ్రీ కోర్సుల్లో కామర్స్‌లోనే ఎక్కువ మంది చేరేందుకు మొగ్గు చూపుతున్నారని వివరించారు. 33,251 (45.41 శాతం) మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. బీకాం కంప్యూటర్ కోర్సులో చేరేందుకు 1,04,687, బీకాం జనరల్‌లో చేరేందుకు 12,651 వెబ్‌ఆప్షన్లను విద్యార్థులు నమోదు చేశారని వివరించారు. ఆర్ట్స్‌లో 7,771 (10.61 శాతం), లైఫ్‌సైన్సెస్‌లో 16,434 (22.44 శాతం), ఫిజికల్ సైన్సెస్‌లో 13,468 (18.39 శాతం), డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్)లో 1,955 (2.67 శాతం), డీఫార్మసీలో 254 (0.35 శాతం), ఇతర కోర్సుల్లో 87 (0.12 శాతం) మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని చెప్పారు. సీట్లు పొందిన వారిలో అబ్బాయిలు 29,107 (39.75 శాతం), అమ్మాయిలు 44,113 (60.25 శాతం) మంది ఉన్నారని వివరించారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు 20.5 శాతం అధికంగా సీట్లు పొందిన వారిలో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 63 డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు నమోదయ్యాయని వివరించారు. సీట్ల కేటాయింపు వివరాలను విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపించామన్నారు. ప్రయివేటు కాలేజీల్లో సీట్లు పొందిన వారు ష్ట్రజూం://సశీర్.ఎస్ట్రప్ర.ప్రశీఐ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించి ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే విద్యార్థులు రూ.500, రానివారు రూ.వెయ్యి చెల్లించి ఆన్‌లైన్‌లో ఈనెల 25 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీట్లను రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విశ్వవిద్యాల కాలేజీల్లో సీట్లు పొంది ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న వారు సెల్ఫ్‌రిపోర్టింగ్ కోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

నాన్ దోస్త్ కాలేజీలపై అధ్యయనానికి త్రిసభ్య కమిటీ

నాన్ దోస్త్ కాలేజీలపై అధ్యయనం కోసం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని నవీన్ మిట్టల్, లింబాద్రి చెప్పారు. 38 నాన్ దోస్త్ కాలేజీ యాజమాన్యాలతో



సమావేశాన్ని నిర్వహించామని అన్నారు. అయితే డిగ్రీలో ప్రవేశపెట్టిన కొత్తకోర్సులను నాన్ దోస్త్ కాలేజీలు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. రెండో విడత తర్వాత ఏదైనా కాలేజీ లేదా కోర్సులో 15 మంది కంటే తక్కువ చేరితే వేరే కాలేజీ లేదా వేరే కోర్సులో చేరాలంటూ విద్యార్థులకు సమాచారం అందిస్తామని వివరించారు. అయితే కొత్తగా ప్రారంభించిన బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్సుకు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ వచ్చిందన్నారు. 13 ప్రభుత్వ, ఒక ప్రయివేటు కలిపి 14 డిగ్రీ కాలేజీల్లో ఈ కోర్సును ప్రవేశపెట్టామని, వాటిలో 880 సీట్లుంటే, తొలివిడతలోనే 662 మంది విద్యార్థులు సీట్లు పొందారని అన్నారు. మరిన్ని డిగ్రీ కాలేజీల్లో ఈకోర్సును ప్రవేశపెడతామని చెప్పారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో బీఎస్సీ ఆనర్స్ బయోటెక్నాలజీ కోర్సును ప్రారంభించామని, 60కి 60 సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. రాష్ట్రంలో ప్రముఖ డిగ్రీ కాలేజీలకు ఎక్కువ డిమాండ్ ఉన్నదని అన్నారు. నిజాం కాలేజీలో 1,050 సీట్లుంటే 35,117 మంది, ప్రభుత్వ సిటీ కాలేజీలో 1,509 సీట్లకుగాను 22,802 మంది, తెలంగాణ మహిళా వర్సిటీ కాలేజీలో 1,777 సీట్లుంటే, 19,600 మంది, సైఫాబాద్ కాలేజీలో 730 సీట్లకుగాను 12,190 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని చెప్పారు.

దోస్త్ తొలివిడత సీట్ల కేటాయింపు వివరాలు

మొత్తం కాలేజీలు	- 889
మొత్తం సీట్లు - 3,56,258	
వెబ్‌ఆప్షన్లు ఇచ్చినవారు	- 78,212
సీట్లు పొందిన వారు	- 73,220
మిగిలిన సీట్లు	- 2,83,038
తక్కువ ఆప్షన్లతో సీట్లు పొందనివారు	- 4,992
సున్నా ప్రవేశాలున్న కాలేజీలు	- 63

కోర్సుల వారీగా సీట్ల కేటాయింపు

ఆర్ట్స్	- 7,771 (10.61 శాతం)
కామర్స్	- 33,251 (45.41 శాతం)
లైఫ్ సైన్సెస్	- 16,434 (22.44 శాతం)
ఫిజికల్ సైన్సెస్	- 13,468 (18.39 శాతం)
డాటాసైన్స్, ఏఐ/ఎంఎల్	- 1,955 (2.67 శాతం)
డీ ఫార్మసీ	- 254 (0.35 శాతం)
ఇతర	- 87 (0.12 శాతం)

మీడియం వారీగా సీట్ల కేటాయింపు

ఇంగ్లీష్ మీడియం	- 68,494 (93.55 శాతం)
తెలుగు మాధ్యమం	- 4,226 (5.77 శాతం)
హిందీ మాధ్యమం	- 9 (0.01 శాతం)
ఉర్దూ మాధ్యమం	- 484 (0.66 శాతం)
అరబిక్ మాధ్యమం	- 7 (0.009 శాతం)

దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్లు షురూ

దోస్త్ రెండో విడత కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైందని నవీన్ మిట్టల్, లింబాద్రి చెప్పారు. ఈనెల 27 వరకు రిజిస్ట్రేషన్లు, వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి గడువుందని వివరించారు. దోస్త్ తొలివిడతలో సీట్లు రాని విద్యార్థులు, సీట్లు పొందినా వేరే కోర్సు లేదా కాలేజీ మారాలనుకునే వారితోపాటు ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారు రెండో విడతలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 30న సీట్లు కేటాయిస్తామన్నారు. తుదివిడత సీట్లు కేటాయించే వరకు విద్యార్థులెవరూ కాలేజీకి వెళ్లాల్సిన అవసరం లేదని, ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇవ్వొద్దని, ఫీజు కట్టాల్సిన పనిలేదని చెప్పారు. జులై 17 నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. కరోనా తర్వాత ఈ విద్యాసంవత్సరం సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నింజె, కళాశాల విద్యాశాఖ ఆర్జేడీ జి యాదగిరి, జెడీ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డి తిరువెంగళచారి, దోస్త్ టెక్నికల్ కోఆర్డినేటర్ గజేంద్రబాబు, ఐసీటీ అధికారి యమునారాణి, రూసా రీసెర్చ్ ఆఫీసర్ డి వసుంధర, దోస్త్ హెల్ప్‌డెస్క్ కోఆర్డినేటర్ ఎం విజయరెడ్డి, దోస్త్ టెక్నికల్ సపోర్టు సిహెచ్ కిషోర్‌కుమార్, సీజీజీ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ పి హేమంత్‌కుమార్, సీనియర్ బిజినెస్ అనలిస్ట్ మతీన్‌బేగ్, ప్రాజెక్టు లీడ్ ఎం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

భూమిలేదని బుకాయిస్తే..

మీ ఆక్రమిత భూముల లెక్కలు తీస్తాం • పేదల జోలికొస్తే ఖబడ్దార్



ప్రతిపక్ష పార్టీలు చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- భూపోరాట కేంద్రాలు సందర్శించి భరోసానివ్వాలి
- 24న ప్రజాసంఘాల పోరాట వేదిక బస్సు యాత్ర : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో పేదలకు పంచేందుకు ప్రభుత్వ భూములు లేవని బీఆర్ఎస్ సర్కార్ బుకాయిస్తే.. అధికార పార్టీ నేతలు ఆక్రమించుకున్న భూముల లెక్కలు బయటకు తీస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 కేంద్రాల్లో భూపోరాటాలు జరుగుతున్నాయని, ఈ పేదలకు నివాసస్థలాలు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో పుట్టగతులుండవని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలకు పేదలపై చిత్తశుద్ధి ఉంటే భూపోరాట కేంద్రాలను సందర్శించి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల కోసం పేదలు చేసే పోరాటానికి సీపీఐ(ఎం) అండగా ఉంటుందని, అవసరమైతే పేదల కోసం ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధమని తెలిపారు. ఇండ్లస్థలాల కోసం జరిపే ఈ పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు కులమతాలను జొప్పించి చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తారని, అలాంటివారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో ఐక్యత వీడొద్దని చెప్పారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో 28 రోజులుగా సుమారు 500 మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ఈ భూపోరాట కేంద్రాన్ని శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొ్రపాటి రమేష్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్నా నేటికీ పేదోడు తలదాచుకునేందుకు జాగా లేదని, దేశంలో పార్టీలు, జెండాలు మారుతున్నా పేదల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు లేవని చెబుతున్న నేతలు.. తమతో వస్తే స్థలాలు చూపిస్తామని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే గణేష్ ప్రభుత్వ స్థలాలు లేవని అంటున్నారని, ఇక్కడికి(దుబ్బ) వస్తే తాము చూపిస్తామని, తాము ప్రభుత్వ స్థలంలో నిల్చొనే మాట్లాడుతున్నామని స్పష్టంచేశారు. ప్రభుత్వ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు మింగేస్తున్నా.. వారిని వదిలేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు.. పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నగరంలో ఇప్పటికే సుందరయ్యనగర్, దొడ్డికొమరయ్య కాలనీ, బహుజన కాలనీ నిర్మించామని, తెలంగాణలో పేదలకు భూములు పంచిన ఘనత సీపీఐ(ఎం)కే దక్కుతుందన్నారు. ఎంత అణిచివేసినా, అధికార బలం చూపినా భూమిని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇక కేంద్రంలోని మోడీ సర్కారు 2024 వరకు అందరికీ ఇండ్లు కట్టిస్తామని వాగ్దానం చేసి విస్మరించారని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన అన్నారని, నిజామాబాద్‌లో ఎవరికైనా ఇండ్లు వచ్చాయా అని ప్రజలను ప్రశ్నించారు. దానికి అందరూ రాలేదని సమాధానం ఇచ్చారు. ఇక కేసీఆర్ కొత్తగా గృహలక్ష్మి పథకం అంటున్నారని, ఇండ్లు ఉన్నవారికి రూ.3లక్షలు ప్రకటించారని గుర్తు చేశారు. 'మూడు లక్షలతో ఇండ్ల నిర్మాణం పూర్తయితదా.. మీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులు మూడు లక్షలతోనే కట్టారా.. అని ప్రశ్నించారు. గృహలక్ష్మిలో స్థలం ఉన్న పేదలకు కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్రం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక స్థలం లేని వారికి ప్రభుత్వం స్థలం ఇవ్వాలని, ఒకవేళ ప్రభుత్వ భూములు లేకుంటే ప్రయివేటు వ్యక్తుల నుంచి భూమి కొని పంచాలని డిమాండ్ చేశారు. ఇక భూపోరాట కేంద్రాల్లోని పేదలకు మద్దతుగా ఈ నెల 17వ తేదీ నుంచి ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బస్సు యాత్ర ప్రారంభిస్తున్నామని, 24వ తేదీన జిల్లాలో జరిగే జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా నాయకులు నూర్జహాన్, గోవర్ధన్, సూరి, సుజాత, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు రైతుల ఖాతాల్లోకి రూ.3వేల కోట్లు

- 11 లక్షల మంది రైతుల నుంచి రూ.13,264కోట్ల పంట కొనుగోలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

"ప్రకృతి వైపరీత్యాలకు ఎదురెళ్లి మరీ యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా 64.52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచింది. 11లక్షల మంది రైతుల నుంచి రూ.13వేల 264విలువైన పంటను కొని దశలవారీగా రైతులకు డబ్బులు జమ చేస్తున్నాం. శుక్రవారం ఒక్కరోజులోనే రైతుల ఖాతాల్లో రూ.3వేల కోట్లు జమ చేశాం. ఈనెల 20 వరకు పూర్తి డబ్బులు చెల్లిస్తాం' అని బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. కరీంనగర్ జిల్లాలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించిన 11లక్షల మంది రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.9,168కోట్లు జమ చేసినట్టు తెలిపారు. గతంలో కన్నా అధికంగా 7034 కొనుగోలు కేంద్రాలను తెరిచి 15లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా సేకరించామని, ఇది 90శాతానికిపైగా పూర్తయిందని వివరించారు. ఇప్పటి వరకు 18 జిల్లాల్లో సంపూర్ణంగా ధాన్యం కొను గోళ్ళు పూర్తయ్యాయని, మిగతా జిల్లాల్లో రేపటి వరకూ పూర్తి చేస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని ఆ సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ శుక్రవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు.

గిరిజనబంధు అమలుచేయకుంటే.. పోరాటాలే..!

- తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్



నవతెలంగాణ- హన్మకొండ

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు లోపు గిరిజనబంధు అమలు చేస్తూ జీఓ జారీచేయాలని, లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం పలు జిల్లాల్లో నిరసనలు జరిగాయి. హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హన్మకొండ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట చేట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన బంధు అమలు చేస్తామని గతేడాది సెప్టెంబర్ 17న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, అయినా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో గిరిజనబంధు ఎప్పుడు అమలుచేస్తారో ప్రభుత్వం స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనబంధు అమలు చేయకుండా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో గిరిజన ఉత్సవాలను నిర్వహించడం గిరిజనులను మోసం చేయడమేనని విమర్శించారు. గిరిజన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి చేసి దశాబ్ది ఉత్సవాల ముగింపు లోపు గిరిజనబంధు అమలుకు జీఓ జారిచేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 15 లక్షల గిరిజన కుటుంబాల్లో 10 లక్షల కుటుంబాలకు పైగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని, కానీ భూమిలేని గిరిజనులకు మాత్రమే గిరిజన బంధు ఇస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనబంధు సాధన కోసం గిరిజనులు, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, మేధావులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బల్లకొండ శ్రీకాంత్, వాంకుడోత్ వీరన్న, నాయకులు, జగన్, తిరుపతి, రమేష్, సిద్ధు, నరసింహ, రమ, సుమలత, సారయ్య, స్వరూప, లాలూ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయంగా కేంద్రం మద్దతు ధరలు : పోతినేని

- రైతు సంఘాలకు కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : టి.సాగర్



నవతెలంగాణ-అశ్వారావుపేట

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ధాన్యం పంటలకు మద్దతు ధర అశాస్త్రీయంగా ఉందని, 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి, మొక్కుబడిగా మద్దతు ధర ప్రకటించటం దారుణమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శనరావు అన్నారు. ఈ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రైతు రాజకీయ శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పోతినేని మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయకుండా మద్దతు ధర ఎలా అమలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. మొక్కజొన్న, పత్తి పంటల మద్దతు ధర అదే పరిస్థితి నెలకొన్నదని, పత్తి పంటను సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో నెలకొన్న పోడు భూముల సమస్య పరిష్కరించి పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ధరణి పథకం ఉన్నా ఎటువంటి అభ్యంతరం లేదని కానీ ధరణిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రుణమాఫీ ప్రకటించాలని, ఏడాదిలో దేశవ్యాప్తంగా 13 వేల రైతు ఆత్మహత్యలు నమోదు కావటం కేంద్ర పాలనకు నిదర్శనం అన్నారు.

సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. విద్యుత్ సవరణ బిల్లును రైతులకు వ్యతిరేకంగా పార్లమెంటులో పెట్టి దొడ్డిదారిన తీర్మానం చేయటం సబబు కాదన్నారు. ఇందుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఉన్న ఐదు వందల సంఘాలతో కలసి జులై నుంచి దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం దేశంలోనే పెద్ద కుంభకోణమని ఆరోపించారు. విడతల వారీగా ఆందోళనలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహా రెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యలమంచిలి వంశీ క్రిష్ణ, అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఐలూ రాష్ట్ర 3వ మహాసభ

హాజరుకానున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి

- పాల్గొననున్న 400 మంది ప్రతినిధులు



నవతెలంగాణ - భువనగిరి

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభ ఈనెల 17, 18వ తేదీల్లో భువనగిరిలోని దీప్తి నూతన హోటల్లో జరగనుంది. ప్రారంభ సభకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ హాజరుకానున్నారు. 18వ తేదీన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయన్, బార్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.నరసింహారెడ్డి హాజరు కానున్నారు.

సభకు ముస్తాబైన ప్రాంగణం

దీప్తి హోటల్ ఏ.అనంతరెడ్డి నగర్‌లోని కొండపల్లి ఉత్తమ్ కుమార్ హాల్‌లో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నారు. ముందుగా సీనియర్ న్యాయవాది కొత్త బుచ్చిరెడ్డి మహాసభ కాన్ఫరెన్స్ పతాకాన్ని ఎగురవేస్తారు. మహాసభ ఏర్పాట్లలో 10 రోజులుగా రాష్ట్ర అధ్యక్షులు జె.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, యాదాద్రి భువనగిరి జిల్లా ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాగారం అంజయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి వెంకట్ రెడ్డి, ఎండి.ఇస్మాయిల్‌తో పాటు ఆహ్వాన సంఘం సభ్యులు భాగస్వాములయ్యారు. జిల్లాలో పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

దేశవ్యాప్తంగా న్యాయవాదులు, న్యాయవ్యవస్థ కక్షిదార్ల సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత న్యాయవాదుల సంఘం ఏర్పడిందని ఐలూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిడి వెంకటరెడ్డి, ఎండి.ఇస్మాయిల్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఈనెల 17న ఉదయం 10 గంటలకు రాష్ట్ర మహాసభ ప్రారంభం కానుంద న్నారు. న్యాయవాదులు సకాలంలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. 400 మంది ప్రతినిధులు పాల్గొననున్నట్టు చెప్పారు.

గడిచిన మూడేండ్ల కార్యకలాపాలను సమీక్షించుకొని.. రానున్న మూడేండ్ల కర్తవ్యాలను సభలో రూపొందిస్తా మన్నారు. న్యాయవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని, మృతిచెందిన న్యాయవాది కుటుంబానికి రూ.ఆరు లక్షలు చెల్లించాలని, న్యాయవాదులు అందరికీ ఇండ్ల స్థలాలు ఉచితంగా లేదా కనీస ధరకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. న్యాయవాదులకు ఇన్సూరెన్స్‌తో హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో పూర్తిస్థాయిలో కోర్టులు ఏర్పాటు చేసి భవనాలు నిర్మించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. న్యాయాధికారులు న్యాయశాఖ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ న్యాయవాదులకు గవర్నమెంట్ లీడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వీటన్నింటిపై రాష్ట్ర మహాసభలో చర్చించనున్నట్టు చెప్పారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ముగ్గురు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు
- క్షతగ్రాతులను హైదరాబాద్‌కు తరలింపు



నవతెలంగాణ-పరిగి

వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర బాయిలర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్యాసింజర్ ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పరిగి ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలం వెన్నచేడ్‌కు చెందిన ప్యాసింజర్ ఆటో వివిధ గ్రామాల నుంచి ప్యాసింజర్లను ఎక్కించుకొని పరిగికి వస్తోంది. ఈ ఆటోలో ఏడుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు, ఐదుగురు పురుషులు ఉన్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర బాయిలర్ మిషన్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ హైవేపై పరిగి నుంచి కొడంగల్ వెళ్తున్న కారు అజాగ్రత్తగా, రాష్ డ్రైవింగ్‌తో రావడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీ కొట్టింది. ఆటోలో ఉన్న 15 మందిలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఐదు మందికి స్వల్ప గాయాలయ్యాయి. తొమ్మిది మందిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో దోమ మండలం పీర్లగుట్ట తాండాకు చెందిన హెమ్లీ బాయ్ (55), గుండాలకు చెందిన శశికళ (35), కొత్తపల్లికి చెందిన అంజిలమ్మ (65) మృతి చెందారు. క్షతగ్రాతులకు హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హన్మకొండలో ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టుకు ఖండన

- తక్షణమే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హన్మకొండ జిల్లాలో శనివారం ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు పర్యటన సందర్భంగా ఒకరోజు ముందే ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్లో నిర్బందించడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ చర్యను మేధావులు, ప్రజాస్వామికవాదులు కూడా ఖండించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, కాకతీయ వర్సిటీలో హాస్టళ్లు, మెస్ సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తున్న నాయకత్వాన్ని అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిజంగా విద్యారంగం పట్ల చిత్తశుద్ధి ఉంటే పర్యటనల సందర్భంగా భయపడి పోలీసులతో ఎందుకు ముందస్తు అరెస్టు చేయిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమ్మాయి అని కూడా చూడకుండా పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం దుర్మార్గమని విమర్శించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్ సుల్తానా, ఇతర నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన

- దురుసుగా ప్రవర్తించిన హెచ్ఎం.. దేహశుద్ధి చేసిన యువకులు
- పీఈటీ, హెచ్ఎంను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు




నవతెలంగాణ- కల్హేర్

సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువు తున్న ఓ విద్యార్థిని పట్ల అదే పాఠ శాలలో పనిచేస్తున్న పీఈటీ సంగ్రా మ్ గురువారం అసభ్యకరంగా ప్రవ ర్తించాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తన తల్లిదండ్రుల దృష్టికి తీసు కెళ్లారు. దాంతో ప్రధానోపాధ్యాయుడితో చర్చించేందుకు విద్యార్థిని తల్లి దండ్రులు శుక్రవారం పాఠశాలకు వెళ్లి.. జరిగిన విషయాన్ని హెచ్ఎం కు వివరిస్తుండగా.. పీఈటీ సంగ్రామ్ జోక్యం చేసుకొని విద్యార్థిని తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఈ ప్రవర్తనను సైతం ప్రధానోపాధ్యాయుడు సమర్థించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహానికి గురయ్యారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన యువకులు హెచ్ఎంను నిలదీశారు. వారిపట్ల దురుసుగా ప్రవర్తించడంతో హెచ్ఎంకి దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ క్రమంలో స్టేషన్‌లో పనిచేస్తున్న హెూంగార్డు యువకులను అవమానించడంతో.. కోపంలో ఉన్న వారు.. హెూంగార్డుపై దాడి చేశారు. తమకు న్యాయం చేసే వరకు స్టేషన్ ముందు నుంచి కదలబోమని గ్రామస్తులతో కలిసి ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి శంకర్, కంగ్టి సీఐ రాజశేఖర్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ప్రధానోపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత అధికారి ప్రకటనతో గ్రామస్తులు శాంతించి అక్కడినుంచి వెళ్లిపోయారు. విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పీఈటీ సంగ్రామ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పెండింగ్ బిల్లులకు చెల్లింపుల్లేవ్..!

రూ. 8 వేల కోట్లపైమాటే

- సాగునీటిశాఖలోనే రూ.6300 కోట్లు
- భగీరథలో రూ. 1000 కోట్లు
- ఆర్అండ్‌బీ. పీఆర్‌లో రూ.1100 కోట్లు
- కాంట్రాక్టర్లలో అసహనం
- ధర్నాలకు దిగుతున్న వైనం
- సర్కారుపై తీవ్ర ఒత్తిడి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కొరత కొనసాగుతూనే ఉంది. ఒకవైపు ప్రతిష్టాత్మక పథకాలు, మరోవైపు కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగైదు నెలల్లో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో కాంట్రాక్టర్లు ధర్నాలకు దిగుతున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. ప్రధానంగా ఇంజినీరింగ్ శాఖల్లో ఈ వాతావారణం ఏర్పడింది. ఉన్నతాధికారులపై ఒత్తిడి తీవ్రమైంది. సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ, మిషన్ భగీరథ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల్లో భారీగా బకాయిలు పేరుకుపోయాయి. ఆర్థిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అవి సఫలీకృతం కావడం లేదు. కార్పొరేట్ సంస్థలు, ప్రయివేటు కంపెనీలు, చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఏండ్ల తరబడి బకాయిలు కొనసాగుతూనే ఉన్నాయి. అత్యధికంగా సాగునీటి శాఖలో ఉండటం గమనార్హం. కేసీఆర్ సర్కారు సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇచ్చి నిధులు ఖర్చుచేసిన సంగతి తెలిసిందే.మొత్తం సుమారు రూ. 8,400 కోట్లకుపైగా ఇంజినీరింగ్ శాఖల్లో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఆ బిల్లుల్లో దాదాపు 50 శాతం పెండింగ్‌లో ఉండటం సర్కార్ ప్రతిష్టకు భంగం కలుగుతున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిక్త హస్తాన్ని చూపు తున్న నేప థ్యంలో నిధుల సమీకరణ విష యంలో నిరం తరం అప్పులవైపు దృష్టిసారించక తప్పని దుస్థితి ఎప్పటినుంచో ఉంది.

ఆర్థిక శాఖ చుట్టూ..

ఆయా ఇంజినీరింగ్ శాఖల్లో బిల్లుల చెల్లింపు కోసం కాంట్రాక్టర్ల నుంచి తీవ్రంగా ఒత్తిడి పెరగడంతో ఉన్నతాధి కారుల్లో అసహనం పెరుగు తున్నది. ఒకానొక సంద ర్భంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ లకు, కాంట్రాక్టర్లకు కార్యాలయాల్లో వాదో పవాదాలు జరుగుతున్నాయి. దీంతో వారు సచివాల యంలోని ఆర్థికశాఖ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుం డటం తెలిసిందే.

ఇరిగేషన్‌లో భారీ బకాయిలు

సర్కారు సవాల్‌గా తీసుకుని చేపట్టిన ప్రాజెక్టుల్లో ప్రధాన మైనవి సాగునీటి పథకాలే కావడం గమనార్హం. ఇందులోనూ కాళేశ్వరం ప్రాజెక్టుకు అధికంగా వ్యయం చేయడమూ తెలిసిందే. కాళేశ్వరం రూ. 2800 వేల కోట్లు, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషణ్‌కు చెందినవి రూ.2,300 కోట్ల దాకా చెల్లింపులు చేయాల్సి ఉంది. ఆ తర్వాత సీతారామ ఎత్తిపోత పథకానికి రూ.500 కోట్లు, ఎల్లంపల్లి వాటా కింద రూ.400 కోట్లు, డిండివి రూ.300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే సర్కారు మార్జిన్ మనీ కింద చెల్లించాల్సిన నిధులే రూ. 2100 కోట్లకుపైగా ఉన్నా యని సమాచారం. ఇందులో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టులోనే రూ. 1600 కోట్ల వరకు ఉండగా, సీతారామ ప్రాజెక్టువి రూ.560 కోట్ల దాకా ఉన్నట్టు తెలిసింది. ఇవన్నీ రుణాలు తీసుకునే క్రమంలో ప్రభుత్వం మార్జిన్ మనీగా ఇస్తామన్న నిధులు సైతం ఉండటం గమనార్హం. ఇకపోతే భూసేకరణ పద్దు కింద ఆయా ప్రాజెక్టులకు కట్టాల్సినవి రూ.1100 కోట్లుగా ఉండగా, పునరావాసం, పునర్‌నిర్మాణం కింద రూ.151 కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది. ఇక పనులకు సంబంధించి బిల్లులు రూ.3800 కోట్లకుపైగా ఉన్నట్టు సమాచారం.

భగీరథ ఆఫీసు దగ్గర ధర్నా

మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయం వద్ద పెండింగ్ బిల్లుల కోసం ధర్నాలు సర్వసాధారణమయ్యాయి. గత సోమవారం భగీరథ కార్యాలయం ఎదుట ఇంట్రా విలేజ్ కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించాలంటూ ధర్నా చేశారు. సుమారు రూ.300 కోట్లు తమకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందంటూ నిరసన తెలిపారు. ఇందులో ఎక్కువగా చిన్న కాంట్రాక్టర్లే ఉండటం తెలిసిందే. సుమారు రూ. 1400 కోట్లు పెండింగ్ బిల్లులు ఆ శాఖలో ఉండగా, ఇటీవల రూ. 400 కోట్ల మేరకు ఆయా కాంట్రాక్టు సంస్థలకు బకాయిలు ఇచ్చేశారు. ఇంకా రూ.1000 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కాగా భగీరథ అప్పులు తీర్చేందుకు అసలు, వడ్డీ కలిపి ప్రభుత్వం రూ.4900 కోట్ల దాకా ఆయా బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్నది. అలాగే రూ. 700 కోట్ల మేర రోడ్లు, భవనాల శాఖలో బిల్లులు ఇవ్వాల్సి ఉన్నట్టు సమాచారం. ఇకపోతే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లో దాదాపు రూ.500 కోట్లకుగాను ఇటీవల రూ.100 కోట్లు ఇచ్చేసింది. ఇంకా రూ.400 కోట్లు మిగిలే ఉన్నాయి.

కొంగర కృష్ణవేణికి బెస్ట్ వర్కర్‌గా గుర్తింపు



నవతెలంగాణ- వనస్థలిపురం

జీహెచ్ఎంసీ పారిశుద్ధ కార్మికురాలు కొంగర కృష్ణవేణిని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి బెస్ట్ వర్కర్‌గా గుర్తించారు. సాహెబ్ నగర్ సీతారామాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం కృష్ణవేణిని కార్పొరేటర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టే సఫాయి అన్న, సఫాయి అమ్మలకు సన్మానం చేసి గౌరవించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ రామ్ చందర్, డివిజన్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, యువ నాయకులు శశి, ఎస్ఎఫ్ఏ గోవర్ధన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా ధనం వృథా'



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ నేతలు ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని జడ్పీటీసీ బింగి దాస్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసం ఏర్పడ్డ తెలంగాణలో కుటుంబ పాలన కొనసాగుతుందని, దీనికి త్వరలోనే ప్రజలు చరమగీతం పాడతారన్నారు. గ్రామాల్లో రూ.24లక్షల నిధులతో చేపట్టిన రైతు వేదికలు నిరుపయోగంగా ఉన్నాయని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌తో పేదల భూములను లాక్కోని రియల్ ఎస్టేట్ మాఫియా అప్పనంగా అప్పచెప్పుతుందని దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేరుతో రూ.కోట్ల అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన 1,200 మంది విద్యార్థుల కుటుంబానికి ఎలాంటి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏంటీ..ఎందుకు ఉత్సవాల పేరుతో ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

- హోం మంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణ సంతోష్ నగర్

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. మలక్ పేట్ నియోజకవర్గం డివిజన్ పరిధిలోని పలు వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు స్థానిక నాయకులు, అధికారులు హోం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారని కొనియాడారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర శతాబ్ద ఉత్సాహంలో భాగంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి.. వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్, డీసీ జయంత్, వీర్‌సింగ్ ఈఈ, ఏఈలు, జాతీయ వ్యవసాయ మార్కెట్ తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంగోత్ అనితా నాయక్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ విద్యుత్ శానిటరీ పారిశుద్ధ్య సిబ్బంది, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వార్డు కార్యాలయాలు పనిచేస్తాయని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని శుక్రవారం చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తలతో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ మంత్రి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన సత్వర సేవలందించాలనే ఉద్దేశంతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించే దిశగా చేపట్టిన వార్డుస్థాయి పాలనతో ప్రజలకు మరింత చేరువగా సేవలు అందుతాయని చెప్పారు. బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వార్డు స్థాయి పాలన సాగుతుందన్నారు. అధికారుల వికేంద్రీకరణలో భాగంగా పౌరుల వద్దకే పరిపాలనను తీసుకురావడం చాలా గొప్ప నిర్ణయమన్నారు. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, కార్పొరేటర్ రాధా వీరేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్ పంకజ, తహసీల్దార్ జయశ్రీ, డీసీ కృష్ణయ్య, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్, నియోజకవర్గం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, లింగ స్వామి గౌడ్, వెంకటేష్ గౌడ్, సాజిద్, దుబ్బాక శేఖర్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జగన్, శ్రీరాములు , దేవేందర్, స్వప్న రెడ్డి, అన్నపూర్ణ, బుజ్జి భాయ్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి తోడ్పడాలి

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



నవతెలంగాణ-వనస్థలిపురం

ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. వనస్థలి పురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో శుక్రవారం జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు అధికారులు జవాబుదారీగా పని చేయాలని అన్నారు. సమస్యలతో వచ్చే పేదలకు ముందు అవకాశమిచ్చి వారి సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామిరెడ్డి, ఏఈ ప్రజ్ఞా, రాజు గౌడ్, గంగుల కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, వీరస్వామి, నూతి శ్రీనివాస్, వార్డు కార్యాలయం అధికారి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రామ్ వాటర్ డ్రైవ్ పైప్‌లైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని జక్కిడి రామస్వామి నగర్ నుంచి నిర్మించనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్‌లైన్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటిని శుక్రవారం ఆ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షపు నీరు సులువుగా పోయేందుకు ఈ పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్‌ను వార్డు కార్యాలయంగా మార్చాం

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - హాయత్ నగర్

2019లో ప్రారంభించిన మోడల్ మార్కెట్‌కు ఎవరూ రాకపోవడంతో దీనిని వార్డు కార్యాలయంగా మార్చామని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రజల వద్దకు పాలన అనే ఉద్దేశ్యంతో మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీలోని మోడల్ మార్కెట్ ను వార్డు కార్యాలయంగా మార్చి దానిని శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలు అని తెలిపారు. ఈ వార్డు ఆఫీసులో దాదాపు 11 విభాగాలకు సంబంధించిన అధికారులు ఉంటారని తెలిపారు. ప్రతి చిన్న సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఆఫీసుకు పోయి సమస్యలు చెప్పడానికి అందరికీ వీలు కాదు.. అందుకే ఈ వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో ప్రతి డిపార్ట్ మెంట్ కు సంబంధించిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే మోడల్ మార్కెట్ కోసం జీహెచ్ఎంసీకి చెల్లించిన నగదు తిరిగి ఇస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, ఎల్బీనగర్ సర్కిల్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్లు బలరాం రాజు, వినోద్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, డివిజన్ల అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, రాజిరెడ్డి, సీనియర్ నాయకులు మహిళా అధ్యక్షురాలు కోసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, చీర శ్రీనివాస్, జక్కిడి రఘువీర్ రెడ్డి, పలు డివిజన్ల సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే వార్డు కార్యాలయాలు

- ఎమ్మెల్సీ యెగ్గే మల్లేష్



నవతెలంగాణ -నాగోల్

పట్టణ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న వార్డు కార్యాలయాలు ఆయా డివిజన్లలో నెలకొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ యెగ్గే మల్లేష్ అన్నారు. నాగోలు డివిజన్లో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని శుక్రవారం కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యాలయం ఇంచార్జి సుధాకర్, జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ సుస్మిత, జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఐఎస్ సదన్ డివిజన్ సుబ్రహ్మణ్యం కాలనీలో శుక్రవారం వార్డు ఆఫీస్‌ను కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా స్పోకెన్ వీరేందర్ యాదవ్, ఏఎంసీ మొహమ్మద్ వాసిఫుద్దీన్, వాటర్ డిపార్ట్మెంట్ ఏఈ, మినాజ్, టౌన్ ప్లానింగ్ దేవే ందర్, సీవో యాదయ్య, విద్యుత్ డిపార్ట్మెంట్ హరిచంద్ర, జవాన్ కృష్ణ, హార్టికల్చర్ సుష్మ, ఎటమాలజీ నరేందర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతితో ప్రజలకు ఎంతో మేలు

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

పట్టణ ప్రగతి కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. తర్వాత మున్సిపల్ మైదానంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్, మున్సిపల్, మెప్మా సిబ్బందికి ఉత్తమ ప్రశంసా పత్రాలను అందజేశారు. తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు.

జల్‌పల్లిలో..

జల్‌పల్లి పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రగతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయ నందు మానవహారం, జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చైర్మన్ అబ్దుల్లా సాది, మున్సిపల్ కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కౌన్సిలర్లు, కో -ఆప్షన్ మెంబర్స్, శానిస్టేషన్, ఆఫీసు సిబ్బంది, మెప్మా సిబ్బందిని ఘనంగా సన్మానించి, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చల్లా నర్సింహారెడ్డికి పితృ వియోగం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి తండ్రి పాపిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి జిల్లేలగూడలో తన నివాసంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి అక్కడికి చేరుకొని మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై విస్తృత ప్రచారం



నవతెలంగాణ - ఎల్బీనగర్

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణలో జులై 2న నిర్వహించబోయే రాజీవ్ గాంధీ ఆన్ లైన్ క్విజ్ పోటీలపై ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్ రెడ్డి, నాగోల్ డివిజన్ అధ్యక్షులు మంజుల రెడ్డి, చంపాపెట్ డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డిలతో పాటు ఆయన ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలేజీలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి విద్యార్థులకు క్విజ్ ప్రోగ్రాం గురించి వివరించి ఎన్ రోల్ మెంట్ చేయించారు. తెలంగాణ యువత మేధోశక్తిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పే విధంగా క్విజ్ పోటీ ఉంటుందని తెలిపారు. ఈ పోటీలో 16 నుంచి 35 ఏండ్ల వయసు గల వారు పాల్గొనవచ్చని అన్నారు. జులై 1 లోపు యువత రిజిస్ట్రేషన్ వెబ్ లింకుతో కూడిన ఎస్ఎంఎస్ ను పొందడానికి 7661899899 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. రెఫరల్ కోడ్ గా 27100 ని ఉపయోగించాలని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి లాప్టాప్, స్మార్ట్ ఫోన్, టాబ్లెట్‌లు మూడు మొదటి బహుమతులుగా అందజేస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఇంకా మరెన్నో ప్రోత్సహక బహుమతులను అందజేస్తున్నట్లు చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి కోసం 8142903456, 8142803456 నెంబర్లకు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రణధీర్ రెడ్డి, సూర్య ప్రసాద్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్



నవతెలంగాణ- ఉప్పల్

ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా చిల్కానగర్ డివిజన్ సుపరిపాలన విభాగం వార్డు కార్యాలయాన్ని శుక్రవారం జీహెచ్ఎంసీ ఈఈ నాగేందర్, ప్రాజెక్టు ఆఫీసర్ రమాదేవి లతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదరాబాదులో 150 డివిజన్‌లో వార్డు పరిపాలన కార్యాలయాలను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్, బజాజ్ జగన్, ఏదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, గూడూరు రమేష్, పండ్ల కిషన్ గౌడ్, యాదగిరి, రామానుజం, అశోక్ చారి, నారాయణ రెడ్డి, ముద్ధం శ్రీనివాస్, బింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీర్‌పేట్ సుందరీకరణలో కార్మికుల సేవలు అమోఘం

- మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సుందరీకరణలో మున్సిపల్ కార్మికుల సేవలు అమోఘం అని మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణ ప్రగతి కార్యక్రమం సందర్భంగా శుక్రవారం కార్పొరేషన్‌లో కార్పొరేటర్లు,



అధికారులు మున్సిపల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్.. విధి నిర్వహణలో కార్పొరేషన్ అభివృద్ధి కోసం కృషిచేసిన ఉత్తమ సిబ్బందిని ఎంపిక చేసి సన్మానించి, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్ రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, మేనేజర్ వెంకట్ రెడ్డి, ఎస్ఈ, డీఈ, ఆర్ఐ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి



- మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-ఘట్కేసర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మళ్లీ బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గురుకుల్ మైదానంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని నారాయణ గార్డెన్‌లో ఉత్తమ కౌన్సిలర్లకు ఘన సన్మానం చేసి, వారికి ప్రశంస పత్రాలను అందజేసి మంత్రి మాట్లాడారు. సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లీ పావని జంగయ్య యాదవ్, కమిషనర్ వేమన రెడ్డి, ఘట్కేసర్ సీఐ మహేంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు కుమ్మగొని రమాదేవి, మహిపాల్ గౌడ్, బొక్క సంగీత రెడ్డి, బండారు ఆంజనేయులు గౌడ్, కొమ్మిడి అనురాధ, సఖ్నారి నాగజ్యోతినర్సింగ్ రావు, చిలుగురి హేమలత గోపాల్ రెడ్డి, బర్ల శశికళ దేవేందర్ ముదిరాజ్, కడుపోల్లా మల్లేష్, మేకల పద్మారావు, జహంగీర్, బత్తుల నరేష్ కుతాది రవీందర్, మేనేజర్ అంజి రెడ్డి, మున్సిపల్ బిల్ కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఆర్పీలు, గురుకుల వకార్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, యువ నాయకులు, అధికారులు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్ నగర్

సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ.. దేశానికే రోల్ మోడల్‌గా మారిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు పాలన అనే ఉద్దేశంతో చంపాపేట డివిజన్ పరిధిలోని గాంధీ బొమ్మ సమీపంలో నెలకొల్పిన వార్డు కార్యాలయ ప్రారంభోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వార్డు ఆఫీసు నందు దాదాపు 11 విభాగాలకు సంబంధించిన అధికారులు ఉంటారని వివరించారు. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టిందన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై ప్రజలను చైతన్యవరుస్తున్నట్లు వివరించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. వార్డుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి తాగునీరు, తదితర సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు పరిపాలన అధికారి ఇంచార్జి టి. శ్రీనివాస్, సురేష్, సరిత, మధుసూదన్ రెడ్డి, పెంటయ్య, నరసింహ, నర్సింగ్ రావు, బోడ ఆనంద్, షేక్ నయీమ్, రమేష్ రెడ్డి, రజిత, మేనేజర్ రమ్య, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్లు సురేందర్ రెడ్డి, మారుతీ దివాకర్, ఎల్బీనగర్ సర్కిల్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్లు బలరాం రాజు, వినోద్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బంధును వెంటనే అమలు చేయాలి

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్



నవతెలంగాణ-హయత్ నగర్

గిరిజనులకు వెంటనే గిరిజన బంధును అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ కోరారు. తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. రఘులు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు 'దళిత బంధు' ఇస్తున్నట్లుగా గిరిజనులకు కూడా 'గిరిజన బంధు' ఇస్తానని గత ఫిబ్రవరి 15న బంజారా భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఎటువంటి కార్యాచరణ ప్రారంభించలేదని మండిపడ్డారు. గిరిజనులకు రూ.10 లక్షలు గిరిజన బంధు ఇస్తానని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో వెనుకబాటుకు గురవుతున్న గిరిజనులకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు తక్షణమే 'గిరిజన బంధు' పథకాన్ని ఈ నెల 17న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగే గిరిజన ఉత్సవంలో అమలు పరుస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను నిలదీస్తూ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఆర్. శేఖర్ నాయక్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రామావత్ పాండునాయక్, గోపి నాయక్, బాలు నాయక్, గాంధీ నాయక్, శేఖర్, బుద్ధా సత్యనారాయణ, రమేష్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఎవరెస్ట్' విజయోత్సవ వేడుకలు



నవతెలంగాణ- చైతన్యపురి

దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎస్-ఎస్‌సీ శిక్షణా కేంద్రం ఎవరెస్ట్ కోచింగ్ పాయింట్ విజయోత్సవ వేడుకలను కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ ఆడిటోరియంలో శుక్రవారం ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ లు ఎస్ఎస్‌సీ - సిజీఎల్ 2020 -21 -22 సంవత్సరాలలో పలు డిపార్మెంట్‌లలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్, ప్రివెంటివ్ ఆఫీసర్, ఎగ్జామినర్, ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లాంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన దాదాపు 260 మంది అభ్యర్థులను ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. తమ సంస్థ సింగిల్ బ్రాంచ్ నుండి ఎస్ఎస్‌సీ సిజీఎల్ 2022 లో 176 మంది ఉద్యోగం సాధించి చరిత్రను సృష్టించారని తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ పరీక్షల్లో సదరన్ రీజియన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి) నుంచి ఉద్యోగం సాధి ంచే మొత్తం అభ్యర్థులలో తమ విద్యార్థులు 10 శాతం పైగా ఉన్నట్టు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి, జైన్, కడియాల ప్రభాకర్ రావు, కృష్ణమోహన్, వాసు, ఫ్యాకల్టీ సభ్యులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ కార్పొరేటర్ జన్మదిన వేడుకలు





నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా ఆమె అభిమాని చంద్రకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు గౌడ్, రాంబాబు, కాశీనాథ్, వెంకటేష్, నాగు, యాది ముదిరాజ్, అశోక్ సింగ్, శీను, హరి, అంజయ్య, కృష్ణ, పద్మనాయి, శంకర్ నాయక్, సరస్వతి, మూర్తి, రాజు పాల్గొన్నారు.

వనస్థలిపురం/సంతోష్ నగర్ :

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ పుట్టిన రోజు వేడుకలను వారి నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బీఆర్ఎస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, హస్తినాపురం కార్పొరేటర్ భానోత్ సుజాతా నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బింగి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం చేసి.. వారికి ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కత్తుల రాంబాబు, కొప్పుల వెంకట్ రెడ్డి, చంద్రకాంత్ గౌడ్, టింకు, నాగరాజు, అశోక్ సింగ్, యాది ముదిరాజ్, బింగి రాంబాబు కాశీనాథ్, అలెక్స్, సరస్వతి, శేఖర్, ప్రశాంత్, స్వామి, హరి ప్రసాద్, సుధీర్, శాంతి రెడ్డి, విజయ రంగ, రాజేందర్ రెడ్డి, ఉమాకాంత్, సరేష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు సేఫ్టీ లాకర్స్ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవరెడ్డి అధ్వర్యంలో శుక్రవారం సినియర్ న్యాయవాది శ్రీ ఆకుల మహేష్ కుమార్ రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్‌కు న్యాయవాదులు ఉపయోగించే "సేఫ్టీ లాకర్స్"ను అందజేశారు. ఈ సందర్భంగా పట్లోళ్ల మాధవరెడ్డి మాట్లాడుతూ.. సేఫ్టీ లేకర్స్‌ను ఆకుల మహేష్‌కుమార్ అందజేయడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్స్ అనంతసేనారెడ్డి, జి.రామారావు, బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సి.రామచందర్, కోశాధికారి ఎం.రామకృష్ణ, గ్రంథాలయం కార్యదర్శి వై.రామకృష్ణ, క్రీడా కార్యదర్శి పి.సందీప్ గౌడ్, మహిళా ప్రతినిధి డి.జ్యోతి, కార్యవర్గ సభ్యులు ,న్యాయవాదలు పాల్గొన్నారు

రూ.20వేల ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కాప్రా

ఉద్యమ నాయకురాలు, మాజీ వార్డు మెంబర్ లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి సహకారం మేరకు మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ ద్వారా వారి స్వగ్రామం వాసలమర్రికి వెళ్లి చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కంటెస్టెడ్ కార్పొరేటర్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్, షేర్ మానెమ్మ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం ఆయన మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులు, డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, డీఈ మహేష్, ఏఈ మధురిమా, జలమండలి జీఎం సునీల్‌కుమార్, అమినుద్దిన్, పిట్ల శ్రీనివాస్, సతిష్ కుమార్, గుండా నిరంజన్, భాగ్యనంద్ రావు, ఆదినారాయణ, సంతోష్ నాయుడు, పిట్ల నాగరాజు, బుద్ధి నర్సింగ్ రావు, నవాబ్, సంతోష్ గుప్త, సుఖ్ దేవ్, రామకృష్ణపాల్గొన్నారు.

కంటోన్మెంట్‌పై రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ



నవతెలంగాణ-కంటోన్మెంట్

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ప్రాంతంలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయడంలో మర్రి రాజశేఖర్ రెడ్డి దూసుకు పోతున్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ నియోజక వర్గంలో నాయ కులను ఏకతాటిపై తీసుకొచ్చి పార్టీని బలోపేతం చేస్తున్నారు. అహర్నిశలు పని చేస్తూ రానున్న రోజుల్లో కంటోన్మెంట్‌తో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మళ్ళీ బీఆర్ఎస్ జెండా రెపరెపలాడేందుగాను చేస్తున్న కృషిని అందరూ అభినందించక తప్పడం లేదు. విద్యాసంస్థల అధినేతగా ఉన్న రాజశేఖర్ రెడ్డి 2019లో రాజకీయాల్లోకి వచ్చి బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి పాల య్యారు. అయినప్పటికీ ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పిలుపుల మేరకు మల్కాజిగిరి పార్లమె ంట్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు తన వంతు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అకాల మృతితో కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్నీ తానే కార్యకర్తలకు ధైర్యం చెబుతూ వస్తున్నారు. అదనంగా కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని కూడా చేయడంతో రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి, పార్టీని బలోపేతం చేసేందుకు పని చేస్తున్నారు. ప్రతిరోజూ కార్యకర్తల్లో ఏదో ఒక విషయంపై సమావేశం నిర్వహించి బస్తీల్లో తిరుగు తూ ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తూ సమస్యల పరిష్కా రం కోసం వెనివెంటనే సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అధికారులకు ముచ్చమటలు పట్టించి పనులు చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తుంది. కార్యకర్తల్లో కూడా జోష్ నింపుతున్నారు. ఎక్కడ సమస్య కనిపిస్తే అక్కడ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తున్నారు

అరుంధతి సేవలు అద్భుతం



మర్రి రాజశేఖర్ రెడ్డి తాను నెలకొల్పిన అరుంధతి హాస్పిటల్ నెలకొల్పి అన్ని రకాల వైద్య సదుపాయాలను ఉచితంగా అందిస్తున్నారు. హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్య బృందం నేతృత్వంలో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు దాదాపు 2వేల ఒక వంద పైచిలుకు శస్త్ర చికిత్సలను మంత్రి కేటీఆర్ "గిఫ్ట్ ఎ స్మైల్" నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉచితంగా అందించారు. మర్రి రాజశేఖర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఉచిత ఈసీజీ 2 ఎకో, క్యాత్ ల్యాబ్ పరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎక్స్ రే, ఎండోస్కోపీ, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వైద్య సహాయం అందిస్తున్నారు. దృష్టి లోపాలను గుర్తించి ఉచిత శస్త్ర చికిత్స, కండ్ల అద్దాలు ఉచితంగా అందిస్తున్నారు. గైనకాలజీ విభాగంలో మాత శిశు సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జనరల్ మెడిసిన్ విభాగంలో వెంటిలేటర్ తో కూడిన ఎంఐసీయూ సదుపాయం కలిగి ఉంది, ప్రత్యేక న్యూరాలజీ విభాంగం, డయాబెటలజీ, పల్మనాలజీ, డెర్మటాలజీలో భాగంగా కాస్మటాలజీ, హైర్ఫాల్ ట్రీట్మెంట్‌తో ఇస్తున్నాష్తురు. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, ఎన్ఐసీయూ, పీఐసీయూ సేవలు, డెంటల్ విభాగంలో రూట్ కెనాల్ ట్రీట్మెంట్, టూత్ ఎక్స్ట్రాక్షన్ చికిత్సలు, జనరల్ సర్జరీ అండ్ ల్యాప్రో స్కోప్ విభాగం నెలకొల్పారు. అర్థోపెడిక్స్ అండ్ ఆర్త్రోస్కోపీ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి జాయింట్ రీప్లేస్మెంట్, ట్రామా కేర్ తదితర అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నారు. యూరాలజీ విభాగం, నెఫ్రాలజీ అండ్ డయాలసిస్ , స్పీచ్ థెరపీ, ఆడియోమెట్రీ, రేడియాలజీ విభాగం మ్యామో, అల్ట్రా సౌండ్, ప్యాతాలజీ, బ్లడ్ బ్యాంక్, మైక్రోబయాలజీ, వైరాలజీ విభాగం, సైకియాట్రీ విభాగం, ఉచిత అంబులెన్స్ సేవలు, 24/7 ఎమర్జెన్సీ వైద్య సేవలు, అనేస్తీస్యాలజీ , కార్డియో తోరాసిక్ సర్జన్, కార్డియాలజీ విభాగంలో ఈ సీజీ, ట్రెడ్మిల్ చికిత్సలు అందిస్తున్నారు.

యువత రాజకీయాల్లోనూ ముందుండాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

యువత సామాజిక సేవ చేయడంతోపాటు రాజకీయాల్లోనూ ముందుండాలని టీఎస్ఎండీసీ చైర్మన్ మన్నె క్రిశాంక్ యువతను కోరారు. ఐదో వార్డు లక్కీ కేఫ్‌లో యువత కోసం 7వ "కేఫ్ పాలిటిక్స్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో యువత పాత్ర ప్రాధాన్యతపై అంశంపై చర్చించారు. భారీ సంఖ్యలో యువత పాల్గొని పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాలు, సామాజిక సేవల్లోనూ ముందంజలో ఉండాలని కోరారు. నేటి రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో ప్రాధానమైనదని పేర్కొన్నారు. యువతకు ఉన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రిశాంక్ కేఫ్ పాలిటిక్స్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని ప్రారంభించారు.. కంటోన్మెంట్ యువకుల్లో మార్పు తేవటం కోసమేనని ఆయన ఈ సందర్భంగా యువతకు చెప్పారు. ఈ కేఫ్ పాటిక్స్ కార్యక్రమంలో యువత వారి సమస్యలు నుంచి పార్టీ రాజకీయాలు గురించి చర్చించుకోవడం ఈ కార్యక్రమం అన్నారు. యువకులు వారి ఆలోచనలను వ్యక్తపరచడానికి వేదికగా మారుతున్నట్టు తాను భావిస్తున్నాను అని తెలిపారు. కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమంలో యువత స్థానిక సమస్యలు, రాజకీయాలు గురించి చర్చించేందుకు ముందుకు వస్తున్నారనీ, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాల్లో యువత పాత్ర ప్రాముఖ్యతపై అందరికీ అవగాహన కలుగుతుంది" అని క్రిశాంక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్, వీరూ, బంటీ, సోనా, వినీత్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం పరిశీలన



నవతెలంగాణ-నాచారం

నాచారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి పరిశీలించారు. నాచారం గ్రామానికి చెందిన 150 గజాల స్థలంలో ఆనాడు మరుగుదొడ్లు ఉండేవనీ, 2005లో కాప్రా మున్సిపల్ చైర్మన్ జి.రామచంద్ర గౌడ్ సదరు స్థలాన్ని మహిళా మండలి అంగన్వాడీ కేంద్రానికి కేటాయించి బేస్మెంట్ వేసి పిల్లర్లు నిర్మాణం చేశారు. స్థలం పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఆ స్థలం మాది అంటూ 30 ఏండ్ల క్రితం కోర్టుకు వెళ్లి స్టే తీసుకున్నట్టు సమాచారం. ఆనాటి నుంచి ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు జరుగలేదు. పూర్వాపరాలను పరిశీలించి ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఆదేశాలనుసారం నాచారం సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే కింద సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం పైన మహిళా అవసరాల కోసం వినియోగించుకునే విధంగా ఉపయోగపడుతుందని అధికారులు, ఎమ్మెల్యే, కార్పోరేటర్‌ను కోరారు. సీనియర్ సిటిజన్ ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, కార్పొరేటర్ స్థలాన్ని పరిశీలించి పూర్తి సమాచారాన్ని సేకరించి సీనియర్ సిటిజన్ భవనం నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీధర్ ప్రసాద్, డిప్యూటీ ఇంజినీర్ రూప, ఏఈ లింగారావు, సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు ప్రేమ్ కుమార్, సాయిబాబా, శ్రీశైలం, జగన్నాథం, నాగేశ్వరరావు, రామకృష్ణ, యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, ముత్యంరెడ్డి, కట్ట బుచ్చి గౌడ్, విఠల్ యాదవ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం అవకాశమిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా



నవతెలంగాణ-నాచారం

స్వరాష్ట్ర సాధన కోసం సర్వం త్యాగం చేసి సాధించుకున్న రాష్ట్రంలో ఎమ్మెల్యేగా అడిగే హక్కు అవకాశం కల్పించే బాధ్యత అధిష్టానంపై ఉందని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నందికొండ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాచారం హెచ్ఎంటీ నగర్‌లోని తన నివాసంలో తన జన్మదినాన్ని అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి అలయ ప్రధాన అర్చకులు నల్లంతిగల్ లక్ష్మి నరసింహ చార్యులు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మీర్‌పేట మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, తెలంగాణ ఉద్యమకారులు నల్ల రాధాకృష్ణ, కనుకుంట్ల విజయ్‌కుమార్, ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. చిన్ననాటి మిత్ర బృందంతో కలిసి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి ఆశీస్సులు స్వీకరించారు. సామాజిక సేవ కార్యక్రమాలు, రాజకీయ రంగంలో అలుపెరగని సేవకుడిగా 30 ఏండ్లుగా ఎనలేని కృషి చేసినట్టు నందికొండ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అన్ని అర్హతలు గల వ్యక్తిగా ఉప్పల్ నియోజకవర్గం నుంచి భవిష్యత్తులో పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే పోటీ చేసే అవకాశం కల్పిస్తే గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

సన్ సీడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని బోగారం సర్పంచ్ సుంకరి కవిత అన్నారు. శుక్రవారం కీసర మండలం బోగారం గ్రామంలో సన్ సీడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుంకరి కవిత మాట్లాడుతూ ఈ హాస్పిటల్ పేద ప్రజల కోసం 30 శాతం డిస్కౌంట్ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స కోసం పేద ప్రజలు ఖర్చు పెట్టలేని స్థితిలో పేద ప్రజలకు సన్ సీడ్ హాస్పిటల్ అండగా ఉంటుందనీ, సేవలు ఎంతో ప్రాముఖ్యత కలిగిన విషయమన్నారు. వారి సేవలను బోగారం ప్రజలు తప్పనిసరిగా ఉపయోగించు కుంటామని తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో 350 మంది వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామిశెట్టి జానకిరామ్, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకటరెడ్డి, హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ భాను, మెడికల్ సుప్రీండెంట్, హాస్పిటల్ సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సజ్జలకు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. నేరేడ్ మెట్ కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తడక జగదీశ్వర్ గుప్తా సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డికి ఫోటోను బహుకరించారు.

PUBLIC NOTICE

The general public hereby informed that **D.SRAVANTHI W/O. D.BHASKAR** aged about 28 years, Occ: House Wife, Resident of Plot No.89, Bakshiguda, Kailasagiri Road, H.B.Colony, Moula-ali, Hyderabad., has approached the Shriram Finance Ltd., Kukatpally Branch, Hyderabad., by put her documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within **seven days**. failing which the loan amount shall be sanctioned to D.SRAVANTHI W/O. D.BHASKAR, and no claim or no objection of any kind thereafter will be entertained.

SCHEDULE OF THE PROPERTY

All that the Residential House No.5-80, admeasuring 120 Sq.Yds., with a Plinth area of 400 SR., ACC., Situated at Ahmedguda Village, under Dammaiguda Municipality, Keesara Mandal, Medchal-Malkajgiri District., and bounded by:
NORTH : Open Plot. **SOUTH** : Neighbours House. **EAST** : 20' Wide Road. **WEST** : Open Plot.

R. VENKATESHWAR RAO
Advocate, & Panel Advocate of SHRIRAM FINANCE LTD.
5-3-29, Near Ramalayam Temple, Kukatpaly, Hyderabad - 72.
Cell.: 9391093566, 8519985749
Email : Venkateshwarraoadv@gmail.com

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVILJUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD.
O.S. No. 1732 of 2023

Between :
Sri Bhashyam Yashasvi
& Others ..... Plaintiffs
A N D
The Mandal Revenue Officer, Saidabad, Hyderabad & others ...... Defendants

To
All Concerned

Please take notice that the above named plaintiffs have filedtheabove suit for declaration to declare the plaintiffs as Legal Heirs of **Late. Nrusimhadri Ravindranath Tagore** who died on **14.03.2021** seeking issuanceoflegal heir certificate in their favour being the sole legal heirs. If any person (s) have any interest in the above matter andhavingany kind of objections may filed their objections before the abovecourton **28.06.2023 at 10.30 AM** in person or through an advocate, if noobjection is received by the court the matter will be decided as exparte.

// BY ORDER OF THE COURT //
G. SHIVA KUMAR SINGH
Advocate
Office # 11-6-650/651, Opp. Criminal Court, Nampally, Hyderabad

---

IN THE COURT OF THE I ADDL DIST JUDGE BHONGIRI DIST AT :BHONGIRI
I.A.NO. 93 OF 2022
376
O.S No.18 of 2017

BETWEEN-
D MAHIPAL AND ANOTHER ....Petitioners/Plaintiffs
AND
S.VENU GOPAL AND OTHERS ....Defendants/PROPOSED DEFENDENTS

TO
4 SUDAGANI SWAPNA W/o S.Srikanth Aged;42 yars, Occ: House wife, R/o Plot No. 41 S.V.Nagar Nagaram Village, Keesara Mandal MEDCHAL DIST.

Please take notice that the above petitioners have filed the above petition for impleadment of you in a suit for specific performance filed by them in O.S. No.18 of 2017 pending on the of the Hon'ble court of I Addl.Dist Judge, Bhongir Dist at Bhongir The said I.A. is posted to 4-7-2023 for your appearance. Hence You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at10.30 A.M., on the above said date before the above sald Hon'ble court, failing which the above said petition shall be heard and determined exparte.

(BY ORDER OF THE 1 Addl.Dist Judge, Bhongir Dist, at;Bhongir)
M/S S.V.RAMANA RAO
ADVOCATE
VIDYANAGAR, HYDERABAD.
COUNSEL FOR PETITIONERS

IN THE COURT OF THE HON'BLE VII SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No. 193 OF 2023

Between:
1.Smt. Gundrala Shobarani,
W/o late Devendar Goud,
Aged about 50 years, Occ: Employee,
2. Gundrala Abhinav,
S/o late Devendar Goud,
Aged about 21 years, Occ: Student,
3. Gundrala Pranav Krishna,
S/o late Gundrala Devendar Goud,
Aged about 19 years, Occ: Student,
All are R/o LADY FERN LOOP NW OLYMPIA, WA 98502, USA.
Rep by his GPA holder Bandi Ravi. .....Plaintiffs
And
1. The Commissioner,
Greater Hyderabad Municipal Corporation, Tankbund, Hyderabad
2. The Tahsildar,
Himayathnagar, Hyderabad District.
3. The Tahsildar, Kondapak Mandal, Siddipet District
4. All Concerned. ......Defendants

Take notice that the above suit is filed for declaration to declare the plaintiffs as legal heirs of late Gundrala Devendar Goud. The above case is posted to **dt.27-6-2023 at 10-30 am** and if any person or persons having any objection may appear in person or through an advocate failing which the case will be heard and decided exparte.

(By order of the Court)
Sd/-
M/s G.B.S.S.Papa Rao & Mrs. J.Hymavalli
Advocates
Flat No.202, Sree Chalapathi Heights, Indrapastha Colony, Bagh Amberpet, Hyderabad-13. Cell:9391320436
Email:paparaolawyer@yahoo.co.in

IN THE COURT OF THE HON'BLE IST ADDL JUNIOR CIVIL JUDGE CUM XII ADDL METROPOLITIN MAGISTRATE : AT : RAJENDERNAGAR
O.S. NO. 122 OF 2023

Between:
1) Smt Vangala Naga Triveni W/o Late Vangala Surender Kumar, Age: 63 yrs, Occ: House maker,
2) Vangala Sasidhar S/o Late Vangala Surender Kumar, Age: 36 yrs, Occ: Private employee,
3) Vangala Radha Krishna S/o Late Vangala Surender Kumar, Age: 32 yrs, Occ: Private employee,
All R/o Hno: 5-848/2, road no:11,besides diamond heights Apartments, Secretariat colony, puppalaguda, Manikonda, K.V. Ranga Reddy, Telangana-500089. .....PLAINTIFFS
And
1) MRO, GANDIPET Mandal
2) All concerned .....Defendants

To,
All Concerned

Please take notice that the above suit filed by the plaintiffs against all concern and Gandipet Mandal to declare the status of the plaintiffs as legal heirs of deceased LATE Vangala Surender Kumar, before the above said court, as per the court order the plaintiffs issued the notices to all concern through publication in NAVA TELANGANA daily news paper to concern person/ persons for your appearance on **30-06-2023 at 10-30 A.M.** before the above said court. Please make it convenient and attend on said date either in person or through an advocate; otherwise, the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
C.RAMA KUMARI,
ADVOCATE,
HYDERABAD

IN THE COURT OF THE HONORABLE CHIEF JUDGE : CITY CIVIL COURT AT : HYDERABAD
E.P. No. 667 OF 2022

BETWEEN :
CANARA BANK, ARM BRANCH, SECUNDERABAD .....DECREE HOLDER
AND
M/s ASK RE LIMITED and others .....JUDGEMENT DEBTORS

02. ATTALURI SUREKHA, Flat No.1503, Block-A, Fortune Tower, Madha Pur. HYDERABAD-500 081 and also Plot No.1335. Road No 45, Jubilee Hills, HYDERABAD

03 ATTALURI VENKATESWARA PRASAD. Flat No.1503. Block-A, Fortune Tower, Madha Pur, HYDERABAD-500 081 and also Flat No.B2, Narayana Enclave, H No.1-1-535, Gandhi Nagar. Hyderabad and also Plot No.1335, Road No.45, Jubilee Hills, HYDERABAD.

The Decree Holder above named filed the above execution application for recovery of USD 4105406.49 (Rs.31,87,23,272.45ps) and the matter now posted to 18.07.2023 for your appearance. If you fail to appear before the Honorable Court on **18.07.2023 at 10.30 A.M.** either in person or through Counsel the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
M/s.DISHIT BHATTACHARJEE
B.SATISH
ADVOCATES
FLAT No.101 & 102, 1st Floor, NIRMAN TOWER EAST MARREDPALLY, SECUNDERABAD - 500 026.
Tel : +91-40-27732657,
Fax : +91-40-27730174,
Mobile : 99499 36611,
E-mail : dishit.bhattacharjee@gmail.com

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST-CLASS SPECIAL(MOBILE) PCR ACT, RANGA REDDY-CUM-IV ADDL METRO-POLITIAN MAGISTRATE-CUM-IV-ADDL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR
I.A. No. 225 of 2021
In
O.S.No.1152 of 2021

Between:
M.Sambasiva ...Petitioner/Plaintiff
AND
Navaru Narsimha Reddy ...Respondent/Defendants

To,
Gopal, S/o Islavath Chandru,
Aged 33 years, Occ: Business, R/o H.No.5-22, Vinaka Hills, Almasguda Village, Balapur Mandal, Ranga Reddy District, Aadhar No.2986-6527-7905,
PAN: ACSP18114K, Phone: 9398186892. ...Respondent/Defendant No.3

Please take notice that whereas the Plaintiff has filed the above Suit bearing O.S. No.1156 of 2021 for "Perpetual Injunction and consequential relief of declaration of documents as null and void and not binding on the plaintiff" in respect of suit/petitioner scheduled property against you i.e., the Defendant No.1 to 4. Further in the said suit the petitioner had filed the petitions I.A.No.225 and 2021 for injunctions. The said petitions are posted to 27-06-2023 for your appearance before the Hon'ble Court. Please take the notice and appear on **27-06-2023 at 10:30AM.** In case of default to appear in person or through counsel, the above petitions are will be decided on merits in your absence.

SUIT SCHEDULE OF PROPERTY

All that the Plot of land admeasuring 300 Sq.yds or 250.83 Sq.mts bearing Plot No.889 forming part of Sy.Nos.94 to 97 & 103, situated at Almasguda Village, Balapur Mandal, Ranga Reddy District, Telangana and the same is bounded as under:-
NORTH : 20' wide Road
SOUTH : Plot No.908
EAST : Plot No.890
WEST : Plot No.888

(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/-
K.R.K Chary
(Advocates)
Flat No.102, First Floor, Vamshiram's Jyothi Habitat, Road No.11, T-Grill Lane, Kakateeya Hills, Madhapur, Hyderabad-81 Cell : 9848021357

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST-CLASS SPECIAL(MOBILE) PCR ACT, RANGA REDDY-CUM-IV ADDL METRO-POLITIAN MAGISTRATE-CUM-IV-ADDL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR
O.S.No.1152 of 2021

Between:
M.Sambasiva ...Plaintiff
AND
Navaru Narsimha Reddy ... Defendants

To,
Gopal, S/o Islavath Chandru,
Aged 33 years, Occ: Business, R/o H.No.5-22, Vinaka Hills, Almasguda Village, Balapur Mandal, Ranga Reddy District, Aadhar No.2986-6527-7905,
PAN: ACSP18114K, Phone: 9398186892. ...Respondent/Defendant No.3

Please take notice that whereas the Plaintiff has filed the above Suit bearing O.S. No.1156 of 2021 for "Perpetual Injunction and consequential relief of declaration of documents as null and void and not binding on the plaintiff" in respect of suit/petitioner scheduled property against you i.e., the Defendant No.1 to 4.The said petitions are posted to 27-06-2023 for your appearance before the Hon'ble Court. Please take the notice and appear on **27-06-2023 at 10:30AM.** In case of default to appear in person or through counsel, the above petitions are will be decided on merits in your absence.

SUIT SCHEDULE OF PROPERTY

All that the Plot of land admeasuring 300 Sq.yds or 250.83 Sq.mts bearing Plot No.889 forming part of Sy.Nos.94 to 97 & 103, situated at Almasguda Village, Balapur Mandal, Ranga Reddy District, Telangana and the same is bounded as under:-
NORTH : 20' wide Road
SOUTH : Plot No.908
EAST : Plot No.890
WEST : Plot No.888

(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/-
K.R.K Chary
(Advocates)
Flat No.102, First Floor, Vamshiram's Jyothi Habitat, Road No.11, T-Grill Lane, Kakateeya Hills, Madhapur, Hyderabad-81 Cell : 9848021357

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST-CLASS SPECIAL(MOBILE) PCR ACT, RANGA REDDY-CUM-IV ADDL METRO-POLITIAN MAGISTRATE-CUM-IV-ADDL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: L.B. NAGAR
I.A. No. 226 of 2021
In
O.S.No.1152 of 2021

Between:
M.Sambasiva ...Petitioner/Plaintiff
AND
Navaru Narsimha Reddy ...Respondent/Defendants

To,
Gopal, S/o Islavath Chandru,
Aged 33 years, Occ: Business, R/o H.No.5-22, Vinaka Hills, Almasguda Village, Balapur Mandal, Ranga Reddy District, Aadhar No.2986-6527-7905,
PAN: ACSP18114K, Phone: 9398186892. ...Respondent/Defendant No.3

Please take notice that whereas the Plaintiff has filed the above Suit bearing O.S. No.1156 of 2021 for "Perpetual Injunction and consequential relief of declaration of documents as null and void and not binding on the plaintiff" in respect of suit/petitioner scheduled property against you i.e., the Defendant No.1 to 4. Further in the said suit the petitioner had filed the petitions I.A.No.226 and 2021 for injunction. The said petitions are posted to 27-06-2023 for your appearance before the Hon'ble Court. Please take the notice and appear on 27-06-2023 at 10:30AM. In case of default to appear in person or through counsel, the above petitions are will be decided on merits in your absence.

SUIT SCHEDULE OF PROPERTY

All that the Plot of land admeasuring 300 Sq.yds or 250.83 Sq.mts bearing Plot No.889 forming part of Sy.Nos.94 to 97 & 103, situated at Almasguda Village, Balapur Mandal, Ranga Reddy District, Telangana and the same is bounded as under:-
NORTH : 20' wide Road
SOUTH : Plot No.908
EAST : Plot No.890
WEST : Plot No.888

(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/-
K.R.K Chary
(Advocates)
Flat No.102, First Floor, Vamshiram's Jyothi Habitat, Road No.11, T-Grill Lane, Kakateeya Hills, Madhapur, Hyderabad-81 Cell : 9848021357

సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి : ఎమ్మెల్యే గోపాల్, స్టీఫెన్ సన్



నవతెలంగాణ-అడిక్ మెట్

జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాలతో ప్రజాసమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, స్టీఫెన్‌సన్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్‌మెట్, గాంధీనగర్ డివిజన్‌ల వార్డు కార్యాలయాలను కార్పొరేటర్‌లు పావనివినయ్‌కుమార్, సునీత ప్రకాష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించడానికి వార్డు కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.యువనాయకులు జైసింహా, వినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఏఎమ్ హెచ్ ఓ మైత్రి, అడిక్ మెట్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు రత్న సాయి, బీఆర్ ఎస్, బీజేపీ నాయకులు కార్యకర్తలు జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సాంబేషారావుకు ఐఏటీసీ అవార్డు ప్రదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇండియా, ఆఫ్రికాదేశల మధ్య వాణిజ్య, పరిశ్రమ స్థాపన కోసం కృషిచేసిన ముషీరాబాద్‌కు చెందిన ప్రమ సరోజ వ్యాపారి సాంబే షావునకు ఐఏటీసీ (ఇండియా ఐకోవాస్ ట్రేడ్ కౌన్సిల్) అవార్డు ను అందజేశారు. శుక్రవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ- ఇండియా ఆఫ్రికా ట్రేడ్ ప్రమోషన్ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని దేశముఖ్ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఇండియా, ఆఫ్రికా దేశాల మధ్య వాణిజ్య, పరిశ్రమల స్థాపనకు కృషిచేస్తున్నందుకు తనకు ఈ అవార్డు అందజేశారని తెలిపారు. ఇండియాలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు తన వంతు కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి పరిపాలన సౌలభ్యం కోసమే

వార్డు వ్యవస్థలు ప్రారంభం







ఎమ్మెల్యే దానం,మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-బంజారాహిల్స్

సమస్యలను సత్వరం పరిష్కరించుకునేందుకు పరిపాలన సౌలభ్యం ప్రజలందరికీ మరింత చేరు బాటులో తీసుకురావడానికి వార్డు వ్యవస్థను నగర వ్యాప్తంగా 150 డివిజన్లలో ప్రారంభోత్సవం చేశా మని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. వార్డు కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం జూబ్లీహిల్స్ సర్కిల్ 18 సి.ఎం.టి.ఇ.ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన బంజ రాహిల్స్ వార్డు కా ర్యాలయం, హిమాయత్‌నగర్ మేల్ కోటి పార్కులో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయనూ స్థానిక ఎమ్మె ల్యే దానం నాగేందర్‌తో కలిసి ఆమె ప్రారంభిం చా రు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా జీహెచ్ఎంసీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం వార్డు వ్యవస్థను అమల్లోకి తెచ్చింద న్నా రు. మెరుగైన పాలనతో సంక్షేమం, అభివృద్ధిలో ము ందంజలో ఉం దన్నారు. ప్రధాన కార్యా లయం, జో న్, సర్కిల్ కార్యాలయాలతో పాటు వార్డు కార్యాల యాలను సిటీజన్స్‌ప అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. 40వేలజనాభాకు ఒక వార్డును ఏర్పాటు చేశామని, వార్డు కార్యాల యంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వార్డు ఇం జనీర్, వార్డు యు.బి.డి సూపర్ వైజర్, విద్యుత్, శానిటరీ జవాన్, టౌన్ ప్లానర్, కమ్యునిటీ ఆర్గనైజర్, జలమండలి, ఎంటమాలజీ, కం ప్యూటర్ ఆపరేటర్‌లతో కూడిన పది మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని శాఖల సిబ్బందితో వార్డు కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు. వార్డు వ్యవస్థలో ప్రజా సమస్యలను కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా రిజిస్టర్ చేయబడి సంబంధిత శాఖ అధికారికి వెంటనే ఫార్వర్డ్ చేయబడుతుంది. సిటీజన్ చార్టర్‌ను అనుసరించి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తారని తెలిపారు. సమస్య పరిష్కారంలో అలసత్వం వహించిన అధి కారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసరా వికాసం ద్వారా సీనియర్ సిటీజన్స్, దివ్యాంగులకు ఐ.డీ కార్డులను 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. హిమాయత్ నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి, సోమాజిగూడ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌వన్ ఎం. సంగీత శ్రీని వాస్ యాదవ్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నేకవితరెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బంజారాహిల్స్ డివిజన్ వార్డు కార్యాలయం సిబ్బంది సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయాలు ప్రారంభించిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



జూబ్లీహిల్స్‌లో

పెరుగుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తెలం గాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా,శుక్రవారం జూబ్లీహిల్స్ నియో జకవర్గంలోని అన్ని డివిజన్‌ల, ప్రజల వద్దకే పరి పాలనలో భాగంగా వార్డు కార్యాలయాలను వార్డు కార్యాలయాలు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. జీహెచ్ ఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఒకే రోజు అన్ని కార్యాలయాలను ప్రారంభించారు. మొదటగా షేక్‌పేట బోరబండ, ఎర్రగడ్డ, రహ మత్ నగర్, వెంగళ రావు నగర్, యూసుఫ్‌గూడా, శ్రీనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ రమేష్, అన్ని శాఖల అధికారులతో కలిసి, అన్ని డివిజన్లను తిరిగి ఒకే రోజు ఘనంగా ప్రారం భించారు. ప్రతి వార్డ్ ఆఫీసులో విద్యుత్, వాటర్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజిస్ట్, శానిటేషన్ 10 శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ప్రజలను ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కోరారు.

అంబర్‌పేట్ :



వార్డు ఆఫీసులను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని మాజీ కార్పొ రేటర్ ఎక్కాల చైతన్య కన్నా అన్నారు. శుక్రవారం మంత్రి కేటీఆర్‌ని ఆమన మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మెహిదీపట్నం



మెహిదీపట్నం కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని లంగర్‌హౌస్, గోల్కొండ, టోలీచౌకి, నానోల్ నగర్, జియాగూడ ప్రాంతాలలో వార్డు ఆఫీసులను కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మహిఉద్దీన్ ప్రారంభిం చా రు.కార్పోరేటర్లు మహమ్మద్ నసీరుద్దీన్, స్వామి యాదవ్, వజియా జుమా, హరుణ్ ఫర్వాన్, బదరు ద్దీన్, జిహెచ్ఎంసి, వాటర్ బోర్డ్, విద్యుత్ బోర్డ్ అధికారులు ఎంఐఎం కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్‌లో



గన్‌ఫౌండ్రీ డివి జన్‌లోనీ ఇసామియా బజార్ విక్టోరియా ప్లేగ్రౌండ్‌లో వార్డ్ ఆఫీస్ కార్యా లయాన్ని ప్రారంభిస్తున్న గోషా మహల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజాసింగ్, డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్‌చ, ఎఎం హెచ్‌ఒ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వార్డ్ ఆఫీసు ఇంచార్జ్ అష్రఫ్ అలీ, యుసీడీసీఓ రాంబాబు జీహెచ్ఎంసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఓయూ



హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ సెక్రెటరీ కక్కిరేణి చేతన హరీష్ డివి జన్‌లోని స్ట్రీట్ నెం బర్ 8 విజ్ఞానాపురి కమ్యూనిటీ హాల్‌లో వార్డు కార్యాలయాన్ని ఎమ్మెల్యే బేతి సుభా ష్‌రెడ్డితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సం దర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా ఈ కార్యాలయం ఏర్పాటు చేశామని ప్రజలకు సత్వర సేవలందించేందుకు ఆయా విభాగాలు అధికారులు ఇక్కడ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధి కారులు డిసి అరుణ కుమారి, హెచ్ఎమ్డబ్ల్యూఎస్ జీఎం సంతోష్, అన్ని శాఖల అధికారులు, బిజెపి సీనియర్ నాయకులు సంజయ్ పటేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శులు , చింతకింది ప్రవీణ్, పాల్గొన్నారు.

సుల్తాన్ బజార్(బేగంబజార్)



బేగంబజార్ వార్డ్ ఆఫీసును పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌లు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఆర్‌వి మహేందం కుమార్ నియో జకవర్గం ఇన్‌చార్జీ నందకిషోర్ వ్యాస్ పాల్గొన్నారు.



అంబర్‌పేట(నెహ్రూనగర్‌లో):

పౌర సేవలను డివిజన్ ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయ డం జరిగిందని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. డివిజన్ లోని నెహ్రూనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని కార్పొ రేటర్, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రజితతో కలిసి ప్రారం భించారు.వార్డ్ ఆఫీసర్ బన్సిలాల్, ఇంజనీర్ దివ్య తేజ్, టౌన్ ప్లానర్ వాణి, ఎంటమాలజిస్ట్ పి. వెంకటయ్య సీఓ సుమతి, ఎస్ జె శ్రీనివాస్, యుపిడి సూపర్వైజర్ జీ.వికాస్, కంప్యూటర్ ఆపరేటర్ జానీ పాషా, జలమండలి అధికారి అశ్వక్,



ఎలక్ట్రికల్ కేకే రాజు బస్తీలు, కాలనీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ముషీరాబాద్‌లో

ముషీరాబాద్ డివి జన్‌లో వాలీబాల్ గ్రౌండ్ ఆవరణలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయా న్ని శనివారం ముషీరా బాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ ప్రారంభించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సత్వారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో డీఎంసీని నిలదీసిన బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయ ప్రారంభోత్సవం స్వల్ప వివాదంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ రాకముందే డివి జన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్ డిఎంసీతో కలిసి వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ వార్డు కార్యాలయాన్ని టిఆర్ఎస్ నేతలతో సందర్శించారు. అప్పటికే వార్డు కార్యాలయం ప్రారంభిం చడంతో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతున్న సమయంలో అక్కడే ఉన్న ముషీరాబాద్ డివిజన్ టిఆర్ఎస్ మాజీ అధ్య క్షుడు అజయ్ ముదిరాజ్ తదితరులు తమ ఎమ్మెల్యే ముఠా గోపాల్ రాకముందే వార్డు కార్యాలయాన్ని ఇలా ప్రారంభిస్తారని జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ తిప్పర్తి యాదయ్యను ప్రశ్నించారు. దీంతో ఇప్పుడు ఏం జరిగింది ఎందుకు ఆగ్రహంగా మాట్లాడుతున్నారని డీఎంసీ యాదయ్య బీఆర్ఎస్ నాయకులకు ఎదురు ప్రశ్న వేయడంతో స్వల్ప వివాదంగా మారింది. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ కో-కన్వీనర్ నవీన్‌గౌడ్, బిఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్ ,దీన్ దయాల్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు

అక్రమ కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలి

పీఓడబ్ల్యూ డిమాండ్



నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రగతిశీల మహిళా సంఘం నాయకులపై మోపిన అక్రమ కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో అక్రమంగా బనాయించిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ, హాజరై మాట్లాడుతూ దశాబ్దాల తరబడి దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు, కార్మికులకు, మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతూ ఉద్యమమే ఊపిరిగా, నిరుపేద ప్రజల పక్షాన నిలబడి కలబడి పోరాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) అని వారు అన్నారు. జాతీయ కన్వీనర్ వి.సంధ్య, పౌరుల హక్కులు కాలరాయబడుతున్న సమయంలో వారికి గొంతుకనిచ్చి, వారి పక్షాన నినదించిన ప్రొ.హరగోపాల్, బొంబాయి హైకోర్టు దివంగత జడ్జి సురేష్, ప్రొ.పద్మజషా, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణ్, హెచ్.నారాయణ, అడ్వొకేట్లు రఘునాథ, చిక్కుడ ప్రభాకర్, అరుణోదయ నాయకురాలు విమల, సహా మొత్తం 152 మందిపై అక్రమంగా, కుట్రపూరితంగా ఉపా కేసును మోపడాన్ని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) వ్యతిరేకిస్తున్నది అని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం నాయకులపై మోపిన అక్రమ కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఓడబ్ల్యూ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షురాలు బండారు విజయ, నాయకులు రేణుకలు పాల్గొన్నారు.

గిరిజనులకు గిరిజన బంధు ఇవ్వాలి



గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్

నవతెలంగాణ-ధూల్‌పేట్

గిరిజనులకు గిరిజనబంధు ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు గిరిజన బంధు ఇవ్వాలని యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల దగ్గర నిరసన కార్యక్రమం జరపాలని సంఘం రాష్ట్ర పిలుపు మేరకు పాతబస్తీ జంగం మెట్ డివిజన్ ఫలక్‌నుమా రవీందర్ నాయక్ బస్తీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర గిరిజన సంఘం, హైద రాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన, ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు వి.రామ్ కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శిలు మాట్లాడుతూ తెలంగాణలో మన ముఖ్య మంత్రి గత మూడు నెలల క్రింద గిరిజనులకు గిరిజన బం ధు ఇస్తానని హామీ ఇచ్చారని, గిరిజన ఉత్సవాల సందర్భ ంగా ఈ హామీని ప్రకటించి గిరిజనులు ఆదుకో వాలన్నా రు.ఈ కార్యక్రమంలో ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు బుడ్డ సత్యనారాయణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఎం.బాలు నాయక్, లచ్చిరామ్ నాయక్, జాను నాయక్, ఏ కృష్ణ, ఎస్ కిషన్, ఎం రాజేష్ నాయక్, భరత్ నాయక్. మహేష్ నాయక్, భరత్, పాల్గొన్నారు.

సామాన్య పౌరులను వేధించడానికే ధరణి పోర్టల్

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ



నవతెలంగాణ-అంబర్‌పేట:

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో ఉన్నవారి స్నేహితులకు ప్రయోజనం చేకూరుస్తూ, సామాన్య పౌరు లను వేధించడానికి తన అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేస్తుందో చెప్పడానికి ధరణి పోర్టల్ ఒక ఉదాహరణ అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ ఆరోపించారు. దేశంలోనే అత్యంత చెత్త డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కె. చంద్రశేఖర్ రావు తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ఒకటని ఆమె దుయ్యబట్టారు. ధరణి సమ స్యలతో బాధ పడేవారిని బంగాళాఖాతంలో పడేయాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ నిబద్ధత లేకుండా, అర్ధ రహితమైన అహంకారపూ రిత వ్యాఖ్యలు చేయడం న్యాయం కోసం పోరాడుతున్న సామాన్య ప్రజలను పూర్తిగా కించపరచడమే అని అన్నారు. నిజమైన సమస్యల నుండి పౌరుల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తే ప్రజలు తగిన బుద్ధి చెపుతారని తెలిపారు. హైదరాబాద్, కాచిగూడలోని తన కార్యాలయం నుండి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలని చూసి నిరాశనిస్పృహలతో ముఖ్య మం త్రి కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ ధరణి పోర్టల్‌ను నిషేధిస్తుందని ప్రజలను తప్పుదోవపట్టించడం సిగ్గుచేటని డా.కోటనీలిమ అన్నారు. కాంగ్రెస్ అధికా రంలోకి రాగానే ధరణి పోర్టల్ స్థానంలో పారదర్శకంగా, శాస్త్రీయం గా అభివృద్ధి చెందిన, ప్రజలకు అనుకూలమైన పోర్టల్‌ను ఏర్పాటు చేస్తామని టీపీ సీసీ అధ్యక్షులు ఏ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్నీ ఆమె గుర్తు చేసారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధు రాకుండా పోతుందని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ధరణి పోర్టల్ స మస్యలకు సంబంధించిన అనేక అంశాలపై మొ దటి నుంచి కృషి చేస్తోందని, గత కొన్ని నెలలుగా ధరణి సమస్యలను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా రికార్డ్ చేసి నమోదు చేసే విధానాన్ని పార్టీ రూపొందిం చిం దని ఆమె వెల్లడించారు. ప్రజా సమస్యలపై పోరాడు తున్న కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ముఖ్యమంత్రి కెసిఆర్ బయపడి అవాస్తవాలను వాస్తవా లుగా మార్చే ప్రయ త్నా లు చేస్తున్నా దని, ప్రజలెవరూ తెలివితక్కువవారు కారని, వచ్చే ఎన్నికల్లో గద్దెదించితగిన బుద్ది చెపుతారని ఆమె తెలిపారు.

ముజీబ్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే ఆస్పత్రిలో అన్నదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ వ్యవస్థాపకులు డా.సయ్యద్ మజీదుల్లా హుస్సేని (ముజీబ్) ఆధ్వ ర్యంలో శుక్రవారం రెడ్‌హిల్స్, మెహదీ నవాబ్ జాంగ్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 750 రోగుల సహాయకులకు మాంసాహార అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంతో ఉన్న పేద ప్రజలు మహమ్మారి క్యాన్సర్ రోగంతో ఆస్పత్రికి వచ్చిన వారికి అన్నదాన చేయడం పట్ల తనకు చాలా సంతోషంగా ఉంటుందని వివరించారు.తన తల్లిదండ్రుల పేరు మీద మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి దాని ద్వారా అన్నదాన కార్య క్రమం, ఇతర సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టుతున్నందుకు, తనను ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకి , బంధుమిత్రులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు కే.ఆర్.రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, ముఖీం ఖురేషి, నాలుగో తరగతి అసోసియేట్ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ఎం.ఎస్.జే.క్యాన్సర్ ఆసుపత్రి సభ్యులు శివకుమార్, మిత్రలు ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

'ప్రజల కోసం పని చేసే మేధావులపై 'ఉపా' కేసును ఉపసంహరించాలి'

ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రజల హక్కుల కోసం దీర్ఘకాలికంగా పని చేసే మేధావులపై పెట్టిన తాడ్వాయి 'ఉపా' కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమ్ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ శుక్రవారం విడు దల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్టంలో సుదీర్ఘ కాలం పౌరహక్కులు, మహిళా హక్కుల కోసం పోరాడుతున్న రిటైర్ ప్రో.హరగోపాల్, వి.సంధ్య తదితరులు 150 మందిపై తాడ్వాయి పోలీసులు 'ఉపా' చట్టం క్రింద కేసు నమోదు చేశారని, మావోయిస్టు సాహిత్యంలో వారి పేర్లు ఉన్నాయనే ఆరోపణలతో ఇలా దేశద్రోహం కేసు మోపడం అన్యాయమన్నారు. తెలంగాణలో పెట్టిన తాడ్వాయి 'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలని, ప్రజల కోసం పని చేసే మేదావులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏబీవీపీ నాయకులపై కబ్జాదారుల గుండాలు దాడి

గాయపడ్డ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వికాస్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ భూములలో కబ్జాదారులు రాత్రి సమయంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అడ్డుకున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులపై కబ్జాదారులు వారి రౌడీలు, గుండాల దాడి చేయగా పలువురు విద్యార్థి నాయకులకు గాయాలయ్యాయి. దుండగుల దాడిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వికాస్ తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. చికిత్స అనంతరం శుక్రవారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ఏబీవీపీ చేపట్టిన ధర్నాలో మా ప్రాణాలైనా అర్పిస్తా-మా ఓయూ భూములను రక్షించుకుంటాం అంటూ ఫ్లకార్డ్‌తో ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వికాస్ గౌడ్ మాట్లాడుతూ. దేశంలో ప్రతిష్టత్మకమైన ప్రారంభంలో 2400 ఎకరాల భూమి ఉండగా అనేక మంది కబ్జా కోరులు, భూ మాఫియా, రాజకీయ,ఇతర ప్రముఖుల కబ్జాలకు గురై నేడు అది కేవలం 1600 ఎకరాలకు పరిమితమైందన్నారు. ఓయూలో భూమి ఒక్క అడుగు కూడా కబ్జా కాకుండా ఏళ్ల నుండి విద్యార్థి పరిషత్ ముఖ్య పాత్ర పోషిస్తుందని, ఇదే క్ర మంలో నిన్న అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారన్న సమాచారంతో వెళ్లి ప్రశ్నించిన సమయంలో అధికారులకు లేని ఇబ్బంది మీకేంటని బయట నుండి గుండాలు రౌడీలను తెచ్చి మాపై విచక్షణా రహితంగా దాడి చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు భూములపై సర్వే నిర్వహించి కబ్జాదారులను ఖాళీ చేయించి యూనివర్సిటీ భూములను కాపాడాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ ఝాన్సీ, స్టేట్ సంయుక్త కార్యదర్శి సురేష్, విభగ్ కన్వీనర్, స్టేట్ సం యుక్త కార్యదర్శి పృథ్వీ , స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్స్ శ్రీహరి, జీవన్, రాజు, మహేష్, శ్యామ్, శ్రీధర్ , జిల్లా కన్వీన ర్లు హరిప్రసాద్, కళ్యాణ్, ప్రతీక్ , మనోహర్, యూనివర్సిటీ సెక్రెటరీ బట్టు పరుశురాం, స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ కళ్యాణి , వైస్ ప్రెసిడెంట్ సాయి, గణేష్ పాల్గొన్నారు.

పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

పోడుభూముల సాగు చేసుకుని జీవిస్తున్న పేదలకు ప్రభుత్వం వెంటనే హక్కు పత్రాలు మంజూ రు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లోని షోయబ్ హాల్‌లో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి పీడీఎం నాయకులు అంజన్న అధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా పౌర హక్కులసంఘం రాష్ట్ర కా ర్యదర్శి నారాయణరావు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా లక్షలాది మంది గిరిజన, గిరిజనేతర పేదలు ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేసుకుని జీవిస్తూ తమకు హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని ఎన్నిమార్లు కోరిన పట్టించుకోవడంలేదని, ఈ పోడు భూములు పోరాటంలో అనేక మంది పేదలు, ఫారెస్ట్ అధికారులు ప్రాణాలు కోల్పోతున్న సమస్యను పరి ష్కరిం చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని పేర్కొ న్నా రు. ప్రభుత్వం వెంటనే సాగు దారులకు హక్కు పత్రాలు మం జూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో పీడీఎం నాయకులు, వై.వెంకటేశ్వం రావు ,సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ,రైతాంగ సమితి నాయకులు వెంకటయ్య, ఐఎఫ్‌టీయు నాయకులు షేక్ షావలి, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్ అ న్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని గౌరీశంకర్ ఆలయ క మిటీ చైర్మెన్ పులిగిల్ల శ్రీధరా చా రి ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐ జహంగీర్ యాదవ్, బీఆర్ఎస్ యువ జన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహాలు గౌరీశంకర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, లక్ష్మణ్ పార్టీ సీ నియర్ నాయకులు శివ ముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్ ప్రసాద్, ఆకుల అరుణ్ కుమార్, మహిళా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శోభ, మేరి పాల్గొన్నారు.

మదర్ డెయిరీ పార్క్ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ముషీరాబాద్

బాగ్‌లింగంపల్లిలోని ఎంఐజీ 2 కాలనీలోని మదర్ డెయిరీ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం పార్క్ అభివృద్ధిలో భాగం గా బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ దాదాపు కోటి రూపాయలతో సుందరయ్య పార్కును అత్యంత సుందరంగా తీర్చిదిద్దామని అదే తరహాలో మదర్ డెయిరీ పార్కును కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నే దామోదర్ రెడ్డి, తెలంగాణ హౌస్ ఫెడ్ డైరెక్టర్ కిషన్ రావు, సీనియర్ నాయకులు బబ్లు, అహ్మద్ రఫీ ఖాన్, నాగభూషణం, ఎమ్ఐ జీ2 వెల్ఫేర్ అసో సియేషన్ అధ్యక్షులు ఈ అప్పారావు, ప్రధాన కార్యదర్శి జే.రత్నాకర్‌రెడ్డి ఉపాధ్యక్షులు ఎస్ శేషయ్య పి.శంకర్ ట్రెజరర్ ఎం.జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పరిపాలన సౌలభ్యం

- కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ప్రజల చెంతకే పరిపాలన సౌలభ్యం రావడం శుభపరిణామమని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి .విజయ శేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలోని కమిటీ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ మంగతాయారుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే సంకల్పంతో గ్రేటర్ పరిధిలో డివిజన్ల వారీగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, వార్డు అడ్మినిస్ట్రేషన్ అధికారి ఉదయ్, వార్డు ఏ.ఈ స్వాతి, వార్డు టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ప్రభావతి, వార్డు ఎంటమాలజిస్ట్ ఉమారాణి, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి నివేదిక బ్రోచర్స్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుండిగల్



తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈరోజు "పట్టణ ప్రగతి" కార్యక్రమం దుండిగల్ చైర్ పర్సన్ సుంకరి క్రిష్ణవేణి క్రిష్ణ ఆధ్యక్షతన జెండా వందన కార్యక్రమం, అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ హాజరై, పట్టణ ప్రగతి నివేదిక బ్రోచర్స్‌ను విడుదల చేశారు. తరువాత ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఆవరణలో రంగోలి కార్యక్రమంతో పాటు మున్సిపల్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ధ్రువపత్రం, శాలువా, మేమెంటోతో సత్కరించినారు, సఫాయి అన్నా నీకు సలాం అన్నా కార్యక్రమంలో భాగంగా సానిటరీ సిబ్బంది కీపీపీటీ కిట్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ తుడుము పద్మారావు, కమిషనర్ కే. సత్యనారాయణ రావు, కౌన్సిలర్ సుంకరి క్రిష్ణ, కౌన్సిలర్‌లు, మేనేజర్ సునంద, ఆర్వో శ్రీహరి రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జానాభా రెండింతలు పెరిగినా తాగునీటికి ఢోకాలేదు



- 2050 వరకు బేఫికర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

భవిష్యత్తులో హైదరాబాద్ నగర జనాభా ఎంత పెరిగినా అందుకు తగిన నీటి వసతి ఉందని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్ప కళా వేదికలో శుక్రవారం జరిగిన పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ 2050 వరకు జనాభా రెండితలు పెరిగినా అందుకు తగిన నీటి వసతి ఉన్న ఏకైక నగరం హైదరాబాద్ అని తెలిపారు. భవిష్యత్తులో తాగు నీటి ఎద్దడి రాకుండా అనేక ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికోసం ప్రస్తుతం సుంకిశాల ప్రాజెక్టు నిర్మిస్తున్నామని తెలిపారు. కొండపొచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌ల నుంచి నీరు సరఫరా చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. త్వరలో వంద శాతం మురుగును శుద్ధి చేసే నగరంగా హైదరాబాద్ చరిత్రకెక్కనుందని పేర్కొన్నారు. ఇందులో జలమండలి అధికారులు, సిబ్బంది, కార్మికుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. ఔటర్ రింగు రోడ్డు తో పాటు ఓఆర్ఆర్ అవతల 5 కిలో మీటర్ల వరకు సీవరేజ్ మాస్టర్ ప్లాన్ జలమండలి తయారు చేసి ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం జలమండలి ఎండీ దాన కిశోర్ మట్లాడుతూ ప్రస్తుతం హైదరాబాద్ మహా నగరానికి సమద్ధిగా నీళ్ల ఇస్తున్నామని, భవిష్యత్తు అవసరాలకు తగిన ప్రణాళికలు రచించామని అన్నారు. ఒకప్పుడు నగరంలో తాగునీటి కోసం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలపై ఆధారపడే వాళ్లమని, ప్రస్తుతం ఆ అవసరం లేదన్నారు. 2014లో 307 ఎంజీడీల తాగు నీరు సరఫరా చేసేదని, ప్రస్తుతం 560 ఎంజీడీల నీరు అందిస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ ఏర్పడ్డ తర్వాత గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజు-1, కష్టా మూడు ఫేజుల ద్వారా నగరంతో పాటు ఓఆర్ఆర్ వరకు సమద్దిగా నీళ్ల ఇవ్వగలుగుతున్నామని వివరించారు. భవిష్యత్తు తరాల కోసం సుమారు రూ.2214 కోట్లతో సుంకిశాల ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. నగరంలో కొత్తగా నిర్మిస్తున్న 31 ఎస్టీపీలు త్వరలో అందుబాటులోకి వస్తాయని, ఫలితంగా రోజూ ఉత్పన్నమయ్యే మురుగు నీటిని వంద శాతం శుద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, అరికెపూడి గాంధీ, ఇతర ఎంఎల్ఏలు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీడీఎంఏ కమిషనర్, డైరెక్టర్ సత్యనారాయణ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జలమండలి ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సుపరిపాలన అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యం



- మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేందుకు వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం శుభసూచికమని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం సర్కిల్, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాన్ని ఆయనతోపాటు స్థానిక ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమతలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జగద్గిరి గుట్టతో పాటు పలు ప్రాంతాలు ఎలాంటి అభివృద్ధి జరగలేదని అప్పటి పాలకుల పనితీరుపై మండిపడ్డారు. 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ ప్రజలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఇంటికి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారన్నారు. మన రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపుతూ దేశంలోనే నంబర్ వన్ స్థాయికి ఎదిగిందంటే సీఎం కేసీఆర్ ఘనతనే అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ఈ డివిజన్‌లో ప్రతి ప్రాంతంలో ప్రజల సహాయ సహకారాలతో మౌలిక వసతులు కల్పిస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దు తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం ఉప కమిషనర్ ప్రశాంతి, ఏఎంసీ. సునందిని, ఏఈ తిరుపతి రెడ్డి, శానిటేషన్ జవాన్ గజేంద్ర బాబు, సీఓ.కిషోర్ కుమార్, ఎంటమాలజీ అధికారి మల్లేష్ ,టీపీఎస్ సూపర్వైజర్ సంగీత బాయి, విద్యుత్ శాఖ అధికారి సంజీవరెడ్డి, జలమండలి మేనేజర్ అంకిత్, బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న మున్సిపాలిటీలు



- చామకూర మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్రంలోని మున్సిపాలిటీలన్నీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.అనంతరం మున్సిపల్ కార్మికులను సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహా రెడ్డి,వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణుచారి, బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రయివేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు

- ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శివ కుమార్

నవతెలంగాణ-దుండిగల్



ఈ విద్య సంవత్సరం గతంలో కంటే ఎక్కువగా ఇప్పు డు అధిక ఫీజులు వసూలు చేస్తు న్నారని, విద్యాసంస్థల అధికారు లు నియంత్రించ లేకపోతు న్నారని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శివ కుమార్ తెలిపారు. అలాగే విద్యార్థుల పుస్తకాల విషయంలో ప్రైవేట్ పాఠశాల యాజమా న్య సంస్థలు అధిక ధరకు అమ్ముతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ విద్య సంస్థలకు సంబంధించిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ చోద్యం చూస్తున్నారు. అని ఆరోపించారు. వెంటనే స్కూల్ ఫీజులు తగ్గించాలని, అలాగే పుస్తకాల ధరలు నియంత్రణలో వుండాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు చేరువ చేసేందుకే వార్డు కార్యాలయాలు

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నవతెలంగాణ-కుత్బులపూర్



పరిపాలనను ప్రజలకు మరింత చేరువయ్యేలా చేసేందుకే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని గణేష్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదురుకుంటున్నా సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారని, వినతులను పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారమయ్యే విధంగా చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ మంగతాయారు, ఈఈ కృష్ణ చైతన్య, వార్డ్ ఇంచార్జ్ కృష్ణ, అధికారులు, సిబ్బంది, డివిజన్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శి, అనుబంధ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

పరిపాలనను పౌరులకు చేరువ చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యం

నవతెలంగాణ- కేపీహెచ్‌బీ



హైదరాబాద్ నగరంలో పరిపాలనను మరింతగా పౌరులకు చేరువ చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంత్రి కేటీఆర్ సూచనల మేరకు హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్ లో (సమతా నగర్ చిల్డ్రన్స్ పార్క్ వద్ద) జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైదర్‌నగర్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని సంబంధిత అధికారులతో, సతీసమేతంగా పాల్గొని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమన్నారు. నగర పౌరులకు పరిపాలన మరింత చేరువ చేసేలా వార్డు పాలన నేటి నుంచి మొదలు కానున్నది అని తెలిపారు. ఈ వార్డులో 10 మంది అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి..ప్రజా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపనున్నారన్నారు. ఈ వార్డులో వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వార్డు ఎంటమాలజిస్ట్, వార్డు ఇంజినీర్, వార్డు టౌన్‌ప్లానర్, వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్, వార్డు శానిటరీ జవాన్, వార్డు అర్బన్ బయోడైవర్సిటీ సూపర్‌వైజర్, వార్డు కంప్యూటర్ ఆపరేటర్, వార్డు రిసెప్షన్, జలమండలి అధికారులు, టీఎస్ ఎస్పీడీసీఎల్ అధికారులు సేవలందిస్తారని తెలిపారు. హైదర్ నగర్ డివిజన్ ప్రజలు ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకొని మీ కాలనీ, బస్తీలలో ఉన్న సమస్యలు నేరుగా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ మున్సిపల్ కమీషనర్ సందేశ్ చంద్ శ్రీ వాస్తవ్, స్ట్రీట్ లైట్స్ సూపర్వైజర్ సుధాకర్, ఎంటమాలజి మురళి, హరికల్చర్ దాసు, వాటర్ వర్క్స్ అలీ ఖాన్, లైన్ మెన్ శర్మ జవాన్ నర్సింగ్ రావు, రిసోర్స్ పర్సన్ ఏలెంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ నీలిమ మరియు హైదర్ నగర్ డివిజన్ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేయోభిలాషులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుంది

నవతెలంగాణ- కేపీహెచ్‌బీ



పట్టణ ప్రగతి" కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు అన్నారు. శుక్రవారం సూపరిడేంట్ టికే ప్రభాకర్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ డివిజన్ వార్డ్ కార్యాలయాన్ని ఆమె పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు పార దర్శకమైన సత్వర సేవలందించాలన్న లక్ష్యంతో జి. హెచ్.ఎం.సి పరిధిలో నేటి నుంచి వార్డ్ స్థాయి పాలన ప్రారంభమైందన్నారు. మంత్రి కేటీఆర్ ఆలోచనతో వార్డు స్థాయి పరిపాలనా వ్యవస్థను ఒకే తాటిపైకి తీసుకురావడానికి అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకునే విధంగా వార్డు కార్యాలయం ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రవీందర్ రావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించబడ్డ సురభి రవీందర్ రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రవీందర్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, సహకరించిన రాష్ట్ర నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు శుభాకాంక్షలు తెలిపిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. చెన్నమనేని స్రవంతి, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్, కుమార చారి, నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెరా సభ్యులు శ్రీనివాస రావుకు అభినందనలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రియల్ ఎస్టేట్స్ రెగ్యూలేటరి అథారిటీ (రెరా) సభ్యునిగా నియమితులై కేశబోయిన శ్రీనివాస రావును శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీకి చెందిన పంచశీల ఫౌండేషన్ చెర్మెన్ జి.వెంకటేష్ ముదిరాజ్ తోపాటు కుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సారా శంకర్, కార్యవర్గ సభ్యులు దమ్మాని కుమారస్వామి, బాలరాజ్‌లు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జింకల వెంకటేష్ ముదిరాజ్ మాట్లడుతూ గతంలో జీహెచ్ఎంసీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌గా విశేష సేవలందించి నందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ అధికారిగా ప్రశంసలు పొందిన శ్రీనివాసరావు పదవి విరమణ తరువాత రెరా సభ్యునిగా నియమితులు కావటం ముదిరాజ్ బిడ్డగా మేమంత గర్వపడుతున్నామని, రెరా అధికారిగా మరింత గొప్పపేరు ప్రఖ్యాతలు తీసుకురా వాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి రచయిత మానస టూల్ టెక్ అదినేత వాకిటి రామ్ రెడ్డి,సామాజిక సేవకులు తెలుగు అంజనేయులు, రాజేశ్వర్, తదితరులు కలిసి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియచేశారు

గిరిజన వజ్రోత్సవాల్లో గిరిజన బంధును అమలు చేయాలి

నవతెలంగాణ- కేపీహెచ్‌బీ



రేపు జరిగే గిరిజన వజ్రోత్సవాల్లో గిరిజన బంధును అమలు చేయాలని గిరిజన సంఘం మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణనాయక్ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి మండలంలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ 1 లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు దళిత బంధు అమలు చేశారని.. అదేవిధంగా బీసీ కులాలకు వృత్తి కులాల కు తెలంగాణ ప్రభుత్వం లక్ష రూపాయల సహాయాన్ని ప్రకటిస్తున్నట్టే గిరిజనులకు కేసీఆర్ గిరిజన బంధును అమలు చేస్తానని ప్రకటించారన్నారు. కానీ ఇచ్చిన హామీని ఇంకా నిలబెట్టుకోలేదని రేపు జరగబోయే గిరిజన వజ్రోత్స వాల సందర్భంగా గిరిజన బంధును అమలు చేయాలని వారు కోరారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే గిరిజనులందరూ ఏకతాటిపై వచ్చి ఉద్యమం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివకుమార్, మండల నాయకులు శంకర్ నాయక్, మంగ్య ,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులుగా అనిల్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులుగా అనిల్ యాదవ్ పదవి బాధ్యతల స్వీకరణ సభ గాంధీ భవన్‌లో శుక్రవారం అట్టహాసంగా జరిగింది. భారీగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ లో పని చేసిన అనిల్ కుమార్ యాదవ్‌కు సికింద్రాబాద్ జిల్లాలో మంచి పట్టు ఉన్న వ్యక్తికి సరైన స్థానం కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. యువజన కాంగ్రెస్ లో తనదైన శైలి లో కష్టపడ్డారన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో కాంగ్రెస్ అత్యధిక మెజారిటీ స్థానాలు గెలిస్తే యావత్తు రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారం లో వస్తుందన్నారు. అనిల్ కుమార్ యాదవ్‌కి అభినందనలు తెలిపారు. అనిల్ యాదవ్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఎన్ఎస్‌యూఐలో పనిచేశానని, అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఎం ఎస్ఆర్ తన నాన్న అంజనీ కుమార్‌ను నగర అధ్యక్షుడి ని చేశారన్నారు. మనకు అండగా రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఉన్నారని.. హైదరాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగురెస్తామని తెలిపారు.

తుది జట్టులో లేనని ముందే తెలుసు

ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

అందుకే బౌలింగ్ ఎంచుకున్నా!




నవతెలంగాణ-చెన్నై

భారత స్టార్ స్పిన్నర్, ప్రపంచ టాప్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కెరీర్ చివరి దశలో ఎక్కువగా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఐపీఎల్ నుంచి టిఎన్‌పీఎల్ వరకు అశ్విన్ వార్తల్లో నిలుస్తున్నాడు. ఆటతో, ఆటలో వైవిధ్యత చూపిస్తున్న రవిచంద్రన్ అశ్విన్ ఇటీవల ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ తుది జట్టులో చోటు సాధించలేదు. స్పిన్‌కు సహకరించే పిచ్‌పై అగ్రశ్రేణి మాయగాడు అశ్విన్‌ను పక్కనపెట్టడంపై సర్వత్రా చర్చ నడిచింది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్లో చోటు దక్కదని 48 గంటల ముందే తెలుసని అశ్విన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. కెరీర్ ఆరంభంలో నాణ్యమైన బ్యాటర్‌గా పేరొందినా.. బౌలింగ్ ఎంచుకునేందుకు ప్రేరేపించిన కారణాన్ని సైతం అశ్విన్ తాజాగా ఆవిష్కరించాడు.

'భారత్, శ్రీలంక మ్యాచ్ చూస్తున్నాను. భారత బౌలింగ్ మరీ చెత్తగా అనిపించింది. అభిమాన క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ఎన్ని పరుగులు చేసినా.. అంతకు సమానమైన పరుగులను బౌలర్లు అలవోకగా సమర్పిస్తున్నారు. బౌలర్‌ను కావాలని అప్పుడే అనుకున్నాను. ప్రస్తుతం (ఆ మ్యాచ్‌లో) ఉన్న బౌలర్ల కంటే మెరుగ్గా నేను రాణించలేనా? అనుకున్నాను. అక్కడే ఆఫ్ స్పిన్నర్‌కు పునాది పడింది. కానీ నేను క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం.. మంచి బ్యాటర్‌గా కొనసాగకుండా ఎందుకు బౌలింగ్ ఎంచుకున్నానని పశ్చాత్తాపడతాను. నేను అసలు బౌలర్‌ను కాకుండా ఉండాల్సింది. ఈ భావనతోనే నేను కొన్నాండ్లు పోటీపడ్డాను. బ్యాటర్లు, బౌలర్లకు భిన్నమైన ట్రీట్‌మెంట్ ఉంటుంది. బ్యాటర్లకు అవకాశాలు దక్కకూడదని నా అభిప్రాయం కాదు. బ్యాటర్లతో పాటు బౌలర్లకు సమాన అవకాశాలు ఉండాలి. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ తుది జట్టులో నాకు చోటు లేదనే సంగతి 48 గంటల ముందే తెలుసు. అయినా, జట్టు విజయం కోసం నా వంతు పాత్ర పోషించాలనే ఉత్సాహంతో ఉన్నాను. సాధారణంగా టెస్టు మ్యాచ్‌లో స్పిన్నర్ ప్రభావం నాల్గో ఇన్నింగ్స్‌లో ఉంటుంది. ఆఫ్ స్పిన్నర్‌ను తుది జట్టులోకి ఎంచుకునేందుకు.. ఇతర నైపుణ్యాలు బేరీజు వేస్తున్నారనే వాదనలోకి వెళ్లదలచుకోలేదు' అని రవిచంద్రన్ అశ్విన్ తెలిపాడు.

ప్రణయ్ ప్రతాపం



- సెమీఫైనల్లో అడుగుపెట్టిన స్టార్ షట్లర్
- క్వార్టర్స్‌లో వరల్డ్ నం.4 కొడాయ్‌పై గెలుపు
- సాత్విక్, చిరాగ్ జోడీ సైతం ముందంజ

ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్

జకర్తా (ఇండోనేషియా)

భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ సత్తా చాటుతున్నాడు. ఇటీవల మలేషియా ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన హెచ్.ఎస్ ప్రణయ్ తాజాగా ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలోనూ చెలరేగుతున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నం.4, మూడో సీడ్ కొడాయ్ నరోకాపై 21-18, 21-16తో వరుస గేముల్లో ఘన విజయం సాధించాడు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సైతం దుమ్మురేపారు. టాప్ సీడ్, ఇండోనేషియా స్టార్స్ ఫజర్, మహ్మద్ రియాన్‌లపై వరుస గేముల్లో ఎదురులేని విజయం నమోదు చేశారు. మెన్స్ సింగిల్స్‌లో ప్రణయ్, మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ సెమీఫైనల్స్‌కు చేరుకోగా.. మెన్స్ సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యాడు.

సూపర్ ప్రణయ్ : కొడాయ్ నరోకతో క్వార్టర్‌ఫైనల్స్‌కు ప్రణయ్ అండర్‌డాగ్‌గా బరిలో దిగాడు. గతంలో ఆడిన నాలుగు ముఖాముఖి మ్యాచుల్లో ప్రణయ్ ఒక్కదాంట్లోనూ గెలుపొందలేదు. కానీ ప్రపంచ శ్రేణి క్రీడాకారులతో తలపడినప్పుడు ప్రణయ్ అత్యుత్తమ ఆటతీరు కనబరుస్తాడు. ఇండోనేషియా ఓపెన్‌లో ప్రణయ్ అదే చేశాడు. 55 నిమిషాల క్వార్టర్‌ఫైనల్లో వరుస గేముల్లోనే గెలుపొందాడు. తొలి గేమ్‌లో 9-9తో సమవుజ్జీలుగా నిలిచిన సమయంలో వరుసగా ఐదు పాయింట్లు సాధించిన ప్రణయ్ ముందంజ వేశాడు. 16-16, 18-18 వద్ద మరోసారి కొడాయ్ స్కోరు సమం చేసినా.. చివర్లో వరుస పాయింట్లతో ప్రణయ్ తొలి గేమ్ గెల్చుకున్నాడు. ఇక కీలక రెండో గేమ్‌లో కొడాయ్ గట్టిగా పోరాడాడు. 9-12తో ఓ దశలో ప్రణయ్ వెనుకంజలో నిలిచాడు. 12-12తో స్కోరు సమం చేసిన ప్రణయ్ ద్వితీయార్ధంలో దూసుకెళ్లాడు. 17-16తో మ్యాచ్ ఉత్కంఠ రేపగా.. వరుస పాయింట్లతో రెండో గేమ్‌ను, సెమీఫైనల్స్ బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్ నిరాశపరిచాడు. 14-21, 21-14, 12-21తో మూడు గేముల మ్యాచ్‌లో ఓటమి పాలయ్యాడు. చైనా షట్లర్ లి షి ఫెంగ్ తొలి, మూడో గేములు గెలుపొంది సెమీఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు.



పురుషుల డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ టాప్ సీడ్‌పై గెలుపొందారు. 41 నిమిషాల మ్యాచ్‌లో 21-13, 21-13తో భారత జోడీ మెరుపు విజయం సాధించింది. తొలి గేమ్‌లో 6-6 అనంతరం ఇండోనేషియా జోడీ నుంచి మనోళ్లకు పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. వరుస పాయింట్లతో సాత్విక్, చిరాగ్ అదరగొట్టారు. రెండో గేమ్‌లోనూ పరిస్థితి పెద్దగా మారలేదు. 7-7 వరకు ఇండోనేషియన్లు పోటీ ఇచ్చారు. ఆ తర్వాత సాత్విక్, చిరాగ్ దూకుడుకు చేతులెత్తేశారు.



రోహిత్‌కు విశ్రాంతి?!


- జూన్ 27న టెస్టు జట్టు ఎంపిక
- భారత జట్టు కరీబియన్ పర్యటన

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో విరామం లేకుండా ఆడుతూ.. జాతీయ జట్టు తరఫున ఆడేందుకు విశ్రాంతి తీసుకునే సంప్రదాయం కొనసాగించేందుకు బీసీసీఐ మొగ్గు చూపుతుంది!. ద్వైపాక్షిక సిరీస్‌లలో కీలక ఆటగాళ్లు లేకపోవటంతో యువ క్రికెటర్లు అవకాశాలు అందిపుచ్చుకుని రాణిస్తున్నారు. కానీ మెగా ఈవెంట్లకు జట్లను ఎంపిక చేసే సమయంలో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో రాణించిన ఆటగాళ్లను పక్కనపెట్టి, సీనియర్ క్రికెటర్లను జట్టులోకి ఎంపిక చేస్తున్నారు. ఈ విధానంతో భారత క్రికెట్‌కు తీరని అన్యాయం జరుగుతున్నా.. బీసీసీఐ పెద్దలు పునరాలోచన చేయటం లేదు. జాతీయ జట్టు షెడ్యూల్‌లో విశ్రాంతి కోరుకునే క్రికెటర్లపై మాజీలు సైతం విమర్శలు గుప్పిస్తున్నా.. పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండటం లేదు. తాజాగా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ముగిసింది. భారత జట్టు తదుపరి సవాల్‌కు సరిగ్గా నెల రోజుల సమయం చిక్కింది. జులై 12 నుంచి వెస్టిండీస్ జట్టుతో టీమ్ ఇండియా టెస్టు సమరం షురూ కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ అనంతరం భారత క్రికెటర్లు విరామం తీసుకుంటున్నారు. అయినా, కరీబియన్ పర్యటన నుంచి కొంతమంది క్రికెటర్లు విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి.

రహానెకు పగ్గాలు! : కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిలు కరీబియన్ పర్యటనలో కొంత సమయం విశ్రాంతి తీసుకునే అవకాశం కనిపిస్తుంది. రోహిత్ శర్మ అటు ఐపీఎల్‌లో, ఇటు డబ్ల్యూటీసీ ఫైనల్లో పెద్దగా రాణించలేదు. విరాట్ కోహ్లి ఫర్వాలేదనిపించినా.. స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. మరో మెగా ఫైనల్లో అంచనాలను చేరుకోలేదు. రెండు టెస్టుల్లో ఆడితే.. మూడు వన్డేలు, ఐదు టీ20ల నుంచి విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంది. లేదంటే వైట్‌బాల్ ఫార్మాట్‌లో ఆడితే.. రెడ్‌బాల్ సిరీస్‌కు దూరం కానున్నారు. దీనిపై సీనియర్ సెలక్షన్ కమిటీ కెప్టెన్ రోహిత్ శర్మతో మాట్లాడే అవకాశం ఉంది. రోహిత్, విరాట్‌తో మాట్లాడిన అనంతరం సెలక్షన్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. రోహిత్ శర్మ టెస్టులకు దూరమైతే అజింక్య రహానెకు తాత్కాలిక సారథ్య పగ్గాలు దక్కనుండగా.. వైట్‌బాల్ సిరీస్‌లో హార్దిక్ పాండ్య వన్డేలు, టీ20ల్లో ముందుండి నడిపించనున్నాడు. పేలవ ఫామ్‌తో విమర్శలు ఎదుర్కొంటున్న చతేశ్వర్ పుజార జట్టులో చోటు గల్లంతు చేసుకునే ప్రమాదంలో పడ్డాడు. రోహిత్, విరాట్‌లకు విశ్రాంతి దక్కితే.. పుజారకు మరో అవకాశం లభించినట్టే చెప్పవచ్చు!. వెస్టిండీస్ పర్యటనలో భారత్ రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. జూన్ 27న భారత జట్లను ఎంపిక చేసే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాల సమాచారం.

విహారి, తిలక్‌పైనే ఫోకస్!

దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ జట్టు



బెంగళూర్ : భారత టెస్టు జట్టు విదేశీ పర్యటనల్లో కచ్చితంగా చోటు సాధించే ఆటగాడు హనుమ విహారి. విదేశీ గడ్డపై మంచి రికార్డున్న హనుమ విహారి ఇటీవల ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ జట్టుకు ఎంపిక కాలేదు. భారత జట్టు జులైలో కరీబియన్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో టెస్టు జట్టులోకి పునరాగమనం చేసేందుకు హనుమ విహారి ఎదురు చూస్తున్నాడు. ఇదే సమయంలో టెస్టులతో పాటు వన్డే, టీ20 జట్టులో చోటుపై కన్నేసిన యువ క్రికెటర్ తిలక్ వర్మ దులీప్ ట్రోఫీలో సెలక్టర్లను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నాడు. బెంగళూర్‌లో జరుగనున్న దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ జట్టును ఎంపిక చేశారు. హనుమ విహారి కెప్టెన్సీ వహించనుండగా.. మయాంక్ అగర్వాల్ వైస్ కెప్టెన్‌గా ఉండనున్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్ జులై 12 నుంచి చిన్నస్వామి స్టేడియంలో జరుగనుంది.

సౌత్ జోన్ జట్టు : హనుమ విహారి (కెప్టెన్), మయాంక్ అగర్వాల్ (వైస్ కెప్టెన్), బి. సాయి సుదర్శన్, రికీ భుయ్ (వికెట్ కీపర్), కె.ఎస్ భరత్ (వికెట్ కీపర్), ఆర్ సమరత్, వాషింగ్టన్ సుందర్, సచిన్ బేబి, రంజన్ పాల్, సాయి కిశోర్, కావేరప్ప, విజయ్‌కుమార్ వైశాక్, కెవి శశికాంత్, దర్శన్ మిశాల్, తిలక్ వర్మ.

నవచిత్రం

ఆదిపురుష్ కలెక్షన్స్ అదుర్స్



ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అంచనాల మధ్య శుక్రవారం రిలీజ్ అయిన సినిమా ఆదిపురుష్. బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ దర్శకత్వంలో రామాయణం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. రెబల్‌స్టార్ ప్రభాస్ రాముడిగా, కృతి సనన్ సీతగా నటించిన ఈ సినిమా విడుదలకు ముందే ప్రీ రిలీజ్ బిజినెస్ ద్వారా అనేక రికార్డులను బద్దలు కొట్టింది. విడుదలైన దగ్గర నుంచి సూపర్ కలెక్షన్స్ సొంతం చేసుకుంటోంది. రూ.550 కోట్ల భారీ బడ్జెట్‌తో వచ్చిన ఈ సినిమాకి మార్నింగ్ షో నుంచే మంచి రెస్పాన్స్ వస్తూ ఉండటంతో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సక్సెస్ మీట్‌కి యు.వి. క్రియేషన్స్ వంశీకృష్ణ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ శశి మాట్లాడుతూ... మేము మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్.ఎల్.పి వైజాగ్‌లో పెట్టి ఇంచుమించు ఇది ఆరో నెల. మేము ఆదిపురుష్ సినిమా మా ప్రయత్నం చేస్తే వచ్చింది అనే దానికన్నా, ఆ రాముడు భక్తుడిగా మా మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్లను ఎంచుకున్నారు అనేది మా నమ్మకం. ఈ జనరేషన్‌లో ప్రతి ఒక్కరికి, ప్రతి ఒక్క సినీ ప్రేక్షకుడికి ఇలాంటి గొప్ప సినిమా తీసుకెళ్లడానికి మాకు గొప్ప అవకాశం ఇచ్చారు ఆ రాముడు అని మేము భావిస్తున్నాం. మా మైత్రి నవీన్ కూడా ఈ సినిమా యూఎస్ లో చూసి, శశి చాలా బాగుంది అని చెప్పారు. ఈ సినిమా ఖచ్చితంగా నైజంలో టాప్ త్రీ మూవీస్‌లో ఒకటి అవుతుందని గట్టిగా నమ్ముతున్నాను. ప్రతి దగ్గర నుంచి ఒకటే మెసేజెస్, కాల్స్ వస్తున్నాయి. ఈ సినిమా సూపర్ హిట్ అవుతుంది అని అంటున్నారు. ఫ్యామిలీస్ కూడా ఎక్కువగా వస్తున్నారు. మాట్నీ నుంచే 30 శాతం ఫ్యామిలీస్, లేడీస్ సినిమాకి వస్తున్నారని అంటున్నారు. సాధారణంగా ఆదివారం నుంచి ఫ్యామిలీ ఆడియన్స్ వస్తారు. కానీ ఈ సినిమాకి మొదటి రోజు నుంచే ఫ్యామిలీస్ రావడం అనేది రామాయణం గొప్పతనం. ప్రతి దగ్గర నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మరీ ముఖ్యంగా ప్రతి దగ్గర హౌస్ ఫుల్ అవుతుంది. నైజాంలో మల్టీప్లెక్స్ పరంగా చూస్తే 1000 స్క్రీన్‌కి పైగా ప్రదర్శించిన సినిమా ఇదే. ఇంతకుముందు ఏ సినిమాకు కూడా ఇలా జరగలేదు. ఖచ్చితంగా ఫస్ట్ వీక్ ఆల్ టైం రికార్డ్ ఈ సినిమా సాధిస్తుందని మేం భావిస్తున్నాం. ఈ అవకాశం నాకు ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు" అని తెలియజేశారు.

పీపుల్స్ మీడియా కృతి ప్రసాద్ మాట్లాడుతూ "మీరు ఇచ్చిన సపోర్ట్‌కి ధన్యవాదాలు. మీరు ఇంకా ఈ సినిమా చూడకపోతే తప్పకుండా మీ ఫ్యామిలీతో కలిసి థియేటర్స్‌లో ఈ సినిమా చూడండి" అని తెలియజేశారు.

వివేక్ కుచిబొట్ల మాట్లాడుతూ.. "ఈ సినిమా మాకు రావడానికి ముఖ్య కారణమైన వంశీకి, విక్కీకి, ప్రమోద్‌కి ప్రత్యేకమైన ధన్యవాదములు. అలాగే ఈ సినిమా మేం చేసిన వెంటనే ప్రభాస్‌ని కలిసినప్పుడు ఆయన ఒక కొత్త టైపులో ట్రై చేశాం, త్రీడీలో చాలా బాగుంటుంది అని చెప్పారు. ఇక ఈరోజు సేమ్ అన్ని ఏరియాస్ నుంచి ప్రేక్షకులు అదే చెప్తున్నారు. త్రీడీ చాలా ఎంజాయ్ చేస్తున్నామని తెలియజేస్తున్నారు. ఈ సినిమాకి ఎక్కడా లేనన్ని మార్నింగ్ షోలు, ఎర్లీ మార్నింగ్ షోస్ పడ్డాయి. ప్రతి షో హౌస్ ఫుల్ అయింది. రామాయణం సినిమాకి ఫాన్స్ నుంచి ఇంత సపోర్ట్ రావడం సంతోషం. అందరూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఒక అవెంజర్స్, ఒక హాలీవుడ్ సినిమా ఎలా ఉంటుందో అంతా గొప్పగా గ్రాఫిక్స్ తో ఈ సినిమాని దర్శకుడు తీశారు. మన రామాయణ కథ తర్వాత తరాల వారికి అలానే ఇప్పుడు జనరేషన్‌కి చాలా సులభంగా అర్థమయ్యేలాగా తీసి దర్శకుడు గొప్ప ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నానికి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇది మనం సాధించిన అచీవ్ మెంట్" అని తెలియజేశారు.

1920 రిలీజ్‌కి రెడీ



లెజెండరీ ఫిల్మ్ మేకర్ మహేష్ భట్ సమర్పణలో ఆయన స్వీయ రచనలో రూపొందిన హారర్ మూవీ "1920 : హారర్స్ ఆఫ్ ది హార్ట్". అవికా గోర్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రానికి కృష్ణ భట్ దర్శకత్వం వహించారు. విక్రమ్ భట్ ప్రొడక్షన్‌పై రాకేష్ జునేజా, శ్వేతాంబరీ భట్ డా. రాజ్‌కిషోర్ ఖవ్రే నిర్మించారు. జూన్ 23న ఈ చిత్రం తెలుగు విడుదల కానున్న నేపథ్యంలో కింగ్ అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కింగ్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. 'మహేష్ భట్‌ని కలిసి దాదాపు ఇరవై ఏళ్ళయింది. ముంబై షూటింగ్స్‌కి వెళితే భట్ గురించి అడుగుతుంటాను. బ్రహ్మాస్త్ర సినిమాలో అలియా భట్‌తో వర్క్ చేశాను. ఆ సమయంలో భట్ గురించి ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. భట్ నాకు చాలా స్ఫూర్తిని ఇచ్చే వ్యక్తి. ఎంతో మందికి అవకాశాలు ఇచ్చి దారి చూపించారు. ఆయన పాటలు చేయించుకునే విధానం అద్భుతంగా వుంటుంది. ఇప్పటికీ 'తెలుసా మనసా' పాట చేయించిన విధానం గుర్తుకు వస్తుంటుంది. అలాగే 'జకమ్' లో గలీ మే ఆజ్ చాంద్ నిక్లా పాట నా ఆల్ టైమ్ ఫేవరెట్. ఆ జ్ఞాపకాలన్నీ గుర్తుకు వస్తున్నాయి. 1920 ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది. వెయ్యికి పైగా స్క్రీన్స్‌లో సినిమా విడుదలవుతుంది. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. నాకు హారర్ సినిమాలు చూడాలంటే భయం. కానీ ఈ సినిమా చూడాలనిపిస్తుంది. చూడాలనిపించేలా చేశారు. హారర్ సినిమాలు చూసినప్పుడు ఆ కిక్కే వేరు. అవికా గోర్ డిఫరెంట్ పాత్రలు చేస్తుంది. ఈ సినిమా తన కెరీర్‌లో పెద్ద హిట్ కావాలి. జూన్ 23న ఈ సినిమా వస్తోంది. ఆదిపురుష్ మూవీ రిలీజ్ సందర్భగా ప్రభాస్ అండ్ టీంకి ఆల్ ది బెస్ట్" అన్నారు.

మహేష్ భట్ మాట్లాడుతూ.. నాగార్జునని చాలా రోజుల తర్వాత కలవడం ఆనందంగా వుంది. నాగార్జున వల్ల ఈ సినిమాని తెలుగు విడుదల చేయడం సాధ్యపడింది. ఆయనకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. విక్రమ్ భట్ ఈ చిత్రానికి చాలా హార్డ్ వర్క్ చేశారు. ఈ చిత్రానికి సరికొత్త టెక్నాలజీని వాడాం. అవికా గోర్, కృష్ణ, విక్రమ్ అందరూ కలిసి మంచి టీం వర్క్ చేశారు. నాగార్జునతో క్రిమినల్ సినిమా చేస్తున్న రోజులు గుర్తుకు వస్తున్నాయి. నాగార్జున వాళ్ళ నాన్న విలువలు, సంస్కారాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. వాటిని కాపాడుకోవడం చాలా ముఖ్యం. 1920 కథ కూడా దీని గురించే. మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుందని నమ్ముతున్నాను" అన్నారు.

అవికా గోర్ మాట్లాడుతూ.. నాగార్జున నా మొదటి సినిమా ఉయ్యాల జంపాల నుంచి నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు నా తొలి హిందీ చిత్రం 1920 ట్రైలర్ లాంచ్‌కి ఆయన రావడం చాలా ఆనందంగా వుంది. నాగార్జునకు కృతజ్ఞతలు. 1920 చాలా స్పెషల్ మూవీ. ఇప్పటివరకూ నేను చేయని జోనర్ సినిమా ఇది. ఎమోషన్ డ్రామా అన్నీ వుంటాయి. అందరూ థియేటర్‌లో చూసి ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను.

కృష్ణ భట్ మాట్లాడుతూ.. 1920 నా మనసు నుంచి వచ్చిన చిత్రం. ఇదొక ఎమోషనల్ స్టోరీ. హారర్‌లో ఎమోషన్ ప్రయత్నించడం ఇదే తొలిసారి. ఖచ్చితంగా ఇది అందరికీ నచ్చుతుందనే నమ్మకం వుంది" అన్నారు.

గుడిసె వాసులపై పోలీసుల దాడి అమానుషం..

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు సీపీఐ(ఎం)వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై పోలీసులు అమానుషంగా దాడిచేసి జేసీబీ, డోజర్లు పెట్టి గుడిసెలు నేలమట్టం చేశారనీ, అడ్డుకున్న 60 మంది మహిళలను విఫరీతంగా కొట్టి గాయపరిచారనీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య, డీజీ నర్సింహారావు, రాష్ట్ర నాయకులు జి రాములు, ఆర్ వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 255 సర్వేనంబర్‌లో 220 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందనీ, అందులో 50 ఎకరాల్లో రాళ్ళు, బోళ్ళు ఉన్నాయని తెలిపారు. దానిలో 50 ఎకరాలు ప్రభుత్వం కొందరికి అసైన్డ్ చేసిందని పేర్కొన్నారు. ఆయా భూములను అసైన్‌దారులు అమ్ముకున్నారని తెలిపారు. అదే సర్వే నెంబర్‌లో మరో 50 ఎకరాలను రియల్ ఎస్టేట్ వారు ఆక్రమించారని పేర్కొన్నారు. ప్లాట్లు చేసి అమ్మకుంటుండగా ఆ భూమిలో సీపీఐ(ఎం) అధ్వర్యంలో మూడు వేల మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని అమ్ముతుంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు. తీసుకోలేదని గుర్తుచేశారు. కానీ పేదలు గుడిసెలు వేస్తే వాటిని ప్రభుత్వం మూడు సార్లు తొలగించిందనీ, 30 మంది మీద బైండోవర్ కేసులు, సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శితో పాటు మరో 10 మంది మీద రెండు నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జైలుపాలు చేసిందని తెలిపారు. గుడిసెలు వేసుకున్న పేదలంతా తమకు ఆ భూమిలో ఉండ్ల స్థలాలు, వాటికి పట్టాలివ్వాలని అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నా పట్టించుకోవటం లేదని తెలిపారు. ఆయా భూములను దోబీఘాట్‌కు కేటాయించినట్టు బుకా యిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా పేదలు ఎన్నో అవస్థలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాలుగో సారి పేదలు గుడిసెలను వేసుకుని నివాసముంటుండగా మంగళవారం ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్, ఫారెస్ట్, ఎక్సైజ్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఒక్కసారిగా దాడి చేసి గుడిసెవాసులపై విపరీతంగా లాఠీఛార్జీ చేశారని తెలిపారు. ఈ క్రమంలో 60 మంది గాయపడ్డారని తెలిపారు. డోజర్లు, జేసీబీలతో గుడిసెలన్నింటినీ నేలమట్టం చేసి వారి బియ్యం, కూరగాయలు, వంట సామాన్లు, బట్టలు, ఇతర నిత్యావసరాలను నేలపాలు చేసినారని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిపర్‌జోయ్ బీభత్సం!



- గుజరాత్ తీర ప్రాంతాల్లో పెను విధ్వంసం
- వేలాదిగా కూలిన విద్యుత్ సంభాలు
- వెయ్యి గ్రామాలు అంధకారంలోనే
- కూకటి వేళ్లతో కూలిన మహా వృక్షాలు
- యుద్ధ ప్రాతిపదికన సహాయ, పునరుద్ధరణ పనులు
- ముఖ్యమంత్రికి ప్రధాని ఫోన్

కచ్ : గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుజరాత్ తీరాన్ని దాటిన బిపర్‌జోయ్ (బిపర్‌జోయ్ అంటే బెంగాలీలో విపత్తు అని అర్థం) తుపాను కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలకు పెను విధ్వంసాన్ని మిగిల్చింది. ముఖ్యంగా విద్యుత్ రంగం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. వందలాది విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వెయ్యికి పైగా గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. తుపాను తీరం దాటిన తర్వాత ఈదురు గాలులు, కుండపోత వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తీర ప్రాంతాల్లో పలుచోట్ల వరదలు ముంచెత్తుతున్నాయని అధికారులు శుక్రవారం తెలిపారు. తుపాను కారణంగా ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. అధికార యంత్రాంగం సాధించిన అతిపెద్ద విజయం అదేనని సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఆర్థికంగా మాత్రం రాష్ట్రానికి పెను నష్టాన్ని కలిగించిందన్నారు. ముఖ్యంగా విద్యుత్ రంగానికి జరిగిన నష్టం తీవ్రంగా వుందన్నారు. 5,120 విద్యుత్ స్తంభాలు తుపానుకు దెబ్బతిన్నాయి. వాటిని పునరుద్ధరించే చర్యలు ప్రారంభమయ్యాయని రాష్ట్ర రిలీఫ్ కమిషనర్ అలోక్ కుమార్ పాండే తెలిపారు. మొత్తంగా 4,600 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కొరవడిందని, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడంతో 3,580 గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించామని చెప్పారు. మిగిలిన గ్రామాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మోర్బీలోని మలియా తాలుకాలో రెండు విద్యుత్ స్టేషన్లను కూడా మూసివేయాల్సి వచ్చింది. మూడు రాష్ట్ర హైవేలను మూసివేసినట్లు చెప్పారు. మహా వృక్షాలు సైతం కూకటి వేళ్లతో సహా నేల కూలి రోడ్లకు అడ్డంగా పడడంతో మూసివేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికి అందిన వార్తలను బట్టి మొత్తంగా 800 వృక్షాలు నేలకూలాయి. దాదాపు 30 ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరో 500 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను తొలగించి రోడ్లను రాకపోకలకు అనువుగా మార్చడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

తుపాను వల్ల నష్టపోయిన వారికి తక్షణమే నష్టపరిహారం అందేలా చూస్తున్నామని పాండే చెప్పారు. తుపాను తీరం దాటినా ప్రచండ వేగంతో గాలులు వీస్తున్నందున ప్రజలు ఇళ్లవద్దనే వుండాలని భుజ్ అధికారులు కోరారు. బలహీనపడిన తుపాను రాజస్థాన్ దిశగా పయనించడంతో అక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుపాను ప్రభావాన్ని, కలిగించిన నష్టాన్ని ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ శుక్రవారం అధికారులతో కలిసి సమీక్షించారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు, ఇతర సహాయక చర్యలు సాగుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. 18వ తేదీ వరకు 99 రైళ్లను రద్దు చేశారు.

ముఖ్యమంత్రితో మాట్లాడిన ప్రధాని మోడీ

సిఎం భూపేంద్ర పటేల్‌తో ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గిర్ అడవుల్లో సింహాలతోసహా వన్యప్రాణులకు చేపట్టిన భద్రతా ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే మంత్రి రైల్వే ట్రాక్‌ల నిర్వహణ, ఇతర అంశాలపై అధికారులతో మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్

టెన్త్ విద్యార్థిపై పెట్రోల్ పోసి...

- ఏపీలో దారుణం..



చెరుకుపల్లి గ్రామీణం: బాపట్ల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. పదో తరగతి విద్యార్థి అమర్నాథ్‌పై స్నేహితుడే పెట్రోల్ పోసి నిప్పంటించారు. చెరుకుపల్లి మండలం రాజోలులో ఈ ఘటన జరిగింది. ఉదయం ట్యూషన్‌కు వెళ్లొస్తుండగా బాలుడి స్నేహితుడు వెంకటేశ్వరరెడ్డి మరికొందరితో కలిసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన అమర్నాథ్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.

వివరాల్లోకి వెళితే.. చెరుకుపల్లి మండలం రాజోలు పంచాయతీ పరిధి ఉప్పలవారిపాలెంకి చెందిన ఉప్పల అమర్నాథ్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రోజూ ఉదయం రాజోలులో ట్యూషన్‌కి వెళుతున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం వెళుతుండగా మార్గంమధ్యలో రెడ్లపాలెం వద్ద అమర్నాథ్ స్నేహితుడు వెంకటేశ్వరరెడ్డి మరి కొందరితో కలిసి అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు.

మంటల అంటుకొని బాలుడు హాహాకారాలు చేస్తుండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే మంటలు ఆర్పి అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. తనపై వెంకటేశ్వర్‌రెడ్డి, మరికొందరు పెట్రోల్ పోసి నిప్పంటించారని మృతికి ముందు పోలీసులకు అమర్నాథ్ వాంగ్మూలం ఇచ్చాడు. ఈ ఘటనపై చెరుకుపల్లి ఎస్సై కొండారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమర్నాథ్ సోదరిని వెంకటేశ్వరరెడ్డి వేధిస్తున్నాడని మృతుడి తాత రెడ్డయ్య అన్నారు. దీనిపై అమర్నాథ్ నిలదీయడంతోనే వెంకటేశ్వరరెడ్డి కక్ష పెంచుకుని ఈ ఘటనకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు.

'గోవిందరాజస్వామి' సమీపంలో అగ్నిప్రమాదం

తిరుపతి: తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గోవిందరాజస్వామి ఆలయం సమీపంలోని లావణ్య ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణంలో విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగిసిపడడంతో ఆలయ యాత్రికులు, దుకాణాదారులు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. భవనం ముందున్న ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. పరిసర ప్రాంతాల్లోని షాపులన్నీ మూసివేయడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో దాదాపు రూ.50 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, టీటీడీ ఎవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌ను సకాలంలో ఛేదించాం

- డీజీపీ కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి

అమరావతి: విశాఖపట్నం వైసీపీ ఎంపీ ఎంవివి సత్యనారాయణ భార్య, కుమారుడు, ఆడిటర్ కిడ్నాప్ కేసులో పోలీసులు సకాలంలో స్పందించి కిడ్నాప్‌కు గురైనవారిని విడిపించినట్టు డీజీపీ కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కిడ్నాప్ ఘటనను రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యగా చూడొద్దని, పోలీస్‌శాఖ అప్రమత్తంగా వుండటం వల్లనే గంటల వ్యవధిలో ఈ కేసును ఛేదించగలిగామని అన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నం జ్యోతి, ఆమె కుమారుడు శరత్, ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు కిడ్నాప్ వ్యవహారంలో నిందితులు రూ.1.75 కోట్ల నగదును వసూలు చేశారని తెలిపారు. కిడ్నాపర్‌లను అరెస్టు చేశాక, వారి నుంచి ఇప్పటివరకు రూ 86.5 లక్షలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు హేమంత్, రాజేష్, సాయి కలిసి ఎంపీ కుమారుడు శరత్ ఇంటికి వెళ్లి నిర్బంధించి ఇంట్లో వున్న రూ.15 లక్షలు తీసుకుని, బ్యాంకు ఖాతా నుంచి మరో రూ.60 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత శరత్ ద్వారానే తల్లి జ్యోతిని, ఆడిటర్ వెంకటేశ్వరరావును రప్పించి కోటి రూపాయలను రాబట్టారన్నారు. మొత్తం రూ1.75 కోట్లను తీసుకున్నారని డీజీపీ తెలిపారు. డబ్బు కోసమే నిందితులు ఈ కిడ్నాప్ చేశారన్నారు. కిడ్నాప్ సమాచారం అందగానే పోలీసులు ఈ కేసును ఛేదించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. మొదట కిడ్నాపర్లు రుషికొండ ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం తెలిసిన వెంటనే వారిని వెంబడించారు. ఎంపీ భార్య, కుమారుడు, ఆడిటర్‌ను తీసుకుని వారు కారులో పరారయ్యేందుకు ప్రయత్నించారని తెలిపారు. పద్మనాభం ప్రాంతంలో కిడ్నాపర్ల కారు మరమ్మతుకు గురవ్వడంతో కిడ్నాప్ చేసిన ముగ్గుర్నీ అక్కడే వదిలేసి పరారయ్యారని డిజిపి పేర్కొన్నారు. రాష్ట్రంలో గత నాలుగేండ్లలో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. గంటల వ్యవధిలోనే కిడ్నాపర్లను పట్టుకోవడమే కాదు.. వారి నుంచి రూ.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. హేమంత్‌కు నేర చరిత్ర వుందని తెలిపారు. కిడ్నాపర్లు కట్టేసి కొట్టడంతోపాటు కత్తి చూపి చంపుతామని బెదిరించారని, నిందితులపై పిడి యాక్టును ప్రయోగిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల మరణాలపై 48 గంటల్లో నివేదిక అందించాలి

- వీసీకి గవర్నర్ ఆదేశం

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో వరుసగా జరిగిన ఇద్దరు విద్యార్థినుల మరణాలపై 48 గంటల్లో సమగ్ర నివేదిక అందించాలని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణకు గురువారం గవర్నర్ తమిళిసై ఆదేశాలు జారీ చేశారు. యూనివర్సిటీ విద్యార్థులు అధైర్య పడకూడదని, సమస్యలను ఎదుర్కొని ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తిచేయాలని సూచించారు. భవిష్యత్తులో యూనివర్సిటీలో ఇలాంటి దురదృకర ఘటనలు చోటుచేసుకోకుండా యూనివర్సిటీ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో కూడిన నివేదిక అందజేయాలని గవర్నర్ కోరారు.

23 నుంచి నీట్‌పై ఉచిత అవగాహన తరగతులు

నవ తెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏటా జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ రాతపరీక్షలో తొలి ప్రయత్నంలోనే ఎలా విజయం సాధించాలనే అంశంపై ఈనెల 23 నుంచి 25 వరకు మూడురోజులపాటు ఉచిత అవగాహన తరగతులను నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమి డైరెక్టర్ మనోకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా బాలబాలికల కోసం ఉచిత హాస్టల్ వసతితో మొదటి 60 మందికి నిర్వహించే ఈ తరగతుల్లో నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, మెంటార్‌షిప్, టెస్ట్ సిరీస్, తదితరు నూతన సన్నద్ధత విధానాన్ని వివరిస్తామని పేర్కొన్నారు. నీట్ ర్యాంకర్లు, సీనియర్ అధ్యాపకులు, విషయ నిపుణులు పాల్గొని సూచనలు, సలహాలిస్తారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన బాలబాలికలు ఈ తరగతులను వినియోగించుకోవాలని సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ మేరకు టాస్ డైరెక్టర్ పివి శ్రీహరి ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ పదో తరగతిలో 30,564 మంది పరీక్షలు రాయగా, 15,193 (49.71 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఇంటర్మీడియెట్‌లో 42,026 మంది పరీక్షలు రాస్తే, 19,813 (47.14 శాతం) మంది పాసయ్యారని తెలిపారు. మార్కుల మెమోలను 15 రోజుల్లో సంబంధిత కేంద్రాలను పంపిస్తామని పేర్కొన్నారు. ఒఒఒ.వశ్రీఖఅస్తుఖఖశీజూవఅం్ణ్రశీశీశ్రీ.శీతీస్త్ర వెబ్‌సైట్ ద్వారా మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రీకౌంటింగ్ కోసం ఇంటర్ విద్యార్థులు రూ.400, టెన్త్ విద్యార్థులు రూ.350, రీవెరిఫికేషన్ కోసం ఇంటర్, టెన్త్ విద్యార్థులు రూ.1,200 చెల్లించాలని తెలిపారు.

తెలంగాణ వర్సిటీ పరిణామాలపై ప్రభుత్వ పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ)లో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం పరిశీలిస్తున్నదని కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. కొన్ని ఫైళ్లను వర్సిటీ నుంచి ఎత్తుకెళ్తుంటే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారని అన్నారు. కొన్ని అవినీతి, అక్రమాలకు సంబంధించి ఆధారాలున్నాయని, వాటిని ప్రభుత్వానికి పంపించామని వివరించారు. అయితే ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని చెప్పారు. గవర్నర్, వర్సిటీల చాన్సలర్‌కు వీసీని తొలగించే అధికారముందన్నారు. అయితే ప్రభుత్వం సిఫారసు చేయాల్సి ఉంటుందని అన్నారు.

మాటే మంత్రం...

- ఓయూలో 20 నుంచి వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మాట... నవరసాలనూ రక్తికట్టించే అద్భుత శక్తి. ఆ మాటకు శిక్షణ ఇచ్చి భావాన్ని వ్యక్తీకరిస్తే, జనం గుండెల్లో పదికాలాలు పదిలంగా నిలిచిపోతుంది. సురభి కళాక్షేత్రం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, డీడీఎమ్ఎస్ లిటరసీ హౌస్ సంయుక్తాధ్వర్యంలో 'మాటకు...స్వరానికి' శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉస్మానియా యూనివర్సిటీలోని డీడీఎమ్ఎస్ లిటరసీ హౌస్‌లో ఈనెల 20 నుంచి వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్, సీజన్-2 నిర్వహిస్తున్నారు. రేడియో జాకీ, వాయిస్ అండ్ యాక్టింగ్ ట్రైనర్ డాక్టర్ సురభి రమేష్ నేతృత్వంలో ఈ వర్క్‌షాప్ జరుగుతుంది. వాయిస్ కల్చర్‌కు అనేక రంగాల్లో అద్భుత అవకాశాలు ఉన్నాయనీ, దానికి సరైన ప్లాట్‌ఫామ్‌ను ఎంచుకోవడం తెలిసి ఉండాలని ఈ సందర్భంగా సురభి రమేష్ తెలిపారు. ఈ వర్క్‌షాప్ ద్వారా అలాంటి అవకాశాలు తెలుసుకోవడంతో పాటు స్వర విన్యాస సాధన సులభమవుతుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 9490423885, 6309413885 సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో టీ-9 టిక్కెట్

- రూ.100కు 60 కి.మీ., అప్ అండ్ డౌన్ ప్రయాణం
- పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు, సీనియర్ సిటిజన్లకు వర్తింపు
- రేపటి నుంచి అమల్లోకి...



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రమే అమల్లో ఉన్న ట్రావెల్ యాజ్ యు లైక్ (టీవైఎల్) టిక్కెట్లు ఇకపై గ్రామీణ, పట్టణ ప్రాంతాలకూ విస్తరించనున్నాయి. తొలి దశలో పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు, సీనియర్ సిటిజన్లకే ఈ టిక్కెట్లను అందుబాటులోకి తెస్తున్నారు. పల్లె వెలుగు బస్సుల్లో రూ.100 పెట్టి టీ-9 టిక్కెట్‌ను కొనుగోలు చేస్తే 60 కిలోమీటర్ల పరిధిలో రానూ పోనూ ప్రయాణం చేయవచ్చు. ఆదివారం (ఈనెల 18వ తేదీ) నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఈ టిక్కెట్లు అందుబాటులోకి రానున్నాయని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. శుక్రవారంనాడిక్కడి బస్‌భవన్‌లో టీ-9 టిక్కెట్ల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పల్లె వెలుగు బస్సుల్లో కండక్టర్ల వద్ద ఈ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ టిక్కెట్ తీసుకున్న మహిళలు, సీనియర్ సిటిజన్స్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు 60 కిలోమీటర్ల పరిధిలో ఒక్కసారి రానూపోను ప్రయాణం చేయవచ్చని వివరించారు. దీనివల్ల గ్రామీణ ఆర్టీసీ ప్రయాణీకులకు ఒక్కొక్కరికి రూ.20 నుంచి రూ.40 ఆదా అవుతుందన్నారు. ఈ టిక్కెట్లకు టోల్‌గేట్ చార్జీలు ఉండవు. వాటిని మినహాయించినట్టు సజ్జనార్ తెలిపారు. 60 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు వయసు ధృవీకరణ కోసం ఆధార్ కార్డును కండక్టర్లకు చూపించాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఈ టికెట్లను కండక్టర్లు ఇస్తారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోనే ఈ టికెట్లు చెల్లుబాటు అవుతాయి. 'పల్లె వెలుగు బస్సుల్లో ప్రతి రోజు సగటున 15 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అందులో మహిళలు, సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ఉన్నారు. వారికి ఆర్థికభారం తగ్గించాలనే ఉద్దేశంతోనే పల్లెవెలుగు బస్సుల్లో 'టి-9 టికెట్‌'ను అందుబాటులోకి తెచ్చాం' అని ఎమ్‌డీ సజ్జనార్ వివరించారు. ఇతర వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)లు, పీవీ మునిశేఖర్, పురుషోత్తం, కృష్ణకాంత్, సీటీఎం జీవన్‌ప్రసాద్, సీఎంఈ రఘునాథరావు, సీఈఐటీ రాజశేఖర్, సీఎఫ్ఎం విజయపుష్ప తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో మణిపూర్!

- కేంద్ర మంత్రి ఇంటికి నిప్పంటించిన ఆందోళనకారులు
- గిడ్డంగిని తగలబెట్టిన అల్లరి మూక



ఇంఫాల్ : మణిపూర్‌లో హింస కొనసాగుతూనే వుంది. తాజాగా శుక్రవారం కూడా పలు ఘర్షణలు చెలరేగాయి. ఇంఫాల్ ఈస్ట్ జిల్లా కొంగ్బా వద్ద గల కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఆర్.కె.రంజన్‌సింగ్‌కి చెందిన ఇంటిని గురువారం రాత్రి ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఇంటిని చుట్టుముట్టిన ఆందోళనకారులు ఇంటి ఆవరణలోని కొన్ని కార్లు, ద్విచక్ర వాహనాలతో సహా మొత్తంగా ఇంటిని తగలబెట్టారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఔట్‌హౌస్ పూర్తిగా కాలిపోగా, సకాలంలో అగ్నిమాపక యంత్రాలు రావడంతో ప్రధాన ఇల్లు పూర్తిగా తగలబడకుండా కాపాడగలిగారు. పోలీసులు, పేరా మిలటరీ బలగాలు వెంటనే మంత్రి ఇంటికి చేరుకుని ఆందోళనకారులను చెల్లాచెదురుచేశారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. మణిపూర్‌లో ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అందువల్ల వారి పట్ల రాష్ట్ర ప్రజలు చాలా అసంతృప్తిగా వున్నారని ఆందోళనకారులు తెలిపారు.

శుక్రవారం సాయంత్రం గిరిజన కమ్యూనిటీకి చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గిడ్డంగిని ఆందోళనకారులు తగలబెట్టారు. మణిపూర్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్)తో ఘర్షణ పడ్డారు. ఇతర ఆస్తులపై కూడా దాడికి దిగుతుండడంతో వారిని చెల్లాచెదురు చేయడానికి పోలీసులు బాష్ప వాయు గోళాలు ప్రయోగించారు. ఇంఫాల్ ప్యాలెస్ గ్రౌండ్స్ సమీపంలో ఈ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. గురువారం సాయుధ కుకీ తీవ్రవాదులు విష్ణుపూర్ జిల్లాలోని ఫౌబక్‌చావో గ్రామస్తులపై దాడి చేశారు. వెంటనే వారిని చెల్లాచెదురు చేయడానికి బాష్పవాయు గోళాలను, పొగ బాంబులను ఉపయోగించారు. ఈ ఘర్షణల్లో కొంతమంది మహిళలు గాయపడ్డారు.

శాంతికి కృషి చేస్తున్నాం

మంత్రి ఆర్.కె.రంజన్ పిటిఐతో మాట్లాడుతూ, జాతుల మధ్య ఘర్షణలు చెలరేగిన మే 3వ తేదీ నుండి రాష్ట్రంలో హింస ఆపడానికి, శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రెండు కమ్యూనిటీల మధ్య అవగాహనా లోపమే ఇందుకు కారణమని వ్యాఖ్యానించారు. కేంద్రం శాంతి కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.

మిజోరామ్‌కు ముఖ్యమంత్రి బీరేన్ హెచ్చరిక

మణిపూర్‌లో ప్రత్యేక పాలనను డిమాండ్ చేస్తున్న సంస్థలను మిజోరామ్ ప్రభుత్వం నియంత్రించకపోతే ఇరు రాష్ట్రాల మధ్య సంబంధాలు దెబ్బ తింటాయని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ హెచ్చరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 80చోట్ల పోలీసులు, పేరా మిలటరీ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమరమే..

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఆదిలాబాద్‌లో అంగన్‌వాడీల రాష్ట్ర జీపుజాతా ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమరం తప్పదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవనంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యక్రమంలో భాస్కర్ పాల్గొన్నారు. అలాగే, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న రాష్ట్ర జీపు జాతాను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీలకు గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయడంతోపాటు అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించి.. వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా అంగన్వాడీల సమస్యలలో ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్‌లో కోతలు విధిస్తూ అంగన్వాడీ కేంద్రాలను మూసివేసే దిశగా విధానాలను రూపొందిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్కా భవనాలు, పోషకాహార సెంటర్ గదులు, మెనూ చార్జీలు, ఖాళీ పోస్టులు, పెండింగ్ టీఏ, డీఏ లాంటివి లేకపోవడంతో అంగన్వాడీ ఉద్యోగులు సతమతమవుతున్నారని చెప్పారు. ఇది సరిపోదన్నట్టు ప్రభుత్వాలు ఐసీడీఎస్‌యేతర పనులు, ప్రభుత్వ కార్యక్రమాలు, బీఎల్ఓ డ్యూటీలు తదితర అదనపు పనులతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ.. చిన్న పిల్లలకు ప్రీస్కూల్ పాఠాలను బోధిస్తూ.. ఆరోగ్యభారతాన్ని నిర్మిస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ, పీఎఫ్, ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్.. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పెన్షన్ ఉద్యోగ భద్రతలాంటి సౌకర్యాలు కల్పించాలని తీర్మానం చేసినా ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. అంగన్వాడీలు 1972 చట్టం ప్రకారం గ్రాట్యుటీకి అర్హులని సుప్రీంకోర్టు చెప్పినా ప్రభుత్వాలు వర్తింపచేయడం లేదని అన్నారు.

కేంద్రం 29 కార్మిక చట్టాలను కూడా రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశద్రోహానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి కె.సునీత, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పూరపాటి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, రాష్ట్ర నాయకులు సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటమ్మ, నాయకులు డి. సునీత, పి.రత్నమాల, సుభద్ర, మధునిక, కళ, పంచశీల, పంచపూల, ఖుషి వర్త కళ్యాణి, సంగీత తదితరులు పాల్గొన్నారు.


అది నష్టపరిచే చర్య

- ఆర్బీఐ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- రెండు బ్యాంకు యూనియన్ల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీరుపై రెండు కీలక బ్యాంకు యూనియన్లు అయిన ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడెరేషన్(ఏఐబీఈఏ), ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఓసీ)లు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు సంబంధించిన రుణాల విషయంలో 'రాజీ సెటిల్‌మెంట్'కు బ్యాంకులను అనుమతించడాన్ని అవి తప్పుబట్టాయి. దాదాపు ఆరు లక్షల ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు బ్యాంకు యూనియన్లు.. 'రాజీ సెటిల్‌మెంట్' విషయంలో ఆర్బీఐ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. ఈ మేరకు ఏఐబీఓసీ జనరల్ సెక్రెటరీ రూపం రాయ్, ఏఐబీఈఏ జనరల్ సెక్రెటరీ సీహెచ్ వెంకటాచలం లు ఈ సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. రాజీ సెటిల్మెంట్‌తో పాటు సాంకేతిక రైటాఫ్‌లకు సంబంధించిన ఆర్బీఐ చర్యలు నష్టపరిచేవిగా రెండు బ్యాంకు యూనియన్లు అభివర్ణించాయి. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ సమగ్రతను రాజీపడేలా చేస్తుందని ఆందోళనను వ్యక్తం చేశాయి. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల సమస్యను ప్రభావవంతంగా ఎదుర్కోవడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు చేస్తున్న ప్రయత్నాలను ఇది అణగదొక్కుతుందని వివరించాయి. ఆర్బీఐ తన అనవసరమైన నిర్ణయాన్ని సమీక్షించి ఉపసంహరించుకోవాలనీ, బదులుగా ఉద్దేశపూర్వక ఎగవేతదారులను వారి చర్యలకు జవాబుదారీగా ఉంచడానికి బలమైన చర్యలను అమలు చేయటంపై దృష్టి పెట్టాలని కోరాయి.

మహిళా ఐపీఎస్‌ను వేధించిన సీనియర్ ఐపీఎస్‌కు మూడేండ్ల జైలుశిక్ష

- రాష్ట్ర ఐపీఎస్ వర్గాల్లో చర్చ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర ఐపీఎస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఒక ఘటన తమిళనాడులో చోటు చేసుకున్నది. తమిళనాడులోని ఒక అదనపు డీజీ స్థాయి అధికారి రాజేశ్ దాస్‌కు అక్కడి సెషన్స్ కోర్టు మూడేండ్ల జైలు శిక్షను విధిస్తూ శుక్రవారం ఇచ్చిన సంచలన తీర్పు రాష్ట్ర ఐపీఎస్ వర్గాల్లో చర్చకు దారి తీసింది. వివరాల్లోకెళ్తే.. 2021లో చెంగల్‌పట్‌లో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి బహిరంగ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడానికి స్థానిక మహిళా ఎస్పీ తన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన అదనపు డీజీ రాజేశ్ దాస్‌తో కలిసి కారులో వెళ్తున్నారు. ఆ సమయంలో కారులో తన పక్కన కూర్చున్న ఆ మహిళా ఐపీఎస్‌ను రాజేశ్‌దాస్ లైంగికంగా వేధించాడు. దానితో ఆమె కారు ఆపాలని డ్రైవర్‌ను ఆదేశించి కిందికి దిగిపోయి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించింది. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న మరో ఐపీఎస్ అధికారి ఖండన్.. ఆమెను ఫిర్యాదు చేయకుండా నిలువరించే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని అప్పటి ప్రభుత్వం దృష్టికి బాధితురాలు తీసుకెళ్లగా ఏడుగురు సీనియర్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఈ ఉదంతంపై విచారణ జరిపించి రాజేశ్‌దాస్‌ను సస్పెండ్ చేసింది. ఈ కేసును విచారించిన మద్రాసు సెషన్సు కోర్టు నిందితుడిగా తేలిన రాజేశ్‌దాస్‌కు మూడేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానాను విధించింది. అలాగే, బాధితురాలిని ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్న మరో ఐపీఎస్ అధికారి ఖండన్‌కు రూ.500 లు జరిమానాను విధించింది.

ఈ ఘటన తెలంగాణ రాజేశ్‌దాస్ బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులతో పాటు మరికొందరు ఐపీఎస్ అధికారులలో చర్చనీయాంశంగా మారింది. శాంతిభద్రతలను కాపాడి మహిళలకు భద్రత కల్పించాల్సిన ఐపీఎస్ అధికారులే తోటి మహిళా ఐపీఎస్ అధికారిని లైంగికంగా వేధించటం క్షమార్హం కాని నేరంగా పరిగణించాలని కొందరు మహిళా ఐపీఎస్ అధికారులు అభిప్రాయపడ్డారు.

బిజినెస్

భారత్, చైనాలకు 80 శాతం రష్యా చమురు



న్యూఢిల్లీ : రష్యా చమురు ఎగుమతుల్లో భారత్,చైనా దేశాలు 80 శాతం వాటాను పొందుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో ఇది 14 శాతం పెరిగిందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఎనర్జీ (ఐఇఎ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. రష్యా నుంచి చమురు దిగుమతికి ఇరు దేశాలు పోటీపడుతున్నాయని పేర్కొంది. ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత పశ్చిమ దేశాలు రష్యా చమురు దిగుమతిపై ఆంక్షలు ప్రారంభించాయి. చౌక ధరలో చమురు విక్రయిస్తుండటంతో భారత్, చైనా దేశాలు అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నాయి. భారత్ చమురు అవసరాలు 45 శాతం మేర రష్యా నుంచి తీరుతుండటం విశేషం. రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ముందు యూరోపియన్ దేశాలకే ఎక్కువ ఎగుమతులు జరిగేవి. ఆ సమయంలో రష్యా నుంచి ఆసియా దేశాలకు కేవలం 34 శాతం మాత్రమే ఎగుమతి అయ్యేది. తాజాగా పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు రష్యా చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఆసియా దేశాలకే ఎగుమతి అవుతోంది. గడిచిన నెలలో రష్యా రోజుకు సగటున 3.87 మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు 2 మిలియన్ బ్యారెళ్లను భారత్ దిగుమతి చేసుకుంది. చైనా ఏకంగా 2.2 మిలియన్ బ్యారెళ్లను దిగుమతి చేసుకుంది.

ఒరాకిల్‌లో మళ్లీ ఉద్యోగులపై వేటు..!

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం ఒరాకిల్ మరోమారు ఉద్వాసనలకు పాల్పడనుందని తెలుస్తోంది. ఈసారి హెల్త్ యూనిట్‌లో ఉద్యోగులను ఇంటికి పంపించనున్నట్లు రిపోర్టులు వచ్చాయి. అదే విధంగా కొత్తగా ఆఫర్ చేసిన నూతన నియామకాలను నిలిపివేసింది. 2021 డిసెంబర్‌లో ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్ కంపెనీ సెర్నెర్‌ను ఒరాకిల్ కొనుగోలు చేసిన అనంతరం హెల్త్ యూనిట్‌లో ఉద్వాసనలకు పాల్పడుతోంది. రోగుల ఆరోగ్య సమాచారాన్ని నిర్వహించేందుకు అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టును సెర్నెర్ దక్కించుకోగా, సెర్నెర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో పలువురు రోగులపై ప్రభావం పడటంతో ఈ ఒప్పందం నిలిచిపోయింది. దీంతో ఉద్యోగులను ఇంటికి పంపించాలని భావిస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఒరాకిల్ సుమారు 3,000 మంది ఉద్యోగులను తొలగించింది.

లక్ష కోట్ల వ్యాపారం లక్ష్యం



- రామ్‌దేవ్ బాబా వెల్లడి

న్యూఢిల్లీ: యోగా గురువు రామ్‌దేవ్ బాబా ఆధ్యాత్మికం కంటే వ్యాపారంలో దూసుకుపోవాలని భావిస్తున్నట్లు ఉన్నారు. పతాంజలి గ్రూప్ వివిధ ఆఫర్లతో అన్ని వర్గాల వినియోగదారులకు చేరువకావడంతో వచ్చే ఐదేళ్లలో రూ.1లక్ష కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా మని రామ్‌దేవ్ బాబా అన్నారు. పతాంజలి ఫుడ్స్ (ఇంతక్రితం రుచి సోయా) వ్యాపారాన్ని రూ.45,000- రూ.50,000కు చేర్చడం ద్వారా ఈ మైలురాయిని చేరుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. దేశీయ మార్కెట్‌లోని బహుళజాతి కంపెనీలకు సవాలు విసురుతూ పతంజలి భారతదేశంలో స్వావలంబనపై దృష్టి సారించిందన్నారు. ప్రస్తుతం పతంజలి గ్రూప్ టర్నోవర్ దాదాపు రూ.45,000 కోట్ల స్థాయికి చేరుకుందన్నారు. దేశంలో 70 కోట్ల మంది ప్రజలకు చేరువయ్యామని, 100 కోట్ల మందికి చేరువ కావలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

దేశ వ్యాప్తంగా సిడ్స్ ఫార్మ్ నెయ్యి డెలివరీ

హైదరాబాద్: దేశంలోని ఐదు ప్రధాన నగరాలలో తమ నెయ్యి కలెక్షన్లను అందుబాటులోకి తెచ్చినట్లు డి2సి డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ వెల్లడించింది. "ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరులోని వినియోగదారులు మా నెయ్యి ఉత్పాదనను ఎక్కువగా అభిమానిస్తున్నారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా దీనిని చేరువ చేస్తున్నాము. మా వెబ్‌సైట్‌పై నూతన షాపింగ్ పేజీ ద్వారా దాదాపుగా దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్డర్ చేయవచ్చు. వినియోగదారులకు ఎన్నటికీ నిలిచి ఉండే రుచులను సృష్టించాము." అని సిడ్స్ ఫార్మ్ ఫౌండర్ కిశోర్ ఇందుకూరి పేర్కొన్నారు.

బజాజ్ ఫైనాన్స్‌తో ఏథర్ ఎనర్జీ జట్టు

న్యూఢిల్లీ: విద్యుత్ స్కూటర్ల బ్రాండ్ ఏథర్ ఎనర్జీ కొత్తగా బజాజ్ ఫిన్‌సర్వ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇవి ద్విచక్ర వాహనాల వినియోగదారులకు సులభమైన ఫైనాన్సింగ్ ఎంపికలను అందించేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనుందని ఆ సంస్థ పేర్కొంది. "మా వినియోగదారులకు మరింత లాభదాయకమైన ఫైనాన్సింగ్ ఎంపికలను అందించేందుకు ఏథర్ బలమైన ఆర్థిక సంస్థలతో కలిసి పనిచేస్తుండగా, దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగించనుంది." అని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్‌నీత్ ఫోకెలా పేర్కొన్నారు.

ఫోన్‌పే గేట్‌వేతో వ్యాపార సంస్థలకు ఆదా

న్యూఢిల్లీ : తమ పేమెంట్ గేట్ వే ద్వారా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు రూ.8 లక్షల వరకు ఆదా చేసుకునే వీలు కల్పిస్తోన్నట్లు ఫోన్‌పే పేర్కొంది. చాలా వరకు పేమెంట్ గేట్ వేలు 2శాతంను ప్రామాణిక లావాదేవీ ఫీజుగా వసూలు చేస్తుండగా, ఫోన్‌పే పేమెంట్ గేట్ వే మాత్రం కొత్త వ్యాపారులకు ఆన్ బోర్డింగ్‌ను ఉచితంగా కల్పించే ఒక ప్రత్యేక ఆఫర్ కలిగి ఉందని తెలిపింది.. ఇందులో ఎలాంటి రహస్య ఛార్జీలు, సెటప్ ఫీజు లేదా వార్షిక నిర్వహణ ఫీజులు ఉండవని తెలిపింది. యుపిఐ మార్కెట్‌లో ఫోన్‌పే 50 శాతం పైగా మార్కెట్ వాటాను కలిగి ఉన్నట్లు పేర్కొంది.

సిఎఫ్‌ఒలతోనే దేశం పురోగమనం

- సిఐఐ సమావేశంలో మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్ : దేశ పురోగమనంలో వివిధ సంస్థల్లో పని చేస్తున్న చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్‌ఒ)లు పాత్ర కీలకమైందని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం సిఐఐ ఆధ్వర్యంలో జరిగిన సిఎఫ్‌ఒ-2023 సమావేశానికి ముఖ్య అతిథిగా హరీష్ రావు హాజరై మాట్లాడారు. "సిఐఐ 4వ ఎడిషన్ లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. సాంకేతికత, పరిశోధన, సుపరిపాలన ఈ మూడు అంశాలతో సభ నిర్వహించడం గొప్ప విషయం. సిఎఫ్‌ఒ సభ్యులుగా మీరు చేసే కృషి వల్ల సంస్థతో పాటు ఈ దేశం కూడా బలపడుతుంది. రాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణ అంధకారంలో ఉంటుందని అన్నవాళ్లే ఈరోజు తెలంగాణ మోడల్ అని అంటున్నారు. మన ముఖ్యమంత్రి కెసిఆర్ గారు సిఎఫ్‌ఒ, సిఇఒగా, ముఖ్యమంత్రిగా పని చేశాడు కాబట్టి ఈరోజు తెలంగాణ అభివద్ధిని చూస్తుంది." అని హరీష్ రావు అన్నారు. "దేశం అభివృద్ధి చెందుతోంది అంటే ఇతర దేశాల వారు మన దేశంలో పెట్టుబడులు పెడతారు. కానీ మన దేశంలోని ధనవంతులు ఇతర దేశాలకు వెళ్ళిపోతున్నారంటే మనం అభివృద్ధి చెందుతున్నామా లేక వెనుకబడి పోతున్నామా అని దేశాన్ని పాలిస్తున్న ప్రభుత్వాలు ఆలోచించాలి." అని పేర్కొన్నారు.



ఉద్యోగులను రెట్టింపు చేస్తాం


- అన్‌రావెల్ డేటా వెల్లడి

హైదరాబాద్: ఆధునిక డేటా టీమ్‌ల అవసరాలను తీర్చడానికి నిర్మించిన మొదటి డేటా అబ్జర్విలిటీ ప్లాట్‌ఫారమ్ కంపెనీ విస్తరణ మరియు అభివద్ధిని కొనసాగిస్తున్నందున వచ్చే ఏడాదిలో దాని హైదరాబాద్ హెడ్ కౌంట్‌ని రెట్టింపు చేయాలని యోచిస్తోన్నట్లు యుఎస్ ఆధారిత అన్‌రావెల్ డేటా వెల్లడించింది. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు స్థానిక కార్యకలాపాలను విస్తరించనున్నట్లు పేర్కొంది. స్థానిక టెక్ కమ్యూ నిటీకి సేవలందించేందుకు నిబద్ధతగా అన్‌రావెల్ శుక్రవారం హైదరా బాద్‌లో తన ఫ్లాగ్‌షిప్ డేటాఆప్స్ అబ్జర్విబిలిటీ కాన్ఫరెన్స్ రెండవ భారతీయ ఎడిషన్‌ను నిర్వహించింది. డేటా-లీడింగ్ కంపెనీల నుండి 200 మంది సీనియర్ డేటా, టెక్నాలజీ నిపుణులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్‌రావెల్ కో-ఫౌండర్, సిటిఒ శివనాథ్ బాబు మాట్లాడుతూ.. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా కస్టమర్‌లు చాలా మంది తమ వ్యాపారాన్ని వేగవంతం చేయడానికి హైదరాబాద్‌లో ఉన్న తమ డేటా టీమ్‌లపై ఆధారపడుతున్నారు. కాబట్టి ఇక్కడి మా బందాన్ని, కార్యకలాపాలను పెంచుకోవడమే కాక ప్రపంచ స్థాయి లెర్నింగ్, నెట్‌వర్కింగ్ అవకాశాల ద్వారా స్థానిక టెక్ కమ్యూనిటీకి సేవ చేయడానికి కట్టుబడి ఉన్నాము." అని అన్నారు.

మోడీ మౌనం వీడాలి

విభజన రాజకీయాలకు తక్షణమే ముగింపు పలకాలి

- హింసకు అడ్డుకట్ట వేయాలి
- అల్లర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత
- మణిపూర్ హింసాత్మక పరిస్థితులపై
- 550కు పైగా పౌర సంఘాలు, వ్యక్తుల ఖండన



న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక పరిస్థితులపై దేశవ్యాప్తంగా నలుమూలల నుంచి పౌర సమాజం స్పందించింది. ఇక్కడి పరిస్థితులపై ఆందోళనను వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పెరుగుతున్న హింసను దాదాపు 550కి పైగా పౌర సంఘాలు, ప్రముఖ వ్యక్తులు ఐక్యంగా ఖండించారు. ఈ మేరకు పౌర సంఘాలు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. అన్ని పక్షాలూ కాల్పుల విరమణను ప్రకటించాలని కోరాయి.

కుకీల మీద హింసపై ఆందోళన

ప్రధాని మోడీ తన మౌనాన్ని వీడాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పాయి. హింసకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని ఈ పరిస్థితులకు కేంద్ర, రాష్ట్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలే బాధ్యులని పౌర సంఘాలు పేర్కొన్నాయి.

రాష్ట్ర, భద్రతా బలగాల ద్వారా కొనసాగుతున్న విభజన రాజకీయాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చాయి.

ఎలాంటి చర్చలు జరపడానికి, తీర్మానం చేయడానికి అర్థవంతమైన ప్రయత్నాలను చేయకుండానే.. బీజేపీ మెయిటీ, కుకీ, జో వర్గాల మధ్య చారిత్రక గందరగోళాన్ని తీవ్రతరం చేస్తున్నదనీ, విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించాయి. కుకీలకు వ్యతిరేకంగా సాయుధ మెయిటీ మెజారిటీ గ్రూపులైన అరంబయ్ టెంగ్గోల్, మెయిటీ లీపున్‌లు చేస్తున్న హింసపై ఆందోళనను వ్యక్తం చేశాయి.

కోర్టు పర్యవేక్షణలోని ట్రిబ్యునల్‌కు డిమాండ్

అల్లర్ల నేపథ్యంలో ప్రధాని జవాబుదారీతనంతో పాటు ప్రభుత్వం నుంచి అనేక కీలక చర్యలకు పౌర సంఘాలు డిమాండ్ చేశాయి. నిజాలు నిగ్గు తేల్చడానికి, న్యాయాన్ని కల్పించడానికి కోర్టు పర్యవేక్షణలోని ట్రిబ్యునల్‌కు పిలుపునిచ్చాయి. వర్మన్ కమిషన్ సూచించినట్టుగా లైంగిక హింస కేసుల పరిష్కారం కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని పౌర సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఇండ్లు వదిలి పారిపోయిన వారికి సహాయక చర్యల ప్రాముఖ్యతను ఈ ప్రకటన నొక్కి చెప్పింది.

'రిటైర్డ్ జడ్జిలతో ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలి'

పునరావాసం, పరిహారం, ఇండ్లకు తిరిగి వచ్చే ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఈ ప్రాంతంతో సంబంధమున్న రిటైర్డ్ జడ్జీలతో ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలనీ, వీరిని సుప్రీంకోర్టు లేదా హైకోర్టు ద్వారా నియమించాలని సూచించింది.

ఈ సంయుక్త ప్రకటనను విడుదల చేసినవారిలో ఎంపీ మనోజ్ కుమార్ ఝా, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు మీనా గుప్తా, పి గంగ్దే, మీరన్ బోర్వాంకర్ పలువురు సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, సినిమా కళాకారులు, రచయితలు, లాయర్లు ఉన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితుల్లో పూర్తి వైఫల్యం

మణిపూర్‌లో శాంతి భద్రతల పరిస్థితులు పూర్తిగా వైఫల్యం చెందాయని సాక్షాత్తూ కేంద్ర మంత్రి ఆర్కే రంజన్ సింగ్ అన్నారు. హింసాత్మక అల్లర్లలో భాగంగా ఆందోళనకారులు తూర్పు ఇంఫాల్‌లోని ఆయన ఇంటికి నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. అనంతరం శుక్రవారం నాడు రంజన్ సింగ్ శాంతి భద్రతల వైఫల్యంపై వ్యాఖ్యలు చేయటం ప్రాధాన్యతను సంతరించుకున్నది. మణిపూర్‌లో బీజేపీ సర్కారు ఉండటం, సాక్షాత్తూ కేంద్ర మంత్రి స్థాయి వ్యక్తే ప్రభుత్వ వైఫల్యం ఉన్నదని చెప్పటం చర్చకు దారి తీసిందని విశ్లేషకులు అన్నారు.

గతనెల 25 తర్వాత మొదటి సారి ఆయన ఇంటిపై దాడి జగింది. ఇటీవల జరిగిన దాడి రెండోది కావటం గమనార్హం. మొదటిసారి మెయిటీ గ్రూపే భారీ సంఖ్యలో వచ్చి దాడి చేసింది. ఇటు కేంద్ర మంత్రి కూడా అదే సామాజిక వర్గానికి చెందినవాడు అయినప్పటికీ ఆయన ఇల్లు దాడికి గురి కావటం గమనార్హం. రాష్ట్రంలోని ప్రస్తుత ప్రభుత్వం శాంతిని కాపాడలేకపోయిందని ప్రస్తుతం కేరళ పర్యటనలో ఉన్న రంజన్‌సింగ్ ఆరోపించారు.

కేంద్ర మంత్రి

కేరళలో బీజేపీకి షాక్

- పార్టీని వీడిన చిత్ర దర్శకుడు అలీ అక్బర్
- ఇప్పటికే కాషాయపార్టీకి రాజీనామా చేసిన సినిమా డైరెక్టర్ రాజసేనన్

తిరువనంతపురం:సినీ గ్లామర్‌ను ఉపయోగించుకొని కేరళ రాజకీయాల్లో లబ్ధి పొందాలని భావిస్తున్న బీజేపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. చిత్ర దర్శకుడు అలీ అక్బర్ అలియాస్ రామసింహన్ అబూబక్కర్(60) బీజేపీకి రాజీనామా చేశారు. గత పది రోజుల్లో కేరళలోని బీజేపీతో విభేదించటం, పార్టీని వీడటం చేసిన సినీ వ్యక్తులలో అలీ అక్బర్ మూడోవారు కావటం గమనార్హం. గతేడాదే ఇస్లాంను వీడి హిందూ మతంలోకి మారిన అలీ అక్బర్.. తన పేరును రామసింహన్ అబూబక్కర్‌గా పేరు మార్చుకున్నాడు.

ఆయన తన నిర్ణయాన్ని ఫేస్‌బుక్ పోస్టులో ప్రకటించారు. అలాగే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె సురేంద్రన్‌కు తెలుపుతూ ఏక వాక్య రాజీనామా పత్రాన్ని సైతం ఆయన పోస్టు చేశారు. " నేను ఎలాంటి రాజకీయాలకూ బానిసను కాను. ఇప్పుడు నేను అన్నింటి నుంచి విముక్తుడన య్యాను. ధర్మం కోసమే నిలబడతాను" అని రామసింహన్ వివరించారు.

బీజేపీ పార్టీ తరఫున ఉన్న ముస్లిం వ్యక్తులలో అత్యంత ప్రముఖుడైన అక్బర్ 2021 అక్టోబరులో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వైదొలిగారు. అప్పటి నుంచి ఆయన పార్టీలో ఒక సాధారణ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

ఉత్తర కేరళలోని ముస్లింలలో ఆరెస్సెస్ గురించి ప్రచారం కలిపించేందుకు బీజేపీ అక్బర్‌ను వాడుకోవాలనుకున్నది. అయితే ఆయన పార్టీని వీడటంతో బీజేపీకి గట్టి దెబ్బ తగిలినట్టయిం దని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగిన ప్రముఖ మళయాల చిత్ర దర్శకులు రాజసేనన్.. గతవారమే ఆ పార్టీని వీడారు. అలాగే, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన నటుడు భీమన్ రఘు.. తాను కూడా బీజేపీని వీడనున్నట్టు సంకేతాలు పంపారు. తాను సీఎం పినరయి విజయన్‌కు గొప్ప అభిమానిననీ, ఆయనతో సమావేశం తర్వాత తన తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తానని రఘు గతవారమే వెల్లడించాడు.

టీఎస్‌పీఎస్‌సీ సభ్యుల నియామకాలను పున:పరిశీలించండి : హైకోర్టు తీర్పు



హైదరాబాద్:తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్స్ నియామకాలను సవాల్ చేసిన కేసులో హైకోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. ఆరుగురు టీఎస్పీఎస్సీ సభ్యుల నియామకాన్ని పున: పరిశీలించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. బండి లింగారెడ్డి, కారం రవీందర్ రెడ్డి, ఆర్.సత్యనారాయణ, రమావత్ ధన్ సింగ్, సుమిత్ర ఆనంద్ తనోబా, ఆరవెల్లి చంద్రశేఖర్‌ల నియామకాలను తిరిగి పరిశీలన చేయాలంది. ఆరుగురి నియామకాలను రద్దు చేయాల్సిన పరిస్థితి ప్రస్తుత దశలో అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ 80 పేజీల తీర్పును వెలువరించింది. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ ఎ.వినాయక్ రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను అనుమతించింది.

టీఎస్పీఎస్సీ సభ్యులను నియమిస్తూ 2021 మే 19న జారీ చేసిన జీవో 108ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు సుదీర్ఘ వాదనలు పూర్తి చేసి గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన తీర్పును రిజర్వులో పెట్టింది. ఆరుగురు సభ్యుల నియామకాలు చట్ట నిబంధనలకు అనుగుణంగా చేయాలంది. ఈ ప్రక్రియను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఆరుగురి నియామకం ప్రభుత్వ తాజాగా చేయబోయే కసరత్తుపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామకాలకు ప్రభుత్వం తగిన ప్రక్రియను అమలు చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని తీర్పు చెప్పింది.

ప్రజా సంబంధాలే కీలకం



- బిల్‌గేట్స్‌తో భేటీలో జిన్‌పింగ్

బీజింగ్ : మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో శుక్రవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ప్రపంచ దేశాల్లో పేదరిక నిర్మూలనకు, ఆరోగ్యం, అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న గేట్స్ ఫౌండేషన్ కృషిని జిన్‌పింగ్ ప్రశంసించారు.

సంబంధిత రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, ఇతర వర్ధమాన దేశాలకు సాయం చేయడానికి బిల్‌గేట్స్, ఆయన ఫౌండేషన్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సుముఖంగా వుందని చెప్పారు. ఈ ఏడాది బీజింగ్‌లో కలిసిన మొదటి అమెరికన్ మిత్రుడు మీరేనని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ప్రజల మధ్య నెలకొనే సంబంధాల్లోనే చైనా-అమెరికా సంబంధాల పునాది వుందని తాను తరుచుగా చెబుతుంటానని అన్నారు. అమెరికన్లపై తమకెపుడూ ఆశాభావం వుంటుందన్నారు. ఇరు దేశాల ప్రజలు స్నేహ సంబంధాలను కొనసాగించాలని ఆశిస్తున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. వినూత్న అభివృద్ధిని చైనా మరింత వేగిరం చేస్తోందని గేట్స్ వ్యాఖ్యానించారు. ఇది చైనాకే కాకుండా, వర్ధమాన దేశాలకు, యావత్ ప్రపంచానికి ప్రయోజనకరమని అన్నారు. ప్రజారోగ్యం, ఫార్మాస్యూటికల్ పరిశోధన, అభివృద్ధి, గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో, వినూత్న అభివృద్ధి, దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాల్లో చైనాతో సహకారాన్ని తమ ఫౌండేషన్ బలపరుచుకుంటుందని తెలిపారు.

పోటీ ముసుగులో ప్రయోజనాలు దెబ్బతీయలేరు


- అమెరికాపై చైనా ఆగ్రహం

చైనా వ్యక్తం చేసే కీలకమైన ఆందోళనలను అమెరికా గౌరవించాలని, తమ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం లేదా పోటీ సాకుతో చైనా సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను ప్రమాదంలో పడేయడాన్ని ఆపాలని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ శుక్రవారం పేర్కొన్నారు. తైవాన్ జలసంధిలో సైనిక ఘర్షణ చెలరేగగలదని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హెన్రీ కిస్సింగర్ చేసిన హెచ్చరికపై అడిగిన ప్రశ్నకు వెన్‌బిన్‌పై విధంగా స్పందించారు. చైనా-అమెరికా మధ్య నెలకొన్న ప్రతిష్టంభన గతంలో ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో వుందని కిస్సింగర్ వ్యాఖ్యానించారు. చైనా - అమెరికా సంబంధాలు ప్రపంచ దేశాలకు గొప్ప ప్రాధాన్యత గలవని వాంగ్ అన్నారు. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, ద్వైపాక్షిక సంబంధాల నిర్వహణలో సమాన అవకాశాలు, సమాన సహకారం వుండాలన్న సూత్రాన్ని చైనా ఎల్లప్పుడూ పాటిస్తుందని పేర్కొన్నారు. బాలిలో ఇరు దేశాల అధ్యక్షుల మధ్య కుదిరిన కీలకమైన ఏకాభిప్రాయాన్ని అమలు చేసేందుకు అమెరికా ఆచరణాత్మక చర్యలు తీసుకోగలదని వాంగ్ వెన్‌బిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను తిరిగి సుస్థిరపరిచేలా కమ్యూనికేషన్ సంబంధాలను, సహకారాన్ని పెంపొందించేందుకు, అభిప్రాయ భేదాలను సమర్ధవంతంగా తగ్గించుకోవడానికి చైనా తన వంతు కృషి చేస్తుందన్నారు.

మరో 8 మెడికల్ కాలేజీలు

వచ్చే ఏడాదే ప్రారంభం

- ప్రతిపాదనలు ఇవ్వండి : మంత్రి టీ హరీశ్‌రావు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 25 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామనీ, వచ్చే విద్యా సంవత్సరానికి మిగిలిన 8 జిల్లాల్లో నూతన మెడికల్ కాలేజీలకు ప్రతిపాదనలు రూపొందించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. 9 ఏండ్లలో 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి దేశంలోనే రికార్డు సష్టించామన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారంనాడాయన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హెల్త్ సెక్రెటరీ రిజ్వి, కమిషనర్ శ్వేతా మహంతి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి ,డీఎంఇ రమేష్ రెడ్డి, డిహెచ్ శ్రీనివాసరావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , టిఎస్‌ఎం ఎస్ఐడిసి ఎండీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 8 జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాలలకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారుల్ని ఆదేశించారు. స్పెషాలిటీ సేవలు జిల్లా పరిధిలోనే అందాలనే ఉద్దేశ్యంతోనే మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా వందో రోజుకు చేరడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 99 పనిదినాల్లో కోటి 61 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 40.59 లక్షల మందికి దష్టిలోపం ఉన్నట్టు గుర్తించామనీ, 22.51 లక్షల మందికి రీడింగ్ గ్లాసులు, 18.08 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేసినట్టు అధికారులు వివరించారు.

జమ్ము కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ (జమ్ము కాశ్మీర్) : జమ్ము కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య శుక్రవారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు. ఉగ్రవాదుల గురించి కచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు, ఆర్మీ సంయుక్తంగా గాలింపు చర్యలు నిర్వహిస్తున్నాయని కాశ్మీర్ జోన్ పోలీసు విభాగం తెలిపింది. ఇప్పటివరకు ఐదుగురు ఉగ్రవాదులు మరణించినట్లు ట్వీట్ చేసింది.

నితీశ్ క్యాబినెట్‌లోకి రత్నేష్ సదా

పాట్నా : బిహార్‌లో క్యాబినెట్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. ఇటీవల రాజీనామా చేసిన సంతోష్ కుమార్ సుమన్ స్థానంలో జెడి (యు) ఎమ్మెల్యే రత్నేష్ సదా శుక్రవారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జెడి (యు)లో విలీనం కావాలనే ఒత్తిడి నేపథ్యంలో తమ పార్టీని కాపాడుకునేందుకంటూ హిందుస్తానీ అవమ్ మోర్చా (హెచ్‌ఎఎం)కి చెందిన మాజీ సీఎం జితమ్‌రామ్ మాంజీ కుమారుడు సంతోష్‌కుమార్ సుమన్ మంత్రి పదవికి ఈ నెల 13న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రత్నేష్ సదా మాట్లాడుతూ హెచ్‌ఎఎం అధ్యక్షుడు జితమ్ రామ్ మాంజీ, సుమన్ దళితులకు, ముసాహర్ కమ్యూనిటీకి చేసిందేమీ లేదని అన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి :

బీసీ సంక్షేమ సంఘం నేత, రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య

- జూలైలో లక్షలాది మందితో పార్లమెంట్ ముట్టడి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

చట్టసభల్లో 50 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూలైలో బీసీ సంఘం ఆధ్వర్యంలో లక్షలాది మందితో పార్లమెంట్‌ను ముట్టడించనున్నట్లు రాజ్యసభ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీల బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఏపీ భవన్‌లో బీసీ సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఎన్. మారేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలలో పర్యటించి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో భారీ బహిరంగ సభలు జరపాలని, బీసీలు పార్టీలక తీతంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయం చేశారు. అలాగే ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంటగా బత్తుల హరి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో గత 75 ఏండ్లుగా పాలించిన కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదన్నారు. ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామా జిక రంగాలలో కనీస ప్రాతినిధ్యం లభించలేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాలలో వాటా ఇవ్వాలని, కానీ 70 ఏండ్లుగా బీసీలకు వాటా ఇవ్వడం లేదని విమర్శించారు. దేశంలో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు.వారికి రావాలసిన వాటా కోసం మరోసారి అధ్యయనం జరుగాలని డిమాండ్ చేశారు. 56 శాతం జనాభా గల బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 9 శాతం, పారిశ్రామిక రంగంలో ఒక శాతం, ప్రైవేటు రంగంలోని ఉద్యోగాలలో 5 శాతం ప్రాతినిధ్యం లేదంటే బీసీలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలుపుతుందని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్. మారేష్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బీసీల జనాభా ప్రాతిపదికన 27 శాతం నుండి 56 శాతానికి పెంచాలని కోరారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయ మూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని, కేంద్రం లో బీసీలకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్‌మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగా లను భర్తీ చేయాలని కోరారు. కేంద్ర స్థాయిలో రెండు లక్షల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కల్లో బీసీ కులాల లెక్కలు సేకరించాలని కోరారు. బత్తుల వెంకటరమణ మాట్లాడుతూ జూలైలో 25వేల మందితో కదిరి నియోజకవర్గంలో బీసీ గర్జన నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో భాషయ్య వేలు, జనా ర్ధన్, రాహుల్ తది తరులు పాల్గొన్నారు.